అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 5-2-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక | www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 35 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00

మూగబోయిన సుమధురవాణి



- 19 భాషల్లో 20 వేలకు పైగా పాటలు
- ఉత్తమ గాయనిగా మూడు జాతీయ అవార్డులు
- వాణీజయరాంకు ఇటీవలే పద్మభూషణ్ ప్రకటించిన కేంద్రం
- మృతిపై అనుమానాలు?

హైదరాబాద్ : దిగ్దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్ మరణ విషాదం నుంచి తేరుకోకముందే మరో గొప్ప గాయనిని తెలుగు చిత్ర పరిశ్రమ కోల్పోయింది. గత ఐదు దశాబ్దాలుగా తన సుమధుర గానంతో ఆబాలగోపాలాన్ని అలరించిన ప్రముఖ గాయని వాణీజయరాం (78) కన్నుమూశారు. చెన్నైలోని నుంగమ్‌బక్కమ్‌లో ఉన్న తన నివాసంలో శనివారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచినట్టు బంధువులు తెలిపారు. ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు వసంత్‌దేశాయ్ సహకారంతో 'గుడ్డి' సినిమాలోని 'బోలో రే పపి హరా..' పాటతో ఆమె సినీ గాన ప్రస్థానం మొదలైంది. అనతికాలంలోనే బాలీవుడ్‌లో అగ్ర గాయనిగా నిలిచిన ఆమె హిందీతోపాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, మరాఠి, బెంగాలీ, తులు, భోజ్‌పురి.. ఇలా 19 భాషల్లో దాదాపు 20 వేలకు పైగా భిన్న పాటలతో అలరించారు.

ఏ భాషలోనైనా సరే కొత్త నటీమణులకు పాడించాలన్నా, కష్టతరమైన పాటలున్నా సరే.. అలాంటి వారికి కేరాఫ్‌గా వాణీజయరాం నిలిచారు. మూడుసార్లు ఉత్తమగాయనిగా జాతీయ అవార్డులు పొందారు. సంగీత రంగానికి ఆమె చేసిన సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది.

అయితే వాణీ జయరాం మృతిపట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ముఖంపై ఎవరో కొట్టినట్లుగా తీవ్ర గాయాలు ఉండటంతో ఆమెది సహజ మరణమేనా లేక ఏమైనా కుట్ర జరిగిందా..? అని పలువురు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. వాణీ జయరాం ఇంట్లో పనిచేసేందుకు వచ్చిన మహిళ ఫ్లాట్ తలుపుతట్టగా లోపలి నుంచి స్పందన లేదు. ఆమె ఐదుసార్లు కాలింగ్ బెల్ కొట్టినా తలుపు తీయలేదు. దాంతో పనిమనిషి భర్త తన ఫోన్‌లోంచి వాణీ జయరాం ఫోన్‌కు కాల్ చేశాడు. అయినా ఆమె ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దాంతో అనుమానం వచ్చిన ఆమె పోలీసులకు ఫోన్ చేసి, స్థానికుల

...5లో

దేశమంటే అదానీ ప్రధానే కాదు

140 కోట్ల ప్రజలని చాటిచెప్పుదాం



ఒక దొంగపై దాడిని దేశంపై దాడిగా ఎలా చిత్రీకరిస్తారు?

- మోడీ దేనికి, ఎవరికి దేవుడు?
- మేం రైతు రాజ్యమంటే.. మోడీ కార్పొరేట్ల రాజ్యమంటున్నారు
- మాకు సామాన్య పౌరుడే ముఖ్యం
- వేటకుక్కల్లా కొన్ని సంస్థలను ఉసిగొల్పి ఏమీ సాధించలేరు
- బీసీ జనగణనపై మోడీ సర్కారు మొండిపట్టు
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'తెలంగాణలో ప్రగతిలాగానే దేశంలో కూడా జరిగి ఉంటే 5 ట్రిలియన్ల డాలర్ల ఎకనామి లక్ష్యం ఎప్పుడో నెరవేరేది. అలా జరగట్లేదు. దొంగపై దాడి జరిగితే దేశంపై దాడి జరుగుతున్నట్టు ఎందుకు చిత్రీకరిస్తున్నారో అర్థం కావటం లేదు. దేశంలో ఇప్పుడు అదానీ, మోడీ గురించే చర్చ నడుస్తున్నది. ప్రధాని, అదాని మాత్రమే ఈ దేశానికి ప్రతినిధులా? దేశమంటే వారిద్దరే కాదు..140 కోట్ల ప్రజలని చాటి చెప్పాల్సిన అవసరముంది' అని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు వ్యాఖ్యానించారు. తాము రైతు రాజ్యం కోసం కృషి చేస్తుంటే బీజేపీ సర్కారు కార్పొరేట్ల రాజ్యం స్థాపన కోసం పనిచేస్తున్నదని విమర్శించారు. సంక్షేమ పథకాలు, ఉచితాలతో ప్రజలు సోమరిపోతులుగా మారుతున్నారంటూ బీజేపీ నేతలు మాట్లాడటమేంటని నిలదీశారు. ఆ పార్టీ నేతలు మోడీని దేవుడు, దేవుడు అంటున్నారనీ, ఢిల్లీలో జరిగిన రైతుల పోరాటంలో 700 మంది రైతుల చావుకు కారణమైన ఆయన ఎవరికి దేవుడు? దేనికి దేవుడు? అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక తెలంగాణ మీదకు వేటకుక్కల్లాంటి సంస్థలను ఉసిగొల్పుతున్నారని విమర్శించారు. ఇలాంటి ఎన్ని జిమ్మిక్కులు చేసినా తమను ఏమీ చేరలేరనీ, వారికి రాష్ట్రంలో ఒరిగేదేమీ ఉండని బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సుదీర్ఘంగా చర్చ కొనసాగింది. తీర్మానాన్ని సండ్రవెంకటవీరయ్య ప్రవేశపెట్టగా...చర్చలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, సభ్యులు కేపీ వివేకానంద, రఘునందన్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,

...2లో

9న బ్లాక్ డే



రైతు, వ్యవసాయ, కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌కు నిరసన

- బడ్జెట్ ప్రతుల దహనం, ప్రదర్శనలు, ధర్నాలకు ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ పిలుపు

న్యూఢిల్లీ : రైతు, వ్యవసాయ, కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 9న బ్లాక్ డే పాటించాలని ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు శనివారం నాడిక్కడ ఆయా సంఘాల కేంద్ర కార్యాలయం (క్యానింగ్ లైన్ 36)లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, కోశాధికారి పి కృష్ణప్రసాద్, రాజ్యసభ ఎంపీ, ఏఐఏడబ్ల్యూయూ సహాయ కార్యదర్శి వి.శివదాసన్ మాట్లాడారు. క్రూరమైన రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ 9న బడ్జెట్ ప్రతులను దహనం చేయడం, దిష్టిబొమ్మల దహనం, ప్రదర్శనలు, ధర్నాలు, బహిరంగ సభలు తదితర కార్యక్రమాలను నిర్వహించడంతో ఈ బ్లాక్ డేని నిర్వహిస్తామన్నారు. కేంద్ర బడ్జెట్ దేశంలోని పేద ప్రజలపై ప్రత్యేకించి రైతాంగం, శ్రామిక వర్గం,

...5లో



పేదలందరికీ ఇండ్లస్థలాలివ్వాలి

- సొంత జాగాలో ఇల్లు కట్టుకునేందుకు డబ్బులివ్వాలి
- మన ఊరు - మనబడి పనులను పూర్తి చేయాలి
- పీహెచ్‌సీలను పటిష్టపరచాలి
- సేద్యం చేయని భూములకు రైతుబంధు ఇవ్వొద్దు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని పేదలందరికీ ఇండ్లు, ఇండ్లస్థలాలివ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సొంత జాగా ఉన్న వారు ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే

...5లో

అక్బర్ వర్సెస్ కేటీఆర్

- సభా నాయకుడే బీఏసీకి రావట్లేదు : ఎంఐఎం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనసభా బడ్జెట్ సమావేశాల రెండో రోజైన శనివారం సభ హీటెక్కింది. ప్రధాన ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, మంత్రి కేటీఆర్ మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. వారిరువురూ ఒకరిపై మరొకరు సెటైర్లు విసురుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై అక్బర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించగా... గట్టిగా మాట్లాడి గొంతు చించుకోవటం వల్ల ఉపయోగం ఉండబోదంటూ కేటీఆర్ చురకలంటించారు. దీంతో సభలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా శనివారం శాసనసభలో

...5లో

పోడు భూముల ప్రస్తావనేది?

కాంగ్రెస్ సభ్యుడు పోడెం వీరయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గవర్నర్ ప్రసంగంలో పోడు భూముల ప్రస్తావన లేకపోవటం విచారకరమని కాంగ్రెస్ సభ్యుడు పోడెం వీరయ్య తెలిపారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ పోడు భూములకు హక్కు పత్రాలకోసం నాలుగు లక్షలకు పైగా దరఖాస్తులొచ్చాయని తెలిపారు. ఈ అంశాన్ని గవర్నర్ ప్రసంగంలో చేర్చకపోవటం సరికాదన్నారు. సీతరామ సాగర్ నిర్వాసితులకు తగిన నష్టపరిహారం ఇవ్వలేదని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో చాలా చోట్ల తాగు నీటి సౌకర్యం లేదన్నారు. వీటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం రూ.3 వేలకు పెంపు

రాష్ట్రం వాటా రూ.2,400, కేంద్రం వాటా రూ.600

- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మధ్యాహ్న భోజనం (పీఎం పోషణ్) కార్మికుల గౌరవ వేతనాన్ని రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుతం వారికి రూ.వెయ్యి చెల్లిస్తున్నామని తెలిపారు. ఇందులో కేంద్రం రూ.400, రాష్ట్రం రూ.600 భరిస్తాయని పేర్కొన్నారు. గౌరవ వేతనం రూ.మూడు వేలకు పెంచడంతో ఇందులో కేంద్రం రూ.600, రాష్ట్ర ప్రభుత్వం రూ.2,400 (అదనంగా రూ.2 వేలు) చెల్లిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా 60 శాతం, కేంద్రం 40 శాతం నిష్పత్తి ప్రకారం వేతనాన్ని చెల్లిస్తాయని వివరించారు. గతేడాది మార్చి 15న అసెంబ్లీలో మధ్యాహ్న భోజనం వంట కార్మికుల గౌరవ వేతనం

...5లో

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

మోటార్ వెహికల్ యాక్ట్-2019 సవరించాలి

- కేరళ తరహా యాప్‌ను ప్రభుత్వం తేవాలి
- రవాణారంగ కార్మికుల డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు



నవతెలంగాణ- విలేకరులు

"రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తూ వెంటనే అసెంబ్లీలో ప్రకటన చేయాలి.. మోటార్ వెహికల్ యాక్ట్-2019ను సవరించడంతోపాటు కేరళ తరహాలో యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తేవాలి" అని కార్మికులు డిమాండ్ చేశారు. తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా

...5లో

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి


తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ విషయంలో తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పత్తి దిగుబడి బాగా తగ్గిందని వివరించారు. ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, సగటున ఐదు క్వింటాళ్లు మాత్రమే వచ్చిందని పేర్కొన్నారు. సీజన్ ప్రారంభంలో క్వింటాల్ పత్తి ధర రూ.9,800లు ఉండగా, దళారీల మోసం వల్ల ఇప్పుడు రూ.ఏడు వేలలోపే అమ్మకాలు సాగుతున్నాయని వివరించారు. వారి లాభాల కోసం రైతులను మోసం చేస్తున్న మార్కెట్ వ్యవస్థలు, కార్పొరేట్ సంస్థలు,

...5లో





ఆమెకేది రక్షణ!



పసికందులపై పైశాచికం

- మహిళలు, బాలికలపై ఆగని లైంగికదాడులు
- పెరుగుతున్న గృహ హింస కేసులు
- పనిచేయని రక్షణ చట్టాలు

నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఇల్లు, బడి, పనిచేసే ప్రదేశం.. ప్రాంతం ఏదైనా ఆమెపై లైంగిక వేధింపులు ఆగడం లేదు. ఇంట్లో రక్షించే తండ్రే కామాంధుడు అవుతున్నాడు. బడిలో అన్నగా భావించే తోటి విద్యార్థే అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. ఎక్కడా ఆమెకు రక్షణ లేకుండా పోతోంది. ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా ఆమెను కాపాడలేకపోతున్నాయి. రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లాలో మహిళలు, బాలికలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. సఖీ కేంద్రాల్లో నమోదు అవుతున్న కేసులే ఇందుకు నిదర్శనం. రక్షణ లేక బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న మహిళలపై కథనం.

రంగారెడ్డి జిల్లాలో గృహహింస కేసులు, మహిళలపై అఘాయిత్యాలు, బాలికలపై కామాంధుల లైంగిక వేధింపులు, ఆడపిల్లను భారంగా భావించిన తల్లిదండ్రులు చిత్రహింసలకు గురిచేసే సంఘటనలు పెరిగిపోతున్నాయి. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని గత నెల 20 మధ్యాహ్నం సమయంలో కాస్మొటిక్స్ కొనుగోలు కోసం హాస్టల్ నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై టీచర్లు ఆరా తీశారు. తెలిసిన వాళ్లే ఆమెను బయటికి తీసుకెళ్లి, మాయమాటలు చెప్పి ఆమెపై లైంగికదాడికి యత్నించినట్టు గుర్తించారు. నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేయించారు. ఫరూఖ్‌నగర్ మండలం కంసానిపల్లికి చెందిన 14 ఏండ్ల బాలికపై కన్న తండ్రే కన్నేశాడు. ఆమెకు మాయమాటలు చెప్పి, శారీరకంగా ఆమెను లొంగదీసుకుని, గర్భవతిని చేశాడు. తల్లిలేని బిడ్డను కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే ఆమె జీవితాన్ని నాశనం చేశాడు. నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేయించారు. హయత్‌నగర్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై తోటి విద్యార్థులే ఇటీవల అఘాయిత్యానికి పాల్పడ్డారు. మహేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో ఓ టీచర్‌పై కూడా ఇదే అభియోగంపై పోక్సో యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. ఇలా జిల్లాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అమాయక ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి.

అఘాయిత్యాలకు గురైన వారికి అండగా ఉంటున్నాం

అమాయక బాలికలను నమ్మించి వారిపై శారీరక, మానసిక వేధింపులకు గురి చేస్తున్నారు. చిన్నారుల భవిష్యత్తును చిదిమేస్తున్నారు. సఖి వన్ స్టాఫ్ కేంద్ర నిర్వహకులు వీరికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. దోషులకు శిక్షపడే విధంగా బాధితుల తరపున పోరాటం చేస్తున్నారు. అఘాయిత్యాలకు గురైన వారికి తాత్కాలిక వసతి కల్పించడంతో పాటు నష్టపరిహారం అందిస్తున్నాం. అంతేకాదు, బాధితుల తరపున న్యాయస్థానాల్లో కొట్లాడేందుకు అవసరమైన న్యాయ సేవా సహకారం కూడా అందిస్తున్నాం.

- మోతి, స్త్రీ, శిశు సంక్షేమ జిల్లా అధికారి

జిల్లా సఖీ కేంద్రానికి ఫిర్యాదుల వెల్లువ

మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో సఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లాలోని ఈ కేంద్రానికి బాధితుల నుంచి భారీగా ఫిర్యాదులు (29,496) అందుతున్నాయి. 2018లో 1,029 కేసులు, 2019లో 959 కేసులు, 2020లో 941 కేసులు నమోదు కాగా, 2021లో 978 కేసులు నమోదయ్యాయి. తాజాగా

...5లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

యూపీ పోలీసులు వేధించారు..

తీవ్రవాదులతో సంబంధాలున్నాయని ఒప్పుకోవాలని బలవంతపెట్టారు..

- హత్రాస్ లైంగికదాడి ఘటన దృష్టి మరల్చేందుకే ఇదంతా : జర్నలిస్టు సిద్దికీ కప్పన్
- నాపై మోపిన ఆరోపణలకు ఆధారాల్లేవు..
- బెయిల్ లభించటం.. పూర్తి న్యాయం కాదు..

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ పోలీసులు తనను తీవ్రంగా వేధించారని మలయాళ జర్నలిస్టు సిద్దికీ కప్పన్ ఆరోపించారు. మావోయిస్టు, తీవ్రవాద గ్రూపులతో సంబంధాలున్నాయని ఒప్పుకోవాలని పోలీసులు బలవంత పెట్టారని, ఒప్పుకోకపోయేసరికి తీవ్రంగా కొట్టారని తాజాగా మీడియాతో మాట్లాడుతూ కప్పన్ చెప్పారు. లక్నో నుంచి ఢిల్లీ వెళ్తుండగా మీడియాతో మాట్లాడుతూ కప్పన్ పై వ్యాఖ్యలు చేశారు. బెయిల్ నిబంధనల్లో భాగంగా ఆయన ఆరు వారాలు ఢిల్లీలో ఉండాల్సి వస్తోంది. పోలీస్ కస్టడీలో తాను ఎదుర్కొన్న వేధింపులు, ఇతర విషయాలు మీడియాకు తెలిపారు. కప్పన్‌పై యూపీ పోలీసులు నమోదుచేసిన కేసులో సెప్టెంబర్ 2022లో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేసింది. కేంద్రం కప్పన్‌పై ఈడీ కేసు నమోదుచేసింది. ఆయన కుటుంబం ఎంతో శ్రమకోర్చి చేసిన పోరాటం ఫలితంగా చివరికి ఈడీ కేసులోనూ కప్పన్‌కు బెయిల్ దక్కింది. ఫిబ్రవరి 2న జైలు నుంచి బయటకు వచ్చారు. అనంతరం లక్నో నుంచి ఢిల్లీకి వెళ్తూ, పోలీస్ కస్టడీలో తాను ఎదుర్కొన్న వేధింపుల్ని మీడియాకు వివరించారు.

"పాకిస్తాన్‌కు ఎప్పుడైనా వెళ్లావా? బీఫ్ (ఆవు మాంసం) తిన్నావా? అంటూ అనవసర ప్రశ్నలతో మానసికంగా వేధించారు. పోలీసు కస్టడీలో భయంకరమైన వేధింపులు ఎదుర్కొన్నా. సుప్రీంకోర్టు కలుగజేసుకొని బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాను. బెయిల్ లభించటంతో పూర్తి న్యాయం దక్కిందని భావించటం లేదు" అని అన్నారు.

43ఏండ్ల సిద్దికీ కప్పన్ మలయాళ మ్యాగజైన్ విలేకరి. పార్లమెంట్, కాంగ్రెస్, మైనార్టీల వ్యవహారాలపై వార్తలు రాస్తుండేవారు. హత్రాస్‌లో దళిత యువతిపై లైంగికదాడి, హత్య ఘటన రిపోర్ట్ చేయడానికి అక్టోబర్, 2020లో ఉత్తరప్రదేశ్ వెళ్లాడు. అక్కడ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కప్పన్‌ను అరెస్టు చేసి, మావోయిస్టు, తీవ్రవాద గ్రూపులతో సంబంధాలున్నాయని ఆరోపణలు నమోదుచేసింది. కేంద్రం మనీ లాండరింగ్ కేసు పెట్టింది. రెండు సంవత్సరాలా నాలుగు నెలలపాటు జైల్లో నిర్బంధించింది. తనపై వచ్చిన ఆరోపణల్ని కప్పన్ ఖండించారు. ఆరోపణలపై మాట్లాడుతూ, "హత్రాస్ కేసులో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపెట్టడానికి నన్ను బలిపశువు చేశారు. ప్రజల దృష్టి మరల్చడానికి నాపై లేనిపోని ఆరోపణలు చేశారు. దళిత యువతిపై గ్రామంలోని పెత్తందార్లు అత్యంత పాశవికంగా లైంగికదాడికి తెగబడటమేగాక, హత్య చేశారు. దీనికి మతం రంగు పులిమేందుకు యూపీ సర్కార్ ప్రయత్నించింది" అని అన్నారు.



ఆధారాల్లేని ఆరోపణలు

నాపై మోపిన ఆరోపణలన్నీ ఆధారాల్లేనివి. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ), మావోయిస్టు, ఇతర తీవ్రవాద గ్రూపులతో సంబంధాల్లేవు. జర్నలిస్టు ముసుగు వేసుకున్నాడనే ఆరోపణ చేశారు.

ఎప్పట్నుంచో కేరళ యూనియన్ ఫర్ వర్కింగ్ జర్నలిస్టు సభ్యుడ్ని. గుర్తింపు కార్డుల్ని లాక్కొని, పోలీసులు ఇప్పటికీ తిరిగి ఇవ్వలేదు. అనవసరమైన ప్రశ్నలతో పోలీసులు వేధించేవారు. అనేకమార్లు కొట్టారు. కాళ్లపై, పాదాలపై తీవ్రంగా కొట్టారు. మావోయిస్టు, తీవ్రవాద గ్రూపులతో సంబంధాలున్నాయని ఒప్పుకోవాలని బలవంతపెట్టారు. అనారోగ్యం పాలైతే సరైన వైద్య చికిత్స దొరకలేదు. చేతికి బేడీలు వేసి హాస్పిటల్‌లో ఉంచారు. ఏడురోజులు వాష్‌రూమ్‌కు వెళ్లనీయలేదు. ప్లాస్టిక్ బాటిల్‌లో మూత్ర విసర్జన చేయాల్సి వచ్చింది.

బిజినెస్

అదానీ వ్యవహారం సెబీకి ఎరుక

- రెగ్యులేటరీ సంస్థలు చూసుకుంటాయ్
- ఎఫ్‌పీఓ ఉపసంహరణతో దేశ ప్రతిష్ట పోదు : మంత్రి సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ: అదానీ గ్రూపు కంపెనీలపై వస్తున్న ఆరోపణలు, షేర్ల పతనం వ్యవహారంలో రెగ్యులేటరీ సంస్థలు వాటి పని అవి చేస్తాయని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆ అంశాన్ని రెగ్యులేటరీ సంస్థలే చూసుకుంటాయన్నారు. అదానీ విషయంలో శుక్రవారం ఆర్‌బిఐ ప్రకటన విడుదల చేసిందన్నారు. దీని కంటే ముందూ ఎల్ఐసి, బ్యాంక్‌లు కూడా స్పందించాయని మంత్రి పేర్కొన్నారు. శనివారం ముంబయిలో 'పోస్ట్ బడ్జెట్' కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వంతో సంబంధం లేకుండా నియంత్రణ సంస్థలు స్వతంత్రంగా వ్యవహరిస్తాయన్నారు. ఆర్థిక, బ్యాంకింగ్, స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థలు ప్రభుత్వాధీనంలో స్వయం ప్రతిపత్తి గల సంస్థలన్నారు. కీలకమైన సమయంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలో ఆ సంస్థలకే వదిలేద్దామన్నారు. ఆ పరిస్థితులను సెబీ దగ్గరుండి పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్లలో పరిస్థితులను చక్కదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. అదానీ గ్రూప్‌కు చెందిన కొన్ని షేర్ల ట్రేడింగ్‌పై ఎన్ఎస్ఇ ఆంక్షల విధింపునపై మంత్రి సమాధానాలు దాటేశారు. అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.20,000 కోట్ల ఎఫ్‌పిఒను ఉపసంహరించుకోవడం ద్వారా దేశ ప్రతిష్ట ఏమి పడిపోదన్నారు. గతంలోనూ పలు కంపెనీలు ఎఫ్‌పీఓలను ఉపసంహరించుకున్నాయన్నారు. స్టాక్స్‌లో అదానీ గ్రూప్ మోసాలకు పాల్పడుతుందని హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలతో ఆ గ్రూప్ లిస్టెడ్ కంపెనీలు స్టాక్ మార్కెట్‌లలో అసాధారణ పతనాన్ని నమోదు చేస్తున్న సంగతి తెలిసిందే.

రూ.1000 కోట్లకు హిండెన్‌బర్గ్ గండి..!

రూ.1000 కోట్ల నిధుల సమీకరించాలన్న యోచనను అదానీ ఎంటర్‌ప్రైజెస్ నిలిపివేసిందని సమాచారం. ఇందుకు హిండెన్ బర్గ్ రిపోర్ట్, అదానీ షేర్లలో తీవ్ర ఒడిదుడుకే ప్రధాన కారణమని తెలుస్తోంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్, బాండ్ల ధరలు తగ్గిపోయాయి. బాండ్లు జారీ ద్వారా ఈ మొత్తాన్ని సమీకరించాలని తొలుత నిర్ణయించుకున్న ఆ కంపెనీ.. తర్వాత ప్రణాళికను ఉపసంహరించుకుందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపారు. ఇటీవల రూ.20 వేల కోట్ల విలువైన ఎఫ్‌పిఒను కూడా ఉపసంహరించుకున్న నేపథ్యంలో ఈ బాండ్ల విక్రయ ప్రణాళికనూ కూడా నిలిపివేసినట్టు రిపోర్టులు వస్తున్నాయి.

అధిక అస్థిరతలపై నిఘా : సెబీ

స్టాక్ మార్కెట్లలోని పలు కీలక స్టాక్స్‌ల్లో చోటు చేసుకుంటున్న అస్థిరతలపై నిఘా చర్యలు ఉన్నాయని సెబీ శనివారం తెలిపింది. అదానీ గ్రూపు కంపెనీల పేరు ఎత్తకుండా ఓ ప్రకటన చేసింది. స్టాక్ మార్కెట్ సమగ్రతను నిర్ధారించడానికి కట్టుబడి ఉన్నామని, వ్యక్తిగత షేర్లలో ఏదైనా అధిక అస్థిరతను పరిష్కరించడానికి అవసరమైన అన్ని నిఘా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. గత వారంలో స్టాక్‌లలో అసాధారణ ధరల కదలికను గమనించినట్లు తెలిపింది. అదానీ వ్యవహారం నేపథ్యంలోనే సెబీ ఈ ప్రకటన చేసిందని అధికారులు పేర్కొంటున్నారు. అదానీ గ్రూపునకు చెందిన 10 లిస్టెడ్ కంపెనీలు కేవలం ఒక్క వారంలోనే అమ్మకాల ఒత్తిడితో దాదాపు రూ.9 లక్షల కోట్ల మార్కెట్ విలువను కోల్పోయిన విషయం తెలిసిందే.

జనవరిలో లక్ష టెక్ జాబ్‌లు కట్

- ప్రపంచ వ్యాప్తంగా ఉద్వాసన



న్యూఢిల్లీ: గడిచిన జనవరిలో ప్రపంచ వ్యాప్తంగా టెక్నలాజీ కంపెనీలు లక్ష మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయి. ఐటి రంగంలో ఎప్పుడూ లేనంత దారుణంగా కోతలు చోటు చేసుకున్నాయని లేఆఫ్స్.ఎఫ్‌వైఐ ఓ రిపోర్టులో తెలిపింది. దిగ్గజ అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, సేల్స్‌ఫోర్స్ తదితర ఇతర సంస్థలు ఉద్వాసనలకు పాల్పడ్డాయని వెల్లడించింది. ఈ రిపోర్ట్ ప్రకారం.. "ప్రతీ రోజు 3,300 చొప్పున ఉద్యోగాలు ఊడాయి. ప్రపంచంలోని 288 పైగా కంపెనీలు ఈ చర్యకు పాల్పడ్డాయి. దిగ్గజ టెక్ కంపెనీల్లో ఒక్క ఆపిల్ మాత్రమే ఎలాంటి తొలగింపులు చేయలేదు. అమెజాన్ 18,000 మందికి ఉద్వాసన పలికింది. అదే విధంగా గూగుల్ 12,000 మందిని, మైక్రోసాఫ్ట్ 10వేల మందిని, సేల్స్‌ఫోర్స్ 7,000 మంది, ఐబిఎం 3,900 మంది, ఎస్ఎపి 3,000 మంది చొప్పున ఉద్యోగులను తొలగించాయి." అని లేఆఫ్స్.ఎఫ్‌వైఐ వెల్లడించింది.

2022లో 1,000 కంపెనీలు 1,54,336 సిబ్బందిని ఇంటికి పంపించాయి. గతేడాదితో కలుపుకుని ఇప్పటి వరకు 2.5 లక్షల ఉద్యోగాలు పోయినట్లయ్యింది. ఆర్థిక సంక్షోభం భయాల నేపథ్యంలో అనేక టెక్ కంపెనీలు పొదుపు చర్యలకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఒఎల్ఎక్స్ కూడా తమ ఉద్యోగుల్లో 15 శాతం మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు ప్రకటించింది. బైజూస్ కూడా మరో రౌండ్‌లో 15 శాతానికి సమానమైన 1,000 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ పరిణామాలు ఐటి రంగ అభ్యర్థుల్లో, ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోన్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

డాక్టర్ రెడ్డీస్ ఛైర్మన్ సతీష్ రెడ్డికి ఐసీటీ ఫెలోషిప్

హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఛైర్మన్ సతీశ్ రెడ్డికి ప్రతిష్టాత్మక డాక్టర్ అంజిరెడ్డి మెమోరియల్ తొలి ఫెలోషిప్ దక్కింది. ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐసీటీ) దీన్ని ఏర్పాటుచేసింది. బయోథెరప్యూటిక్స్, భారత ఫార్మా పరిశ్రమ అభివృద్ధికి కృషి చేసిన పారిశ్రామికవేత్తలకు దీన్ని అందిస్తారు. గోవాలో జరిగిన ఐసిటి నాలుగవ బయోసిమిలర్ వర్క్‌షాప్‌లో దీన్ని సతీశ్ రెడ్డికి అందజేశారు. డాక్టర్ రెడ్డీస్ వ్యవస్థాపకుడు కె అంజిరెడ్డి ఐసిటి పూర్వ విద్యార్థి కావడం విశేషం. ఆయన పేరుతో ఏర్పాటు చేసిన ఫెలోషిప్ ముందుగా సతీష్‌రెడ్డికి అందజేశారు.

ఉత్తరాదికి జీస్క్వేర్ హౌసింగ్ విస్తరణ

హైదరాబాద్ : రియల్ ఎస్టేట్, నిర్మాణ కంపెనీ జీస్క్వేర్ హౌసింగ్ ఉత్తర భారతదేశానికి విస్తరించినట్లు ప్రకటించింది. ఇటీవల ఆ సంస్థ హైదరాబాద్, మైసూరులలో కార్యకలపాలు ప్రారంభించింది. గత మూడు నెలల కాలంలో 10 నూతన ప్రాజెక్టులను ఆవిష్కరించినట్లు పేర్కొంది. వీటిలో కర్నాటకలో ఓ ప్రాజెక్టు విలువ రూ.1000 కోట్లు, హైదరాబాద్‌లో రూ.2500 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. త్వరలోనే పూణె, జైపూర్‌లలో సైతం విస్తరించేందుకు ప్రణాళికలను రూపొందించిట్లు జీస్క్వేర్ హౌసింగ్ సీఈఓ ఈశ్వర్ ఎన్ వెల్లడించారు. తమిళనాడు, కర్నాటక, తెలంగాణా మార్కెట్‌లలో తాము అద్భుతమైన ప్రదర్శన కొనసాగించామన్నారు. త్వరలోనే ఉత్తర భారతదేశంలో కూడా కార్యకలాపాలు విస్తరించనున్నామన్నారు.

దేశమంటే అదానీ, ప్రధానే కాదు



(మొదటి పేజీ తరువాయి)

జగ్గారెడ్డి, పోడెం వీరయ్య, తదితరులు పాల్గొన్నారు. శాసనమండలిలోనూ మంత్రి కేటీఆర్ ఇదే తీర్మానంపై మాట్లాడారు. ఇరు సభల్లోనూ సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఆయన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎనిమిదున్నరేండ్ల కాలంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి క్రమాన్ని వివరించారు. సింగరేణి సంస్థ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రధాని మోడీకి సీఎం కేసీఆర్ లేఖ రాశారని తెలిపారు. ఆ నాలుగు బ్లాకులను సింగరేణికి నేరుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. తమది ముమ్మాటికీ కుటుంబ పాలనేననీ, నాలుగు కోట్ల మంది తెలంగాణ కుటుంబసభ్యులకు కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారని చెప్పారు. మోడీ సర్కారు ఎత్తుకున్న మేకిన్ ఇండియా ఏమైందో ఏమోగానీ మేకిన్ తెలంగాణ మాత్రం సాకారం అయిందని చెప్పారు. కంటివెలుగు పథకంలో భాగంగా ఇస్తున్న కండ్లద్దాలు సుల్తాన్‌పూర్ మెడికల్ హబ్‌లో తయారు కావడమే దానికి సజీవ సాక్ష్యమన్నారు.

తెలంగాణ దేశానికి టార్చ్‌బేరర్

దేశాన్ని నడిపించే టార్చ్‌బేరర్‌గా నేడు తెలంగాణ మారిందని కేటీఆర్ ఈ సందర్భంగా అన్నారు. సీఎం కేసీఆర్‌కు స్పష్టమైన విజన్ ఉందన్నారు. దేశంలో 20 అత్యుత్తమ గ్రామ పంచాయతీల్లో 19 మన రాష్ట్రానివేనని కేంద్రం చెప్పిందన్నారు. రైతు బంధు ప్రపంచంలోనే వినూత్న పథకమని ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. రైతు బీమాతో 94 వేలకుపైగా కుటుంబాలను ఆదుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి పథకాలను వివరించారు.

రోజూ మూడు డ్రెస్సులు మార్చితే అభివృద్ధి కాదు..

రోజుకు మూడు డ్రెస్సులు మార్చడం.. ముచ్చట్లు పెట్టడం..హడావిడి చేయడం అభివృద్ధి కాదని పరోక్షంగా ప్రధాని మోడీని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని కించపరిచే విమర్శలు చేయొద్దని హితవు పలికారు. నల్ల చట్టాలతో 700 మంది రైతుల ప్రాణాలను బలిగొన్నది మోడీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. మోడీ సర్కారు చెప్పినట్టు డిస్కంలను ఎందుకు ప్రయివేటీకరించాలి? మోటార్లకు మీటర్లు ఎందుకు పెట్టాలి? అని నిలదీశారు. తెలంగాణలో 24 గంటల కరెంటు ఇస్తుంటే గుజరాత్, యూపీలో పవర్ హాలిడేలు ప్రకటిస్తున్న పరిస్థితి ఉందన్నారు. కరెంటు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తిడికి తలొగ్గేదే లేదని స్పష్టం చేశారు.

దేశం కోసం..ధర్మం కోసం అంటూనే లూటీ..

దేశం కోసం, ధర్మం కోసం అంటూనే మోడీ సర్కారు దేశ సంపదను కార్పొరేట్లకు లూటీ చేసిపెడుతున్నదని కేటీఆర్ విమర్శించారు. బీజేపీ సర్కారు రైతుల పట్ల కక్ష కట్టిందని తెలిపారు. దేశమంతటా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చినా ఖర్చు 1.45 లక్షల కోట్లకు మించబోదని చెప్పారు. కార్పొరేట్ల కోసం 12 లక్షల కోట్ల రూపాయలను మాఫీ చేసిన కేంద్రం రైతుల కోసం 1.45 లక్షల కోట్లను ఖర్చుపెట్టలేదా? అని ప్రశ్నించారు. బుల్లెట్ ట్రైన్ వద్దంటే ఎడ్లబండి మీద తిరగండి అని మోడీ మాట్లాడారని తెలిపారు. అహ్మదాబాద్ నుంచి ముంబాయి వరకు బుల్లెట్ ట్రైన్ కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చుపెట్టారనీ, దాని ప్రయోజనం సామాన్యులకు అంతంతే అని చెప్పారు. కొందరి కోసం అంత ఖర్చుపెట్టగా లక్షలాది మంది రైతులకు ఉపయోగపడే కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్ల రూపాయలను ఖర్చుపెడితే తప్పేంటని ప్రశ్నించారు. దేశంలో ఎన్నడూ లేనంత అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైందని విమర్శించారు. 45 ఏండ్లలో ఎన్నడూ లేనంత పతాక స్థాయికి నిరుద్యోగం పెరిగిందని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక సిలిండర్ ధర మనదేశంలోనే ఉందని చెప్పారు. నాలుగు వందల రూపాయల సిలిండర్ ధరను 12వందలు చేసి మన ఆడ బిడ్డలకు ప్రధాని మోడీ విలువైన కానుక ఇచ్చారని ఎద్దేవా చేశారు. పెట్రోలు ధర ఎక్కువ గల మూడో దేశం మనదేనన్నారు. ఈ హైయెస్ట్ ఘనతలే కాదు మోడీ ఘనకార్యాలు, అమలు కాని హామీలు ఇంకా చాలా ఉన్నాయన్నారు.

రైతుల ఆదాయం రెట్టింపేది? సొంతిల్లు ఏది?

2022 నాటికి రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామన్న హామీ ఏమైందని కేటీఆర్ మోడీ సర్కారును ప్రశ్నించారు. దేశంలోని ప్రతి పౌరుడికి సొంత ఇల్లు కట్టిస్తాం.. దేశమంతా బుల్లెట్ రైళ్లు పరుగెత్తిస్తాం..2022కల్లా దేశంలోని ప్రతి ఇంటికి కరెంటు ఇస్తాం అని మోడీ హామీలిచ్చారని తెలిపారు. వీటిలో ఒక్కటైనా నెరవేరిందా? అని ప్రశ్నించారు.

బీసీ కులగణన ఎందుకు చేయట్లేదు?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ కులగణన ఎందుకు చేయట్లేదు? అని కేటీఆర్ ప్రశ్నించారు. 2004లో కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్యను అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దగ్గరకు తీసుకెళ్లి ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో పాటు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కోరిన విషయాన్ని ప్రస్తావించారు. అప్పటి నుంచి ఆయన ప్రధానులు, మంత్రుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని చెప్పారు. కానీ, ఆయన కోరిక నెరవేరలేదన్నారు. 45 లక్షల కోట్ల దేశబడ్జెట్‌లో బీసీలకు 2వేల కోట్లు మాత్రమే కేటాయించడమేంటని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

విభజన హామీలపై మాట్లాడరెందుకు?

రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందే క్రమంలో, మంచి విద్యనందిస్తున్న గురుకులాల్లో ఏదో చిన్న ఘటన జరిగినా అక్కడికెళ్లి నానా హడావిడి చేసి రాజకీయం చేస్తున్న బీజేపీ నేతలు రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలపై ఎందుకు నోరు మెదపడం లేదని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. తాము ఉద్యోగులకు 73 శాతం వేతనం పెంచామని చెప్పారు. కేవలం14 శాతమే ఉద్యోగులకు వేతనం పెంచి నోళ్లు తమకు చెప్పొస్తున్నారని విమర్శించారు. కేంద్రం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న హామీని విస్మరించగా.. తెలంగాణలో మాత్రం ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని చెప్పారు.

రాహుల్‌గాంధీ పరోక్ష విమర్శలు

కీలకమైన గుజరాత్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతుంటే పాదయాత్ర చేస్తున్న ఓ నాయకుడు ఆ రాష్ట్రాన్ని వదిలి పక్క నుంచి వెళ్లిపోయారంటూ రాహుల్‌గాంధీని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ పరోక్ష విమర్శలు చేశారు. అటవీ హక్కుల చట్టం తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో విఫలం కావడం వల్లనే పోడు సమస్య ఇప్పటికీ అలాగే ఉండిపోయిందన్నారు. ఆ సమస్య పరిష్కారం తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు.

విద్యకు 24 శాతం, వైద్యానికి 12 శాతం నిధులు కేటాయించాలి

మంత్రి హరీశ్‌రావుకు టీపీఎస్వీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్ (2023-24)లో విద్యారంగానికి 24 శాతం, వైద్య రంగానికి 12 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ పౌర స్పందన వేదిక (టీపీఎస్వీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావును శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం, సలహాదారు ఎంఎకె దత్తు కలిసి వినతిపత్రం సమర్పించారు. విద్యావైద్య రంగాల్లో పెనుమార్పులు తేవాలనీ, తద్వారా రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన విద్యావైద్యం అందించాలంటూ ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని తెలిపారు. ఈ వైపుగా జరుగుతున్న కృషిలో భాగంగా విద్యారంగంలో మన ఊరు-మనబడి కార్యక్రమాన్ని ప్రకటించారని పేర్కొన్నారు. టీపీఎస్వీ ఆధ్వర్యంలో 33 జిల్లాల్లో 1,639 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యారంగానికి సంబంధించిన ఆన్‌లైన్ సర్వే నిర్వహించామని వివరించారు. మన ఊరు-మనబడికి కేటాయించిన నిధులు పూర్తిగా విడుదల కాలేదనీ, దానివల్ల పనులు అరకొరగానే జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. బడుల్లో పారిశుధ్యం, టీచర్ల కొరత సమస్యలుగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని అధిగమించాలంటే విద్యారంగానికి కేటాయింపులు బాగా పెంచాల్సిన అవసరముందని సూచించారు. పాఠశాల విద్య 54 శాతం, ఇంటర్ విద్య 75 శాతం, డిగ్రీస్థాయిలో 70 శాతం, ఇంజినీరింగ్, వృత్తివిద్యలో 90 శాతం ప్రయివేటు రంగంలో కొనసాగుతున్నదని వివరించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు అస్తిత్వాన్ని కోల్పోయే దశలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు తగినంత బడ్జెట్ కేటాయింపుల్లేక కునారిల్లుతున్నాయని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెంచి ఖర్చు చేసినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని సూచించారు. ప్రభుత్వ వైద్య కాలేజీల ఏర్పాటు, బస్తీ దవాఖానాలు, ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన, డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టడం ద్వారా ప్రభుత్వ వైద్యరంగాన్ని మెరుగుపరిచాయని వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతున్నదని తెలిపారు. అయినా 60 శాతానికిపైగా ప్రజలు ప్రయివేటువైద్యాన్ని ఆశ్రయిస్తున్నారంటూ సర్వేలు చెప్తున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలపాటు డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లో అదనంగా ఏరియా ఆస్పత్రులను నిర్మించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతంలో డాక్టర్లు, వైద్య సిబ్బందికి ప్రత్యేక అలవెన్సుల ద్వారా ప్రోత్సహించాలని తెలిపారు. అవసరమైన మందుల కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ సమస్యలన్నీ అధిగమించి రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యావైద్యం అందాలంటే 2023-24 బడ్జెట్‌లో విద్యకు 24 శాతం, వైద్య రంగానికి 12 శాతం నిధులు కేటాయించాలని కోరారు.



రక్షణ దిగుమతులు రూ.2లక్షల కోట్లు

లోక్‌సభలో కేంద్రం వెల్లడి

- విదేశాల నుంచి హెలికాప్టర్లు, రాడార్లు, రాకెట్లు, రైఫిల్స్

న్యూఢిల్లీ: రక్షణరంగ ఉత్పత్తుల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించలేదనే సంగతి, మోడీ సర్కారే బయట పెట్టుకుంది. గత ఐదేండ్లలో మన దేశం దాదాపు రూ.2లక్షల కోట్ల విలువజేసే మిలటరీ ఉత్పత్తుల్ని దిగుమతి చేసుకుందని లోక్‌సభలో కేంద్రం వెల్లడించింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు తాజాగా సభకు అందజేసింది. ఈ వివరాల ప్రకారం, భారత సైన్యానికి అవసరమయ్యే అత్యంత కీలకమైన ఆయుధ సామాగ్రిని విదేశాల నుంచి కేంద్రం కొనుగోలు చేసింది. 2017-18 నుంచి 2021-22 మధ్య ఐదేండ్ల కాలంలో హెలి కాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ రాడార్లు, రాకెట్లు, తుపాకులు, రైఫిల్స్, మిస్సైల్స్, మందుగుండు..మొదలైనవి భారత్ దిగుమతి చేసుకుంది. వీటి విలువ సుమారుగా రూ.2లక్షల కోట్లు ఉంటుందని రక్షణశాఖ సహాయమంత్రి అజయ్ భట్ తెలిపారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ అమలుపై వస్తున్న ఫిర్యాదుల పరిష్కారానికి ఏకసభ్య న్యాయ కమిటీ ఏర్పాటు చేసే ఆలోచన లేదని చెప్పారు. రూ.73,942 కోట్ల విలువజేసే 55 మిషన్ మోడ్ (ప్రాజెక్ట్స్) డీఆర్‌డీవోకు అప్పగించామని, వాటి పనులు జరుగుతున్నాయని అజయ్ భట్ అన్నారు. రక్షణ ఉత్పత్తుల దిగుమతిపై ఆయన మాట్లాడుతూ, "రక్షణ ఉత్పత్తుల సేకరణ విధానం- 2020 ప్రకారం ఈ దిగుమతులు చోటుచేసుకున్నాయి. ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియాపై దృష్టి సారించి, స్వదేశీ రక్షణ సామర్థ్యాన్ని పెంచడానికి ఈ దిగుమతులు దోహదపడ్డాయి. దేశీయంగా ఉత్పత్తుల సేకరణకు ప్రాధాన్యత ఇచ్చాం. రక్షణ ఉత్పత్తుల సేకరణ కౌన్సిల్, రక్షణశాఖ ఆమోదంతో కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో దిగుమతులు చేపట్టామని చెప్పారు. గత ఐదేండ్లు, ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరు నాటికి మిలటరీ ఉత్పత్తుల దిగుమతులపై విదేశీ సంస్థలతో 264 కాంట్రాక్ట్ ఒప్పందాలు కుదిరాయని అన్నారు. మొత్తం దిగుమతుల్లో అమెరికా, రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, స్పెయిన్..తదితర దేశాల దిగుమతులు 36.26 శాతం ఉందని అజయ్ భట్ చెప్పారు.

పొట్ట చుట్టూ 51 సార్లు వాతలు..

- మూఢనమ్మకాలకు 3 నెలల చిన్నారి బలి

మధ్యప్రదేశ్ : వైద్య రంగంలో పెను మార్పులువచ్చి.. ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చిన ఈ తరుణంలోనూ మూఢ నమ్మకానికి మూడు నెలల చిన్నారి బలైంది. ఈ దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గిరిజన ప్రాంతమైన షాదోల్ జిల్లాలోని సింగ్‌పూర్ కథౌటియా గ్రామానికి చెందిన మూడు నెలల చిన్నారి నిమోనియా బారినపడింది. చిన్నారికి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. తల్లిదండ్రులు పాపను వైద్యుల వద్దకు తీసుకెళ్లకుండా స్థానికంగా ఉన్న మంత్రగాళ్లకు చూపించారు. ఈ క్రమంలో మంత్రగాళ్లు పాప పొట్ట చుట్టూ కాల్చిన ఇనుప రాడ్డుతో 51 సార్లు వాతలు పెట్టారు. దీంతో చిన్నారి ఆరోగ్యం మరింత దిగజారడంతో తల్లిదండ్రులు పసికందును స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. నిమోనియాకు సరైన సమయంలో వైద్యం అందక పోవడంతో ఇన్‌ఫెక్షన్ ఎక్కువై చిన్నారి మృతి చెందింది. పాపకు తల్లిదండ్రులు అంత్యక్రియలు పూర్తి చేశారు. శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆస్పత్రికి వెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వెంటనే వారు చర్యలు చేపట్టారు.

వ్యాగన్ల తయారీ కేంద్రానికి ఎంత భూమి కావాలి? ఎన్ని నిధులిస్తారు?

- కేంద్రానికి బోయినపల్లి వినోద్ కుమార్ సూటి ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాజీపేటలో రైల్వే వ్యాగన్ల తయారీ కేంద్రానికి ఎంత భూమి కావాలో, దాని కోసం ఎన్ని నిధులిస్తుందో, ఎంత మందికి ఉద్యోగాలిస్తుందో కేంద్ర ప్రభుత్వం చెప్పాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి కొత్త రైళ్ల ప్రస్తావన లేకుండా, కొనసాగుతున్న రైల్వే పనులకు నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ విషయాలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టతనివ్వాలని కోరారు. భూమి ఎంత అవసరమో కేంద్రం స్పష్టం చేస్తే, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. రామగుండం - మణుగూరు రైల్వే లైన్ పనులను నిర్ణీత కాలపరిమితి విధించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్లో ఈ పనుల కోసం కేవలం రూ. 10 కోట్లు మాత్రమే కేటాయించారనీ, ఇది ఏ మాత్రం సరిపోదని పేర్కొన్నారు. బడ్జెట్ లో నిజామాబాద్ - ఆర్మూర్ - నిర్మల్ - ఆదిలాబాద్ రైల్వే లైన్ ఊసే లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే పూర్తయిన కాజీపేట - హుజూరాబాద్ - కరీంనగర్ రైల్వే లైన్ ను మంజూరు చేస్తారని ఆశించినా.. నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య మూడో రైల్వే లైన్ కోసం మాత్రమేనిధులు కేటాయించారని.. అయితే ఇది దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు కేటాయించినట్టు ఎలా అవుతుందని వినోద్ కుమార్ ప్రశ్నించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, కొచ్చిలకు బుల్లెట్ రైలు ప్రస్తావనను కేంద్ర ప్రభుత్వం చేయనేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పీడీఎస్‌యూ నేతల అరెస్ట్

- చలో అసెంబ్లీ ఉద్రిక్తం



నవతెలంగాణ-అంబర్‌పేట

విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం అసెంబ్లీ ముట్టడికి యత్నించిన పీడీఎస్‌యూ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.రామకృష్ణ, నామాల ఆజాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా తమ సంఘం నేతలను అడుగడుగునా నిర్బంధించినా. అరెస్టులు చేసినా, చలో అసెంబ్లీ విజయవంతం అయిందన్నారు. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయింపు లేకుంటే ప్రతిఘటన తప్పదని చెప్పారు. జాతీయ విద్యా విధానాన్ని అసెంబ్లీలో భర్తరఫ్ చేసి, సీఎం కేసీఆర్ తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు గాలించి, వెంటాడి అరెస్టు చేశారని, అయినా నిర్బంధాలను ఛేదించుకుని నిరసన తెలిపామన్నారు.

మనోధైర్యం ముఖ్యం



- నిమ్స్‌లో క్యాన్సర్ డే వాక్‌లో డాక్టర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్యాన్సర్‌ను జయించేందుకు మనోధైర్యం ముఖ్యమని నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. శనివారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా నిమ్స్ ఆస్పత్రిలో వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవాలని సూచించారు. మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ గుండేటి సదాశివుడు మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ , ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పేదరికమే గీటురాయిగా కేసీఆర్ పథకాలు

- గవర్నర్‌కు ధన్యవాదాల తీర్మానంలో శాసనసభ్యులు సండ్ర

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ పేదరికమే గీటురాయిగా సంక్షేమపథకాలు రూపొందిస్తున్నారని టీఆర్ఎస్ సభ్యులు సండ్ర వెంకటవీరయ్య చెప్పారు. అందుకే దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచిందని చెప్పారు. తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతున్నదని చెప్పారు. తెలంగాణ ప్రాంతం ఆనాడు కరువు, వలసలతో అల్లాడిన రాష్ట్రం నేడు సస్యశ్యామలంగా మారిందన్నారు. ధాన్యం కొనుగోలుచేసి రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. దళితులు ఆత్మగౌరవంతో బతికేలా దళితబంధు తీసుకొచ్చామన్నారు. కంటి వెలుగు లాంటి కార్యక్రమాన్ని పంజాబ్, ఢిల్లీలో చేపడతామని అక్కడి ముఖ్య మంత్రులు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుపెట్టాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అలజడి సృష్టిస్తున్నది : కేపీ వివేకానంద

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అలజడి సృష్టించే ప్రయత్నం జరుగుతున్నదని బీఆర్ఎస్ కేపీ వివేకానంద విమర్శించారు. దేశంలో భారీ కుంభకోణాలకు పాల్పడుతున్న సంస్థలను వదిలిపెట్టి, రాష్ట్రంలో పాలు, పువ్వులు అమ్ముకునే వారిపై ఐటీ దాడులు చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులన్నీ ఉద్దేశపూర్వకమైనవేనని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, హైదరాబాద్ ప్రగతిని అడ్డుకునేందుకే ఐటీ దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. ఉభయసభలను ఉద్దేశించిన గవర్నర్ చేసిన ప్రసంగం చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. మోడీ ప్రభుత్వం అదానీ లాంటి వారికి లబ్ధి చేకూరుస్తున్నదని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా సీఎం కేసీఆర్ నాయకత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ పథకాలు దేశానికి దిక్సూచిగా మారాయన్నారు. సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలన్నీ మంచి ఫలితాలిస్తున్నాయని చెప్పారు.

సంపాదకీయం

సినీ ఘనుల నిష్క్రమణ

గత కొద్ది కాలంగా సినిమారంగ ప్రముఖులు అనేకమంది సెలవంటూ వెళ్లిపోతున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ మరణించిన కొద్ది రోజులకే కైకాల సత్యనారాయణ నిష్క్రమించారు. మొన్న సినీ సత్యభామ జమున, నిన్న కళాదర్శకుడు కె. విశ్వనాథ్ మృతి చెందగా, ఇప్పుడు అకస్మాత్తుగా మధురస్వరగాన వాణీ జయరాం వెళ్ళిపోయారన్న వార్త సినీరంగాన్ని ప్రేక్షకులనూ బాధకు గురిచేసింది. వీరంతా దాదాపు యాభైయేండ్లుగా

ఆమె మొదటి సినిమా పాట హృషీకేష్ ముఖర్జీ సంగీత సారథ్యంలో 'గుడ్డి' సినిమాలోని 'బోల్‌రే పప్పీ హరా!' అనే పాటకు తాన్‌సేన్ సమ్మాన్ అవార్డు అందుకున్నారు. ఇప్పటివరకు మూడుసార్లు జాతీయ అవార్డులందుకున్న ఆమెను పద్మభూషణ్ పురస్కారానికి ఇటీవలనే ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆమెది ఒక విభిన్నమైన కంఠస్వరం. పాటలున్నంత వరకూ ఆమెను తలచుకుంటూనే ఉంటాం. రెండు నెలల కాలంలోనే ఇందరు సినీ కళాకారులు మన నుండి దూరమయ్యారు. వారందరికీ కళాంజలి.

అంతకుపైగా సినిమారంగంలో కళాత్మక సృజనతో కొనసాగినవారే. జేమ్స్ బాండ్ హీరోగా, మాస్ కథానాయకుడుగా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న కృష్ణ అల్లూరి సీతారామరాజుగా చెరగని ముద్రవేసిన నటుడు ఆయన. ఇక నవరసాలను పలికించగలిగి యముడంటే ఇలానే ఉంటాడనిపించిన సత్యనారాయణ విలన్‌గా, హాస్య నటుడుగా మెప్పించిన నటసార్వభౌముడు. సత్యభామ పాత్రలో తన సహజగుణ నటనా నైపుణ్యాన్ని ప్రదర్శించి పేరు తెచ్చుకున్న జమున, ప్రజా కళాకారుడు గరికపాటిరాజారావు శిష్యరికంలో, అతను నిర్మించిన 'పుట్టిల్లు' సినిమాతో సినీరంగ ప్రవేశం చేసి అనేక చిరస్మరణీయ పాత్రలలో తన నటనా కౌశలాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల మదిలో నిలిచిపోయింది. వీళ్లంతా పాతతరం వాళ్లే. సినిమా రంగంలోనే కాదు, సమాజంలోనూ అనేక మార్పులు, ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఎంతో పెరిగింది. ఇప్పటి సినిమాతో పోల్చుకపోయినా ఆనాటి చిత్రాల ప్రత్యేకత ఏమీ తక్కువ చేయలేము.



సినిమా అనేది మన సామాజిక నేపథ్యాన్ని ప్రతిబింబిస్తూనే ఉంటుంది. దీంతో సంబంధం కొనసాగుతూనే ఉంటుంది. రాజకీయ ఆర్థిక ప్రభావాలూ వాటిపై ఉంటాయి. జనం నాడిని పట్టుకోగలిగిన రచయితలు, దర్శకులు జనం ఆదరించే చిత్రాలను నిర్మించ గలుగుతారు. ఇంకొందరు సాధారణ ప్రజల హృదయాలను కదిలించే పనికి తమ కళను ఉపయోగించి చిత్రాలు తీస్తారు. ఇవి అనుభూతి ప్రధానంగా సాగుతాయి. ఇక జీవన వాస్తవికతలను చిత్రిస్తూనే ఉన్నత విలువలను, కర్తవ్యాలను కళాత్మకం చేస్తారు. ఇవి సామాజిక మార్పుల కోసం చైతన్యాన్ని అందిస్తూ ఉంటాయి. ఎన్ని రకాలుగా సినిమాలొస్తున్నా వాటిని ఏ విభాగానికి చెందిందో తేల్చేది కళా విమర్శకులు. కానీ సామాన్య ప్రేక్షకులు మాత్రం కళాసృజనకు ప్రియులుగానే ఉంటారు. అభిమానించే కథానాయకులు, నాయికలూ వారికుంటారు. ఆ చిత్రాలను రచించిన, దర్శకత్వం వహించిన వారిని గుర్తించడమనేది చాలా కాలం తర్వాతే జరిగింది. నటీనటులు ఎవరు అని గతంలో సినిమాలు చూసేవారు. ఇప్పుడు దర్శకులు ఎవరు అని తెలుసుకుని చూడటమూ జరుగుతోంది. ఇదొక పరిణామం.

కె. విశ్వనాథ్ సినిమాలు ఒక తరహా సినిమాలుగా ప్రసిద్ధి చెందినవి. కళాత్మక విలువలతో సినిమా తీస్తాడనే పేరువల్ల ఆయనను కళాతపస్వీ అని కూడా అంటారు. 'శంకరాభరణం' సినిమాతో తెలుగునేలపైనే కాదు, దేశం మొత్తంలోనే ఒక గొప్ప పేరును పొందారు. సంగీత ప్రాధాన్యాన్ని చిత్రీకరించిన సినిమా అది. మన సంప్రదాయ సాహిత్యమూ సంగీతమూ రెండూ కూడా ఆధ్యాత్మిక ధార్మిక సంబంధమైనవిగానే భావిస్తారు. ఆ రకమైన భావాన్నే ఆయన మరింత కళాత్మకంగా చిత్రీకరించారు. సాగర సంగమం, స్వాతిముత్యం, సిరివెన్నెల, శృతిలయలు సినిమాలు కూడా సంగీత నృత్య ప్రధానమైనవే. ఇక సప్తపది, శుభసంకల్పం, శుభలేఖ, స్వయం కృషి, సూత్రదారులు మొదలైన చిత్రాలలో సామాజిక సమస్యలను కొంత చర్చించారు. ఇప్పుడున్న వ్యవస్థలోనే సంస్కరణ తేవాలన్న కోరిక తపన ఉన్న దర్శకుడుగా మనం విశ్వనాథ్‌ను చూడవచ్చు. వినసొంపైన సంగీతాన్ని, సాహిత్యాన్ని తిరిగి సినీరంగంలోకి తెచ్చినవాడు, సంప్రదాయ, సంస్కరణ కళా దర్శకుడు విశ్వనాథ్.

ఇక యాభైయేండ్ల పాటు వేయిసినిమాలలో పదివేల పాటలు పాడిన వాణీజయరాం (కలైవాణి) ఆకస్మిక మరణం సినీసంగీత రంగానికి లోటుగానే భావించాలి. విశ్వనాథ్ సినిమాలలో అనేక పాటలు పాడారీమె. 'దొరుకునా ఇటువంటి సేవా', 'ఆనతి నీయవా హరా!', 'మానస సంచరరే..', అందెల రవళిది పదమునదా', 'ఎన్నెన్నో జన్మల బంధం నీదీనాదీ...' 'ఒక బృందావనం - సోయగం' మొదలైన ఎన్నోపాటలతో శ్రోతల అభిమానాన్ని పొందింది వాణీజయరాం. తమిళనాడులో జన్మించిన వాణి, ఉస్తాద్ అబ్దుల్ రెహమాన్ ఖాన్ దగ్గర హిందుస్తానీ సంగీతం నేర్చుకున్నారు. కర్నాటక సంగీతాన్ని అవపోసన పట్టారు. ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనలను బాగాపాడగలిగిన ఆమె పద్దెనిమిది భాషలలో పాటలు పాడారు. ఆమె మొదటి సినిమా పాట హృషీకేష్ ముఖర్జీ సంగీత సారథ్యంలో 'గుడ్డి' సినిమాలోని 'బోల్‌రే పప్పీ హరా!' అనే పాటకు తాన్‌సేన్ సమ్మాన్ అవార్డు అందుకున్నారు. ఇప్పటివరకు మూడుసార్లు జాతీయ అవార్డులందుకున్న ఆమెను పద్మభూషణ్ పురస్కారానికి ఇటీవలనే ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆమెది ఒక విభిన్నమైన కంఠస్వరం. పాటలున్నంత వరకూ ఆమెను తలచుకుంటూనే ఉంటాం. రెండు నెలల కాలంలోనే ఇందరు సినీ కళాకారులు మన నుండి దూరమయ్యారు. వారందరికీ కళాంజలి.



ఆ విగ్రహాన్ని కూలిపోనియద్దు!

పడిపోకుండా పట్టుకోండర్రా..!
మాయింటి నిట్టాడురా అది!
దాని చుట్టూనే నిర్మించుకున్న నా సామ్రాజ్యం
మా వాడు, చేతగాని చంద్రబాబు నమ్ముకున్న
'సత్తి' రాజు కాదు
నాడు సెబీని నియంత్రించడం
మన్‌మోహన్‌కి చేతకాలే!
అందుకేగా ఆ లింగరాజు ఊచలెక్కబెట్టాడు
అసలు కుబేరులను ఎక్కడైనా జైల్లో పెడ్తారా?
అప్పుడు గవర్నమెంట్లు బతికేదెట్టా?
భక్తులిచ్చే ఖరీదైన సూట్లు కట్టేదెట్టా?
అస్మదీయ 'నిట్టాడు'ను సెబి బహిష్కరిస్తే..!
నా ఇజ్జత్ ఏంగాను?
మరీ 14వందల ఏండ్లా?
వాడి పుత్ర, పౌత్ర, ప్రపౌత్రాదులంతా షేర్ల
జూదంలోకి రాలేక పోతే..?!
స్వరాష్ట్రం సురాష్ట్రం అయ్యేదెట్టా?
అది జరుగకపోతే నా పునాది కూలిపోదా?
కరోనాలో జనం బతుకులు కాలి బూడిదైతే
మా'నిట్టాడే'గా భారత గోవర్ధనగిరిని
చిటికెన వేలిపై నిలబెట్టింది!
ఇప్పుడు వాడి చుట్టు కొలత 891 రెట్లు పెరిగిందని
వాడెవడో చెప్తే ఈ లొల్లేంది?
బయట దొల్ల కంపెనీలు పెట్టి, దేశంలోకి
డబ్బు దొర్లించడం
ఇప్పుడేదో కొత్తగా చేసినట్టు ఈ గోలేంది?
ఆ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టడం దానిష్టం!
దాని వెనక నేనుండటమేంటి?
నాన్సెన్స్!!
అంత భారీ విగ్రహాన్ని పడిపోకుండా ఆపడానికేగా
ఎస్‌బిఐ ఆసరా కర్రలు పెట్టింది!
అయినా, అప్పిచ్చువాడు వైద్యుడనే కదా
సుమతీ శతకకారుడు చెప్పింది!
అది కూడా తెలీని దద్దమ్మల్లా ఉన్నారే జనం!
మావాడుషారోడు కాబట్టే
నా బాణాల్నే వాడుతున్నాడు
పాకిస్థాన్ కుట్రుందన్నాడు!
చైనా కుతంత్రమన్నాడు!
భారతదేశంపైనే దాడన్నాడు!
అవి పాశుపతాస్త్రాలు! సుదర్శన చక్రాలు!
నన్ను తిట్టినా, మా'నిట్టాడి'ని తిట్టినా
దేశాన్ని తిట్టినట్టే!
భారతీయ సంస్కృతిని తిట్టినట్టే!
ఖబడ్దార్!!

- ఆరెస్బీ

త్రిపుర ఎన్నికలపై దేశం దృష్టి


తెలకపల్లి రవి

ఈ నెల 16న శాసనసభ ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో త్రిపుర ఒక ప్రత్యేకత సంతరించుకుంది. ఒక్కసారి మినహా 1978 నుంచి 2017 వరకూ అవిచ్ఛిన్నంగా పాలించిన వామపక్ష కూటమి గత ఎన్నికల్లోనే అధికారం కోల్పోయింది. గతంలో 1988లో కేంద్ర కాంగ్రెస్ చేసినదాన్ని మించి 2018 ఎన్నికల్లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్బంధకాండ అందుకు కారణమైంది. కేంద్రం కుటిల రాజకీయాలు, రాజకీయ కక్ష సాధింపు, అన్నింటికీ మించి అధికార దుర్వినియోగం అన్నీ కలసి ఆదర్శ ముఖ్య మంత్రిగా పేరు తెచ్చుకున్న మాణిక్ సర్కార్ ప్రభుత్వం దిగిపోవడానికి కారణమైనాయి. అయినా ఆయన పట్ల ప్రజలలో గల అమితాదరణ తెలుసుగనకే ఫలితాలు వెలువడిన తర్వాత కేంద్ర రాష్ట్ర బీజేపీ నాయకులు స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి హాజరుకావాల్సిందిగా మరీ మరీ కోరారు. కానీ, విప్లవకుమార్ దేవ్ అధికారం చేపట్టిన మరుసటి రోజు నుంచి సీపీఐ(ఎం) కార్యకర్తలపై కార్యాలయాలపై దాడులు నిత్యకృత్యమైనాయి. మరీ ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో హద్దూ ఆపూలేని దౌర్జన్యాలు, హత్యాకాండ తాండవించాయి. ఈ నిరంకుశత్వం చివరకు బీజేపీనీ అంతర్గతంగా దెబ్బతీసింది. విప్లవదాస్ ఏకపక్ష పోకడలు ఆ పార్టీలోనూ విమర్శకు గురైనాయి. 2022 మేలో విప్లవదేవ్‌ను మార్చి ఆస్థానంలో మాణిక్‌సాహాను ప్రతిష్టించడం ద్వారా కేంద్ర నాయకత్వం ప్రజల్లో వ్యతిరేకతను చల్లార్చాలని విఫలయత్నం చేసింది. చివరికి ఆ తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొవడానికి ఢిల్లీ నేతలు దిగివచ్చి ప్రచారం నెత్తిన వేసుకున్నారు. ఈ చిన్న రాష్ట్రంలో సభలకు ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా, అధ్యక్షుడు నడ్డా, అసోం ముఖ్యమంత్రి హిమంత్ కుమార్ శర్మ పదేపదే పర్యటించాల్సివస్తున్నది. అయినా అనుమానంగానే ఉండటంతో అలవాటైన

త్రిపురలో బీజేపీ ప్రభుత్వం పెంచిన విద్వేష, విధ్వంసకాండలకు స్వస్తి చెప్పడానికే తాము కలిశామని సీపీఐ(ఎం) కార్యదర్శి జితేంద్ర చౌదరి, పిసిసి అధ్యక్షుడు వీర్‌జిత్ సిన్హా ఒక ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇరుగుపొరుగు ఇళ్లలో వారికి విభేదాలున్నా ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఉభయులకూ ముప్పు గనక కలసి పనిచేసినట్టే తామూ ఒప్పందం కుదుర్చుకున్నామని ఉభయపార్టీల నేతలు ప్రకటించారు. సోమవారం ఉపసంహరణలకు చివరి రోజు గనక ఆ తర్వాతనే తుది చిత్రం అర్థమవుతుంది. ఏమైనా హోరాహోరీపోటీ అనివార్యం. మార్చి రెండున ఫలితాలు వెలువడతాయి.


హింసాకాండను మరింత ఉధృతం చేయడం అధికార పార్టీ అభద్రతకు అద్దం పడుతున్నది. టికెట్ల పంపిణీ, అభ్యర్థుల ఎంపిక కూడా సమస్యగానే తయారైంది. గతంలో అధికారానికి రావడానికి ప్రత్యేకంగా సహాయపడిన ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి-దేశీయ గిరిజన సంఘటన) పొత్తు కొనసాగించడమే గాక విలీనం చేసుకోవడానికీ తంటాలు పడింది. కానీ చివరకు వారి స్థానాలలో వారే పోటీ చేస్తున్నారు. అప్పట్లో వేర్పాటువాదంతో త్రిప్రిలాండ్ పేరిట గిరిజన ప్రాంతాల విభజన కోసం ఈ పార్టీ ఉద్యమాలు నడిపి ఉద్రిక్తతకు కారణమైంది. ఈశాన్య ప్రాంతాల నేపథ్యం, విభజన సమస్యలు తెలిసినా బీజేపీ నాయకత్వం కేవలం ఎన్నికల గెలుపుకోసం ఆ పార్టీని అక్కున చేర్చుకున్నది.

సైద్ధాంతిక రాజకీయ దాడి

నిజం చెప్పాలంటే బీజేపీ ఇంతగా కేంద్రీకరణ చేయడం వెనక లోతైన కారణాలున్నాయి. సైద్ధాంతికంగా, రాజకీయంగా తమకు అతి ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న సీపీఐ(ఎం) వామపక్షాలను దెబ్బతీయాలన్నదే గతంలోనూ ఇప్పుడూ దాని ఏకైక సూత్రం. మాకు ఒక కార్పొరేటర్ కూడా లేని త్రిపురలో అన్నేండ్ల పాటు పాలించిన వామపక్షాలను ఓడించామని వారు ప్రతి సారీ ప్రతిచోటా టముకు వేసుకుంటారు. అందుకు అనుసరించిన అప్రజాస్వామిక పోకడలను గురించి మాత్రం చెప్పరు.

నిజానికి ఇది కేంద్రాన్ని పాలించే పార్టీగా బీజేపీ బాధ్యతా రాహిత్యం కూడా. నిరంతర అశాంతితో రాజకీయ అస్థిరతతో అతలాకుతలమవుతున్న ఈశాన్య భారతంలో ఒకేఒక సుస్థిరద్వీపంగా, ప్రత్యామ్నాయ దీపంగా వెలుగొందిన రాష్ట్రం త్రిపుర. బాగా వెనకబడిన గిరిజన ప్రధానమైన ఆ రాష్ట్రంలో ప్రజానుకూల విధానాలతో విజయపరంపరతో సీపీఐ(ఎం) పురోగమించింది. దేశానికే ఆదర్శమైన ముఖ్య మంత్రిగా మాణిక్ సర్కార్ ప్రజాదరణ పొందారు. ఆ ప్రభుత్వాన్ని, రాష్ట్రాన్ని బలోపేతం చేసి సున్నితమైన ఈశాన్య సరిహద్దులో శాంతి సామరస్యాలకు దోహదం చేయడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. నరేంద్రమోడీ ప్రధాని బాధ్యతలు చేపట్టిన కొత్తలోనైతే మీ ఒక్కరాష్ట్రమే ఎలా శాంతియుతంగా ఉండగలుగుతున్నదని మాణిక్ సర్కార్‌ను వాకబుచేశారు కూడా! కాని కేంద్రంలోని బీజేపీ, దాని ప్రత్యక్ష పరోక్ష రాజకీయ నేస్తాలు త్రిపురను ఎలాగైనా వశం చేసుకోవాలని రకరకాల విచ్ఛిన్న శక్తులకు పాలుపోసి పెంచుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ మరోసారి విజయం సాధించడం ఈ తరహా కుట్రలు కుత్సితాలు పెరగడానికి దారితీసింది. ఈ విచ్ఛిన్నకర ప్రయత్నాలు, రాజకీయ కుట్రలూ రెండు స్థాయిల్లో సాగాయి. మొదటిది సంప్రదాయికంగా ఈశాన్య భారతంలో సమస్యగా ఉన్న గిరిజన గిరిజనేతర ఐక్యతకు చిచ్చు పెట్టడం. రెండు బీజేపీ వెనకవుండి తృణమూల్ కాంగ్రెస్‌ను ఎగదోసి వామపక్ష ప్రభుత్వాన్ని దెబ్బతీయడం. వామపక్షాలను దించే ఏకైక లక్ష్యంతో రాజధాని అగర్తలాలో త్రిప్రీలాండ్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకై ఆందోళన పేరిట జరిగిన అరాచకం అందులో భాగమే. వాస్తవానికి 1980లో నృపేన్‌చక్రవర్తి నాయకత్వంలో రెండవసారి వామపక్ష సంఘటన అధికారం చేపట్టినప్పుడే త్రిపుర ఉపజాతి సమితి, ఆమ్రబెంగాలి అనే దురభిమాన సంస్థ, హింసాత్మక శక్తి ఆనంద్‌మార్గ్ దారుణకల్లోలం సృష్టించాయి. భారీ ప్రాణ, ధన నష్టం జరిగింది. అప్పటినుంచి వామపక్ష ప్రభుత్వం మరింత అప్రమత్తతతో గిరిజన గిరిజనేతర ఐక్యతను కాపాడుకుంటూ వస్తున్నది. ఈశాన్య భారతంలో త్రిపుర ఒక భిన్నమైన ఉదాహరణగా నిలవడానికి ఇదే కారణం. ఈ ప్రశాంతతను భగ్నం చేయడానికి సిద్ధం కావడం ప్రధాన పాలకపార్టీల దివాళాకోరు తనం.

బెంగాల్‌లో రెండవసారి విజయం సాధించడం టిఎంసి పార్టీకి అధినేత మమతా బెనర్జీకి విస్తరణ దాహం పెంచింది. బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ ప్రత్యేకంగా కొందరిని ఈ రాష్ట్రానికి కేటాయించి పంపించింది. తమకు అలవాటైన సైనిక విద్యల శిక్షణనిస్తూ వారు స్థానికంగా ఉన్న మతసామరస్య వాతావరణం దెబ్బతినడానికి, ఉద్రిక్తతలు పెరగడానికి కారకులవుతున్నారు. అధికారంలోకి వచ్చాక మరీ చెలరేగిపోయారు. ఇటీవలనే మాజీ ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ హైదరాబాద్ పర్యటన సందర్భంలో రాబోయే ఎన్నికల పరిస్థితిని గురించి ఈ వ్యాసకర్త ప్రశ్నించినప్పుడు ఎన్నికలలో ప్రజలను ఓటు వేయనిస్తే గెలుస్తామని ఒక్క ముక్కలో జవాబిచ్చారు.



ఎన్నికల దృశ్యం... సర్దుబాట్లు

2018 ఎన్నికల్లో ఇక్కడ వామపక్షాలు ఓడిపోయినా ఓటింగుశాతం కాపాడుకున్నాయి. 16 స్థానాలు తెచ్చుకోగా కాంగ్రెస్ 1, తృణమూల్ సున్నా దగ్గరే ఆగిపోయాయి. బెంగాల్‌లో వలె గాక త్రిపురలో ఇప్పటికీ సీపీఐ(ఎం) పెద్దశక్తిగా ఉంది. మాణిక్ సర్కార్ పట్ల ప్రజాభిమానం ఉంది. పైగా బీజేపీ పాలనలో హత్యలు దాడులు విధ్వంసాలపై 700పైగా కేసులు నమోదుకావడం పరిస్థితిని తెల్పుతుంది. నిరుద్యోగం, పనుల లేమి, ధరల పెరుగుదల అసలే వెనకబడిన రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. బీజేపీ డబుల్ ఇంజన్‌సర్కార్ ట్రబుల్ ఇంజన్‌గా మారింది. బీజేపీని గద్దెదింపాలంటే ప్రతిపక్షాల మధ్య అవగాహన తప్పనిసరి అని కాంగ్రెస్ గుర్తించాల్సివచ్చింది. రాష్ట్ర వ్యవహారాల పరిశీలకుడైన అజయ్‌వర్మ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి చర్చలు జరిపి ఆ మేరకు అవగాహన ప్రకటించారు. ఫ్రంట్ 47 చోట్ల, కాంగ్రెస్ 13 చోట్ల పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చాయి.

బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ ప్రత్యేకంగా కొందరిని ఈ రాష్ట్రానికి కేటాయించి పంపించింది. తమకు అలవాటైన సైనిక విద్యల శిక్షణనిస్తూ వారు స్థానికంగా ఉన్న మతసామరస్య వాతావరణం దెబ్బతినడానికి, ఉద్రిక్తతలు పెరగడానికి కారకులవుతున్నారు. అధికారంలోకి వచ్చాక మరీ చెలరేగిపోయారు. ఇటీవలనే మాజీ ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్ హైదరాబాద్ పర్యటన సందర్భంలో రాబోయే ఎన్నికల పరిస్థితిని గురించి ఈ వ్యాసకర్త ప్రశ్నించినప్పుడు ఎన్నికలలో ప్రజలను ఓటు వేయనిస్తే గెలుస్తామని ఒక్క ముక్కలో జవాబిచ్చారు.

అయితే కాంగ్రెస్ అభ్యర్థులు 17చోట్ల పోటీ పెట్టడంతో సమస్య ఎదురైంది. వామపక్ష ఫ్రంట్‌లో సీపీఐ(ఎం) 43, భాగస్వాములుగా ఉన్న సీపీఐ, ఆరెస్పీ, ఫార్వర్డ్‌బ్లాక్‌లు తలొకటి చొప్పున పోటీ చేస్తున్నాయి. 24మంది కొత్త అభ్యర్థులు వామపక్షాల తరపున రంగంలో ఉన్నారు. అనుకున్న సీట్లకు పరిమితమైతేనే తాము మద్దతునిస్తామని సీపీఐ(ఎం) స్పష్టం చేసింది. అయినా ఇరు పక్షాలూ చివరకు ఒప్పందం కుదురుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. తృణమూల్‌ను కూడా కలుపుకోవాలని కాంగ్రెస్ ఆశించినా మమతాబెనర్జీ బీజేపీ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకే సిద్ధమైనారు. బీజేపీ ఇప్పుడుకూడా గిరిజన ప్రాంతాలలో విచ్ఛిన్నకర శక్తులపైనే ఆశపెట్టుకున్నది.

వామపక్షాల ప్రణాళిక

అయిదేండ్ల ప్రజావ్యతిరేక పాలన కారణంగానూ ఓట్ల చీలిక నివారణ ఫలితంగానూ తాము బీజేపీని ఓడిస్తామని వామపక్షాలు, కాంగ్రెస్ చెబుతున్నాయి. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో సహా సీపీఐ(ఎం) నాయకులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. వామపక్ష ఫ్రంట్ ప్రణాళిక కూడా విడుదలచేసింది. అయిదేండ్లలో 2.5లక్షల మందికి ఉద్యోగాలు, కుటుంబానికి యాభై యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, భూమిలేని పేదలకు భూవసతి కల్పిస్తామనీ, విద్యాసంస్థల ప్రయివేటీకరణ ఆపుతామనీ వాగ్దానం చేసింది. బీజేపీ హయాంలో ఉద్యోగాలు కోల్పోయిన వారిని తిరిగితీసుకుంటామనీ, రాజ్యాంగ సవరణకోసం పోరాడటం ద్వారా గిరిజన స్వయం స్వయంపాలక మండళ్లకు మరిన్ని అత్యధిక అధికారాలు సాధిస్తామనీ ప్రకటించారు. ప్రజాస్వామ్య హక్కుల పునరుద్ధరణ, మీడియా రక్షణ, లౌకిక విలువల పట్ల నిబద్ధత కూడా ప్రణాళిక ప్రముఖంగా ప్రస్తావించింది. త్రిపురలో బీజేపీ ప్రభుత్వం పెంచిన విద్వేష, విధ్వంసకాండలకు స్వస్తి చెప్పడానికే తాము కలిశామని సీపీఐ(ఎం) కార్యదర్శి జితేంద్ర చౌదరి, పిసిసి అధ్యక్షుడు వీర్‌జిత్ సిన్హా ఒక ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఇరుగుపొరుగు ఇళ్లలో వారికి విభేదాలున్నా ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఉభయులకూ ముప్పు గనక కలసి పనిచేసినట్టే తామూ ఒప్పందం కుదుర్చుకున్నామని ఉభయపార్టీల నేతలు ప్రకటించారు. సోమవారం ఉపసంహరణలకు చివరి రోజు గనక ఆ తర్వాతనే తుది చిత్రం అర్థమవుతుంది. ఏమైనా హోరాహోరీపోటీ అనివార్యం. మార్చి రెండున ఫలితాలు వెలువడతాయి.

ఆదానీ వాదం...!

నజర్

"ఏమండీ శ్రీవారు? టిఫిన్ తెచ్చాను తినండి!" అంటూ టిఫిన్ తెచ్చి ఆనంద్ ముందున్న టీపాయ్ మీద పెట్టింది వందన.

"ఊ" అంటూనే ఫోన్ చూడటంలో మునిగిపోయాడు ఆనంద్. ఉ కొట్టాడు గాని టిఫిన్ మాత్రం చేయనే లేదు. కాసేపటికి శేఖర్ వచ్చాడు. ఆనంద్‌నూ, అతని ముందున్న టిఫిన్ ప్లేట్‌ను చూశాడు.

"ఏమిట్రా? టిఫిన్ చేయకుండా ఫోన్‌లో ఏం చేస్తున్నావు?" అడిగాడు శేఖర్.

"ఊ" అంటూ మళ్ళీ ఫోన్‌లో మునిగిపోయాడు.

"ఏమిటమ్మా వందనా, మీ ఆయన నీతో కోట్లాడాడా? ఏమీ మాట్లాడటం లేదు!" అంటూ శేఖర్ వందనను పిలిచాడు.

వందన లోపలి నుండి బయటకు వచ్చింది. భర్తనూ, టిఫిన్ ప్లేటునూ చూసింది.

"టిఫిన్ పెట్టి అరగంటైంది! తినలేదన్నా!" అన్నది వందన.

"ఎందుకురా వాడికిష్టమైన టిఫినే గదా!" అంటూ ఆనంద్ మొఖంలోకి చూశాడు. శేఖర్ వందననూ చూడమన్నాడు.

"ఆనంద్ మొఖంలో క్షణక్షణం రంగులు మారిపోతున్నాయి. ముఖంలో నవరసాలు కూడా తొణికిసలాడుతున్నాయి.

"అన్నా! మా ఆయనకేమయ్యింది!" అన్నది వందన భయంగా. శేఖర్ కూడా కంగారు పడ్డాడు. క్షణక్షణానికి ఆనంద్ మొఖంలో భావాలు మారుతుంటే ఏం చేయాలో తోచలేదు! ఇంతలో "దేశద్రోహులు!" అన్నాడు ఆనంద్ ఫోను పక్కకుపెట్టి.

"ఎవరు మేమా!" అన్నాడు శేఖర్, వందనా జాయింటుగా.

"ఛ మీరు కాదురా! ఆదానినీ విమర్శిస్తున్న వారు!" అన్నాడు ఆనంద్ టిఫిన్ తింటూ.

"ఆదానీని ఎవరూ విమర్శించలేదు! వ్యాపారంలో మోసాలు చేశాడని తన సంపదను అక్రమంగా పెంచి చూపాడని అంటున్నారు!" అన్నాడు.

"అదేం, ఆ మాటన్నది ఎవరు? హిండెన్ బర్గే కదా! అది భారతీయ కంపెనా కాదు! విదేశీ కంపెనీ! ఆ కంపెనీ భారతదేశాన్ని ఆర్థికంగా దెబ్బ తీయాలని, ఉద్దేశపూర్వకంగా ఇలా దాడి చేస్తోంది!"

"భారతదేశాన్ని దెబ్బతీసే ఆ కంపెనీకి ఏం లాభం వస్తుంది? ఇలాంటి ఆరోపణలు ఇదే మొదటిసారి కాదగదా! ఇంతకు ముందే ఓ కంపెనీ ఇలాంటి ఆరోపణలు చేసింది! పైగా ఆస్ట్రేలియా, స్పెయిన్, శ్రీలంక దేశాలలో ఆదానికీ వ్యతిరేకంగా వీధి పోరాటాలు జరుగుతున్నాయి! కదా!" అన్నది వందన.

"నీవే చెబుతున్నావు. విదేశాలలో జరుగుతున్నాయని, అంటే, మన దేశానికి వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నారన్న మాట! వారి వెనక ముస్లిం పాకిస్తానో, కమ్యూనిస్టు చైనానో ఉంటాయి" అన్నాడు ఆనంద్ ఆవేశంగా.

"విదేశాలలో నిరసన ప్రదర్శనలు చేసింది భారతదేశం మీద కాదు! ఆదానికి వ్యతిరేకంగా!" అన్నాడు శేఖర్.

"ఆదానీ అంటే ఎవరనుకున్నావు! భారతదేశానికి మారు రూపు! ఎందుకంటే ఈ దేశంలోని బొగ్గు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, రైల్వేలు, వంటనూనెలు, విద్యుత్ ఇలా ఒకటేమిటి అన్నీ వ్యాపారాలు ఆదానీవే! ఒక్క మాటలో చెప్పాలంటే భారతదేశ వ్యాపారమంటే అది ఆదానీ వ్యాపారమే! ఆదానీ వ్యాపారాన్ని దెబ్బతీయటమంటే భారతదేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయటమే!" అన్నాడు ఆనంద్.

"మరి ఆదానీ అక్రమాలు చేస్తే, భారతదేశం కూడా అక్రమాలు చేసినట్టేనా?" ప్రశ్నించింది వందన.


"ఖామూష్! నా భారతదేశం పవిత్రదేశం! అలాగే ఆదానీ కూడా పవిత్రమైనవాడు తప్పు చేయడు! ఆదానీ ఎంత నిజాయితీపరుడో తెలుసా! ఎఫ్‌పిఒలో ఇన్వెస్టు చేసిన ఇరవై వేల కోట్లు తిరిగి మదుపరులకు ఇచ్చేశాడు?" అన్నాడు.

ఫక్కున నవ్వింది వందన! శేఖర్ కూడా నవ్వాడు.

"ఎందుకు నవ్వుతారు! ఇదుగో వాట్సప్ సాక్షం చూడండి!" అంటూ ఆనంద్ వాట్సప్ చూపాడు ఫోనులో.

"వాట్సప్ సాక్ష్యాలు ఎందుకులే గాని, ఎఫ్‌పిఒలో ఇన్వెస్టు చేసింది, జిందాల్, మిట్టల్, అంబానీ లాంటి కార్పొరేట్లే, వీళ్ళు ఆదానీకి సహాయం చేయటానికి డబ్బులు ఎఫ్‌పిఒలో ఇన్వెస్టు చేశారు! హిండెన్ బర్గ్ నివేదిక నేపథ్యంలో ఎఫ్‌పిఒకు స్పందన రాకపోతే నష్టం జరుగుతోందని గుర్తించి ఆదానీ స్నేహితులు పెట్టుబడులు పెట్టారు. వాటినే ఆదానీ తిరిగి ఇస్తున్నాడు." వివరించాడు శేఖర్.

"తన ఆస్తులు విలువను మించి అప్పులు చేశాడని, ఆ ఆస్తులను అక్రమంగా పెంచి చూపాడని హిండెన్ బర్గ్ తప్పుడు రిపోర్టు



ఇచ్చింది! ఏం పారిశ్రామిక వేత్తలు అప్పులు చేయకూడదా? అయినా తన ఆస్తులు కుదువ పెట్టి అప్పులు చేశాడు! ఇందులో తప్పేం ఉంది!" ప్రశ్నించాడు ఆనంద్.

"ఎవరైనా అప్పులు చేయటం తప్పేం కాదు! ఆస్తులు కుదువ పెట్టి తప్పు చేయటం కూడా తప్పుకాదు! అయితే నీ వద్ద ఉన్న బైక్ విలువ లక్ష రూపాయలైతే, ఆ బైక్ కుదువబెట్టి పది లక్షలు అప్పు తేవటం తప్పు! ఇలా చేయటంలో మతలబు ఏమిటో చెప్పనా?" అడిగాడు శేఖర్.

"ఇందాక నీవు చెప్పినట్లు ఆదాని వద్ద నున్న విమానా శయాలు, నౌకాశ్రయాలు, బొగ్గు, విద్యుత్ లాంటి ఈ దేశ ప్రజల సొంతం! అవిప్పుడు ఆదానీ స్వాధీనంలో ఉన్నాయి. వాటిని కుదువపెట్టి లక్షల కోట్లు అప్పు చేసి, ఆ అప్పు చెల్లించకపోతే ప్రజల ఆస్తి ఏమవుతుంది? అంతే కాదు! అప్పులిచ్చిన సంస్థలు కూడా దెబ్బ తింటాయి కదా! అన్నాడు శేఖర్.

"ఇదంతా ఫేక్! ఆదానికి అప్పులిచ్చిన ఎస్‌బిఐ, ఎల్ఐసి దివాళా తీశాయా? లేదు కదా! ఆదానికి అప్పులిచ్చినా, పెట్టుబడులు పెట్టినా దివాళా తీయలేదు! ఇప్పటికీ లాభాలే ఉన్నాయి. కాకపోతే కొద్దిగా తగ్గాయి! అంతే! అయినా ఆదానీ మీద అసూయతో ప్రభుత్వ రంగ సంస్థలను కూడా బద్నాం చేస్తున్నారు! మెల్లిగా వీరిద్దరూ దేశ ద్రోహుల లిస్టులో చేరిపోతున్నారు!" అంటూ అనుమానంగా చూశాడు ఆనంద్.

"ఎస్‌బిఐ, ఎల్ఐసిలు చాలా పెద్ద ఆర్థిక సంస్థలు! ఆదానీ వల్ల నష్టం వచ్చినా తట్టుకుని నిలబడగలవు! కాని విషయమేమిటంటే ప్రజల ఆస్తులను కుదువబెట్టి, ప్రజలకు చెందిన ఆర్థిక సంస్థల వద్ద నిధులు సేకరించి, ఒక ప్రయివేటు వ్యక్తి ఆస్తులు పోగేసుకోవటం మోసం కాదా! నీవు చెప్పినట్లు లాభాలు తగ్గాయంటే, అదీ ప్రజలవే కదా! అంటే ప్రజలే నష్టపోయారు!" అన్నాడు శేఖర్.

ఆనంద్ మాట్లాడకుండా ఫోన్‌లో తల దూర్చాడు. తర్వాత తలెత్తి ఇద్దరికీ ఫోను చూపాడు. "ఈ ఎనలిస్టు చెప్పేది వినండి, హిండెన్ బర్గ్ కమిటీకే విశ్వసనీయత లేదు! ఆ కంపెనీ చెప్పేవాటికి ఏం విశ్వసనీయత ఉంటుందీ! ఎలాంటి పరిశోధన చేయకుండా ఆదానీ మోసం చేశాడని చెప్పి, దేశ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చాలని చూస్తున్నారు."

"బ్రిటిష్‌వాడిని ప్రశ్నించిన స్వాతంత్ర్యయోధు లందర్నీ దేశద్రోహులని ముద్ర వేసింది బ్రిటిష్ ప్రభుత్వం! అదలా ఉంచుదాం! ఆదానీ మీద ఇన్ని ఆరోపణలువస్తుంటే, ఈడి, సిబిఐ, ఎస్ఈబిఐ లాంటి సంస్థలు కిమ్మనటం లేదు! చిన్న, చిన్న విషయాలపై కూలంకుశంగా పరిశోధనలుచేసే ఈ దర్యాప్తు సంస్థలు కళ్ళు, చెవులు, నోరూ అన్నీ మూసుకున్నాయేం? ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం, మాట వరసకైనా విచారిస్తాం అనటం లేదేమి?

"ఆ కంపెనీకి విశ్వసనీయత ఉందా లేదా అన్నది పాయింట్ కాదు! ఆ కంపెనీ చెప్పిన విషయాలకు విశ్వసనీయత ఉందా లేదా అన్నది పాయింట్. ఆ కంపెనీ 84 ప్రశ్నలు వేసింది. ఒక్క ప్రశ్నకూ ఆదానీ జవాబు చెప్పలేదు. మన దేశంలో తన మీద ఆరోపణలు చేసిన జర్నలిస్టుపై వందల కోట్లు పరువునష్టం దావా వేసే ఆదానీ, ఈ రోజు వరకు హిండెన్ బర్గ్ మీద దావా వేయలేదేం! పైగా ఆ కంపెనీ కూడా కేసు వేయమంటున్నది కదా!" అన్నది వందన.

"డౌటేం లేదు! మీరు దేశద్రోహులై పోయారు!" అన్నాడు ఆనంద్.

"బ్రిటిష్‌వాడిని ప్రశ్నించిన స్వాతంత్రయోధు లందర్నీ దేశద్రోహులని ముద్ర వేసింది బ్రిటిష్ ప్రభుత్వం! అదలా ఉంచుదాం! ఆదానీ మీద ఇన్ని ఆరోపణలువస్తుంటే, ఈడి, సిబిఐ, ఎస్ఈబిఐ లాంటి సంస్థలు కిమ్మనటం లేదు! చిన్న, చిన్న విషయాలపై కూలంకుశంగా పరిశోధనలుచేసే ఈ దర్యాప్తు సంస్థలు కళ్ళు, చెవులు, నోరూ అన్నీ మూసుకున్నాయేం? ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం, మాట వరసకైనా విచారిస్తాం అనటం లేదేమి? పోనీ హిండెన్‌బర్గ్ నివేదిక తప్పని చెప్పటం లేదేమి?" నిలదీసింది వందన.

ఆనంద్ మళ్ళీఫోన్‌లో తల దూర్చాడు.

- ఉషాకిరణ్.

ముందు మీ పని.. ఆ తర్వాత నా పని...

సమయానుకూలంగా.. సందర్భానుసారంగా అప్పటి కప్పుడు వాగ్బాణాలను సంధించటం, తద్వారా సభను రక్తి కట్టించటం, జనాలను తన వైపునకు తిప్పుకోవటమనేది ఒక అద్భుతమైన కళ. అది అందరికీ రాదు. ఆ కళ తెలిసిన వారు మాత్రం ఏ వేదిక మీదైనా దాన్ని అలకోవగా ప్రదర్శిస్తూ సభికుల చేత చప్పట్లు కొట్టించుకుంటారు. కొద్ది రోజుల క్రితం ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలో గులాబీ దళపతి కేసీఆర్... ఇదే కళను ప్రదర్శించారు. సభకు ముఖ్య అతిథులుగా హాజరైన పలు రాష్ట్రాల సీఎంలు తొలుత ప్రసంగించారు. వారందరూ ఇంగ్లీషు, హిందీల్లో ఉపన్యసించారు. ఈ క్రమంలో సభలో ఉన్న కొందరు యువకులు, కేసీఆర్ అభిమానులు అదే పనిగా నినాదాలు చేయటంతో ఆయన కొంత అసహనం వ్యక్తం చేస్తూ వారందరినీ వారించేందుకు ప్రయత్నించారు. సభలో చివరగా కేసీఆర్ మాట్లాడేందుకు లేవగానే... మళ్లీ నినాదాలు, కేకలు, కేరింతలు కొనసాగాయి. దాంతో సీఎం మైకందుకుని...'ఇంగ్లీషు, హిందీ స్పీచ్‌లు వినటానికి కూడా మీరు అలవాటు పడాలే. ఇతర రాష్ట్రాల సీఎంలు మాట్లాడేటప్పుడు ఒకటే లొల్లి చేసిన్రు. అందుకే ముందు మీ సంగతి చెబుతా... ఆ తర్వాత నా సంగతి కూడా చెప్పుకుంటా...' అంటూ వ్యాఖ్యానించారు. అనంతరం ఖమ్మం నగరానికి, ఆ జిల్లాలోని పలు మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయిస్తూ వరాల జల్లులు కురిపించారు. ఆ తర్వాత కొనసాగిస్తూ... 'మీక్కావాల్సినవన్నీ ఇచ్చా.. అందువల్ల మీ పని అయిపోయింది...' అని చెప్పారు. అప్పటిదాకా సీఎం ఎవరి మీద ఎంతటి ఆగ్రహం వ్యక్తం చేస్తారోనని ఆందోళన పడ్డ యువకులందరూ...'మీ సంగతి చూస్తానంటూ సీఎం హెచ్చరించే సరికి, ఎవరి మీద ఏం బాంబు పేల్చుతారోనని భయపడ్డాం. కానీ ఆయన భాషలో సంగతి అంటే నిధులన్నమాట...' అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నారు. అదే సభలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల గురించి అడిగితే... 'వెంటనే ఖమ్మంలోని జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలి...' అంటూ వేదిక మీదున్న మంత్రులు హరీశ్‌రావును, పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఆయన ఆదేశించారు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే... ఇదే మాదిరిగా హైదరాబాద్‌తోపాటు అనేక జిల్లాల్లో సీఎం ఇదే రీతిలో విలేకర్ల ఇండ్ల స్థలాలపై హామీనిచ్చారు. కానీ ఎక్కడా.. ఏ ఒక్క జిల్లాలోనూ అది అమలు కాలే.. గట్లుంటది సర్కారు వారితోటి...

-బి.వి.యన్.పద్మరాజు

మూసవిధానానికి స్వస్తి చెప్పండి



ఉద్యోగం ఆర్థిక వెసులుబాటు కలిగిస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. సంతోషాన్నీ, సంతృప్తినీ ఇస్తుంది. గుర్తింపు తెచ్చిపెడుతుంది. ఇన్ని లాభాలు చేకూర్చే ఉద్యోగంలో ఉన్న స్థితిలోనే ఉండిపోలేం కదా... మరింత ఉన్నతి సాధించాలంటే ఈ సూత్రాలు పాటించమంటున్నారు కెరియర్ నిపుణులు...

- తోటి ఉద్యోగులు మీలాగే ఉండాలని ఆశించొద్దు. ఒకరికి సలహాలివ్వాలని చూడొద్దు. మంచికి పోయినా పెడార్థాలు తీసేవారు ఉంటారని గుర్తుంచుకోండి. మీ వరకూ మీరు ఎంత నాణ్యమైన ఉత్పాదకతను ఇవ్వగలరో ఆలోచించి ప్రణాళికతో, నిబద్ధతతో పనిచేయండి.
- ఏ రంగంలోనయినా ప్రోత్సహించి సాయం అందించేవారితోపాటు నిరుత్సాహపరుస్తూ అవరోధాలు కలిగించేవారూ ఉంటారు. అలాంటివారి మీద కోపతాపాలు వద్దు. అప్రమత్తంగా ఉంటూ లక్ష్యం దిశగా సాగండి.
- ఉద్యోగం ఇష్టంగా కాకుండా భారంగా అనిపించిందంటే ఎదుగుదల మీద ధ్యాస తగ్గుతుంది. శారీరక, మానసిక ఆరోగ్యమూ దెబ్బతినే ప్రమాదముంది. కనుక చేసే పనుల్లో ఎప్పటికప్పుడు సులువైన మార్గాలు కనిపెట్టండి.
- సహోద్యోగులు లేదా పై అధికారుల విషయంలో మీకేదైనా అసంతృప్తి ఉన్నా.. ఆ విషయాలు చర్చకు పెట్టొద్దు. అవి చిలవలు పలవలై మీమీద సదభిప్రాయాన్ని పోగొడతాయి.
- ఎంత సమర్థంగా చేస్తున్నా ఒక్కోసారి ఆశించిన ఫలితం రాకపోవచ్చు. అడ్డంకులు ఎదురవ్వొచ్చు. మనం నడిచే దారిలో ముళ్లూ రాళ్లూ ఎదురైనంతలో డీలాపడి వెనక్కెళ్లం కదా... ఉద్యోగమైనా అంతే. తెలివిగా దాటుకుంటూ ముందుకెళ్లాలి.
- ముందుగా లక్ష్యాలను నిర్దేశించుకుంటే వాటిని ఎలా చేరాలో స్పష్టత వస్తుంది. సునాయాసంగా గమ్యం చేరిపోతామని ఊహల్లో తేలిపోవద్దు. ఏవైనా ఆటంకాలూ ఎదురైనంతలో నిరాశచెందక పట్టుదలగా ప్రయత్నించాలి.
- పనిలో మూసవిధానానికి స్వస్తి చెప్పండి. లేదంటే ఎదుగుదల ఉండదు. ఎప్పటికప్పుడు ఇంకా కొత్తగా ఏం చేయొచ్చో ఆలోచించండి.
- తోటి ఉద్యోగులతో విభేదాలు వస్తే ఆ విషయాన్ని వారితోనే చర్చించండి. విషయం తేటతెల్లమవుతుంది. అంతే తప్ప తొందరపడి ఉద్యోగం మానేయొద్దు, అశాంతిని కొనితెచ్చుకోవద్దు.

కల్పనా బాలసుబ్రమణియన్... గ్రాంట్ థార్న్‌టన్ dGTL సీఈఓగా ఉన్న ఈమెకు తన కెరీర్‌లో రెండు దశాబ్దాల అనుభవం ఉంది. ఓ మహిళగా తన ప్రయాణంలో ఎదుర్కొన్న ఒడిదుడుకుల గురించి నేటి మానవిలో...



వ్యక్తిగత లక్ష్యాలూ అవసరమే



కల్పనా బాలసుబ్రమణియన్... మసాచుసెట్స్‌లోని హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుండి బిజినెస్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ఆమె గ్లోబల్ అకౌంటింగ్ సంస్థ KPMGతో పాటు ఐటీ కన్సల్టెన్సీ సంస్థ IGATE వంటి సంస్థలతో కలిసి పనిచేశారు. కెరీర్ అనుభవం గురించి కల్పన మాట్లాడుతూ తన కెరీర్‌లో ఒకానొక సమయంలో వృత్తిపరంగా, వ్యక్తిగతంగా అనేక పాత్రలను పోషించాల్సి వచ్చిందన్నారు. కానీ ఒక ప్రొఫెసర్‌తో జరిగిన చర్చల సందర్భంగా ఇన్ని పాత్రలు పోషించేటప్పుడు విజయానికి హామీ ఇవ్వాల్సిన అవసరం లేదని, దాని గురించి బాధపడాల్సిన పని లేదని ఆమె గ్రహించారు.

నిర్దిష్ట విషయంపై...

"నేను ఒక ప్రొఫెసర్‌ని కలిశాను. మనం అన్ని విషయాల్లో కచ్చితంగా ఉండనవసరం లేదని, అలా ఉండడం ఏ మనిషికీ సాధ్యం కాదని ఆమె చెప్పారు. మీరు విజయవంతం కావాలంటే మీరు మీ సంభాషణలు, చర్యలు, ప్రవర్తనను సమకాలీకరించాలి. చాలా సార్లు మనం ఇబ్బంది పెట్టే విషయాల నుండి బయటపడటానికి ప్రయత్నిస్తామని నేను భావిస్తున్నాను. అయితే మీ జీవితంలోని ఒక నిర్దిష్ట విషయంపై దృష్టి పెట్టడం సరైంది. చాలా మంది మహిళలు పనిలో పడి కుటుంబాన్ని విస్మరిస్తున్నామని బాధపడుతుంటారు. కానీ అది సరైనది కాదు. మీ కెరీర్‌ను మీరు మాత్రమే అభివృద్ధి చేసుకోగలరు. కుటుంబాన్ని చూసుకోవడానికి మీ జీవిత భాగస్వామి కూడా ఉంటారు. కాబట్టి నా అనుభవంలో నేను 'పని-జీవిత ఏకీకరణ', 'పని-జీవిత సమతుల్యత' ముఖ్యమైనది కాదు అని తెలుసుకున్నాను. నా వ్యక్తిగత బాధ్యతలు కుటుంబ సభ్యులకు కూడా పంచుతాను" అంటున్నారు కల్పన.

రెండింటిలోనూ రాణించాలని

"మహిళ అనే కారణం చూపి మేము ఎప్పుడూ పనికి విరామం ఇవ్వము" అని కల్పన చెప్పారు. "మేము ఎల్లప్పుడూ 'హోమ్' అని పిలువబడే ఒక ట్రెడ్‌మిల్‌పై ఉంటాము. ఆపై మేము 'వర్క్' అని పిలువబడే మరొక ట్రెడ్‌మిల్‌పైకి వెళ్లాలనుకుంటున్నాము. రెండింటిలోనూ రాణించాలనుకుంటున్నాం. అప్పుడే నేను వ్యక్తిగత లక్ష్యాల విలువను తెలుసుకున్నాను మా నాన్నలాగే ఏదో ఒక రోజు నా సొంత సంస్థను నడపాలనేది నా లక్ష్యం" అని కల్పన చెప్పారు.

సరిగా ఆలోచిస్తే...

మహిళల పట్ల స్పృహ, లింగ వివక్షను గుర్తించడం, దాన్ని అంగీకరించడం, దాన్ని ఎదుర్కోవడం చాలా అవసరమని ఆమె గుర్తు చేస్తున్నారు. "మనలో ప్రతి ఒక్కరం లింగ వివక్షను ఎదుర్కొని ఉంటాయి. కానీ దాన్ని గుర్తించడంలోనే వెనకడిపోతున్నాము. మొదటిసారిగా వ్యక్తులను కలిసినప్పుడు మనం వారి గురించి త్వరగా అంచనాలు వేస్తాము. కానీ మనం కాస్త వెనక్కు పోయి ఆలోచిస్తే వివక్షను ఎదుర్కొగలము" ఆమె అంటున్నారు.

విభిన్న నేపథ్యాలు

కల్పన ప్రకారం వ్యాపారంలో పక్షపాతంతో వ్యవహరించడానికి వైవిధ్యాన్ని కలుపుకోవడం అవసరం. మహిళా నాయకులకు సలహా ఇస్తూ, ఆమె ఇలా అంటున్నారు "మీరు పని చేస్తున్న జట్టులో విభిన్న నేపథ్యాలు, మనస్తత్వాలు కలిగిన వ్యక్తులు ఉంటారని నిర్ధారించుకోండి. అందులో పురుషులు కూడా ఉంటారు. అందుకే కేవలం వైవిధ్యంపై మాత్రమే దృష్టి పెట్టవద్దు. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు మీరు ఈ విభిన్న జనాభాను చేర్చుకుంటున్నారని నిర్ధారించుకోండి."

ఇట్ల చేద్దాం



ఒక అరటిపండును గుజ్జులా చేసి దీనికి మూడు చెంచాల తాజా మీగడను కలిపి ముఖానికి రాయాలి. 20 నిమిషాల తర్వాత మృదువైన గుడ్డతో తుడవాలి. ఆ తర్వాత నీటితో కడిగితే చర్మం మాయిశ్చరైజ్ అవుతుంది. పోషకాలు అంది ముఖచర్మం మృదువుగా మారుతుంది.

బరువు తగ్గాలంటే వీటిని కలిపి తినొద్దు

ఈ రోజుల్లో చాలామంది వయసుతో సంబంధం లేకుండా ఎదుర్కొంటున్న సమస్య అధిక బరువు. పలు ఆరోగ్య సమస్యలతో పాటు కొవ్వు అధికంగా ఉండే పదార్థాలను తీసుకోవడం వల్ల ఈ సమస్య వస్తోందని నిపుణులు అంటున్నారు. అయితే చాలామంది ఈ సమస్యను దూరం చేసుకోవడానికి జంక్‌ఫుడ్‌కి దూరంగా ఉంటూ పలు రకాల వ్యాయామాలు చేస్తుంటారు. అయితే కొన్ని రకాల పదార్థాలు ఆరోగ్యకరమైనవే అయినప్పటికీ వాటిని ఇతర పదార్థాలతో కలిపి తీసుకోవడం వల్ల బరువు పెరగటంతో పాటు, వివిధ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి ఏయే పదార్థాలు కలిపి తీసుకోకూడదో తెలుసుకుందాం...



- ఆలుగడ్డల్లో స్టార్చ్ అధికంగా ఉంటుంది. వీటిని అన్నంతో కలిపి తీసుకున్నప్పుడు బరువు పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. అందుకే బరువు తగ్గాలనుకునే వారు ఈ రెండిటినీ కలిపి తీసుకోకుండా ఉండాలంటున్నారు. అయితే వీటిని విడివిడిగా తక్కువ మోతాదులో తీసుకున్నప్పుడు మాత్రం ఆరోగ్యానికి ఎలాంటి హానీ కలగదని చెబుతున్నారు.
- పాలు, అరటిపండ్లలో ఎన్నో పోషకాలు ఉంటాయి. అలాగే వీటి ధర కూడా అందుబాటులో ఉంటుంది. అందుకే చాలామంది తమ రోజువారీ ఆహారంలో వీటిని భాగం చేసుకుంటుంటారు. వీటివల్ల పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ వీటిని కలిపి తీసుకోకూడదంటున్నారు నిపుణులు. పాలు, అరటిపండ్లను కలిపి తీసుకోవడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉందంటున్నారు. కాబట్టి బరువు తగ్గాలనుకునేవారు ఈ కాంబినేషన్‌కు దూరంగా ఉండడం మంచిదని సూచిస్తున్నారు.
- బరువు తగ్గాలనుకునేవారిలో చాలామంది ఓట్స్‌ని క్రమం తప్పకుండా తీసుకుంటుంటారు. ఇందులో చక్కెర స్థాయులు తక్కువగా ఉండడమే అందుకు కారణం. అయితే కొంతమంది ప్రొటీన్స్ కోసం ఓట్స్‌కు డ్రైఫ్రూట్స్ కలిపి తీసుకుంటారు. దీనివల్ల బరువు తగ్గడం అటుంచితే, బరువు పెరిగే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి ఈ కాంబినేషన్‌కు దూరంగా ఉండడం మేలంటున్నారు.
- సాయంత్రం కాగానే ఏదో ఒక స్నాక్ తిని టీ లేదా కాఫీ తాగాలనుకునేవారు చాలామంది ఉంటారు. టీ, కాఫీలు అలవాటు లేని వారిలో కొంతమంది కార్బొనేటెడ్ డ్రింక్స్‌ని తాగుతుంటారు. అయితే ఈ కాంబినేషన్ కూడా ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. దీనివల్ల అధిక బరువు సమస్య మాత్రమే కాకుండా ఎసిడిటీ సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందంటున్నారు.

ఈ పద్ధతి పాటించండి

పిల్లల పెంపకమూ ఒక కళే... సంతోషకరమైన బాల్యం బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. క్రమశిక్షణ తోడైతే జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలబెడుతుంది. అయితే మాంటిస్సోరీ విధానాన్నీ ప్రయత్నంచేయమంటున్నారు నిపుణులు. పిల్లలను కొత్త విషయాలను అన్వేషిస్తూ నేర్చుకునేలా ప్రోత్సహించడమే ఈ పద్ధతి ప్రత్యేకత. ఇంతకీ ఇదేంటో తెలుసుకుందాం...

- పిల్లలన్నాక తప్పులు చేయడం సహజమే! నేర్చుకునేప్పుడు ఇంకా ఎక్కువగా దొర్లుతాయి. అంతమాత్రాన వాళ్లను శిక్షించొద్దు. తప్పులు చేయటానికి, తద్వారా నేర్చుకోవడానికి వారికి అవకాశమివ్వాలి. పిల్లలు ఎవరికి వారే ప్రత్యేకం. వాళ్ల ఎదుగుదలలో అవసరమైన సాయం అందించడమే మన బాధ్యత.
- పిల్లలు.. వాళ్లకి గౌరవమేంటి' అనుకోవద్దు. వాళ్లనీ గౌరవించాలి. ఉదాహరణకు వాళ్లకి సంబంధించిన కొన్ని విషయాల్లో నిర్ణయాలు తీసుకుంటే కోప్పడొద్దు. చేయనివ్వండి. ఇక్కడ మనం అనుసరించాల్సిందల్లా ఇతరులకు ఇబ్బంది కలగనివ్వక పోతే చాలన్న సూత్రమే. కాబట్టి కనీసం చిన్న చిన్న అంశాల్లోనైనా ఆ సౌలభ్యాన్ని వాళ్లకి ఇవ్వండి.
- బాల్యంలో పిల్లల మెదడు వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఆ సమయంలో వాళ్లు ఎదుర్కొన్న పరిస్థితులు, అనుభవాలు వారి వ్యక్తిత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయి. పిల్లలు నేర్చుకునేదేమో మనల్ని. అంటే తల్లిదండ్రులను చూసే. కాబట్టి వాళ్ల ఎదుట మీ ప్రవర్తన ఎలా ఉందో గమనించుకుంటూ ఉండాలి.



- పిల్లలు తప్పుచేసినప్పుడు దండించేస్తాం. బదులుగా సమస్య పరిష్కార మార్గాలు అన్వేషించేలా ప్రోత్సహించండి. స్వేచ్ఛగా ఆలోచించినప్పుడే తప్పొప్పులు గ్రహించగలుగుతారు. గుడ్డిగా ఎవరినీ అనుసరించరు.
- పిల్లల మనసు మరీ సుకుమారం. పరిస్థితులకు వెంటనే ప్రతిస్పందిస్తారు. అలాంటి సమయాల్లోనే మనం వారికి స్థితప్రజ్ఞతను అలవరచుకునేలా చేయాలి. భావోద్వేగాలు నియంత్రించుకునే నైపుణ్యాలు పెంపొందించాలి. అందుకు అవసరమైన సానుకూల వాతావరణాన్ని మనమే కల్పించాలి.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ధర్నా చేశారు. హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ.. ఈనెల 7న చలో ఇందిరాపార్కు కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేటు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షులు పున్నం రవి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తెలంగాణలోని రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏవో నారాయణకు వినతిపత్రం అందజేశారు.

9న బ్లాక్ డే

(మొదటిపేజీ తరువాయి)

చిన్న ఉత్పత్తిదారులపై దాడి చేసిందని అన్నారు. ఉపాధి హామీ, ఆహార సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, బీమా, నీటిపారుదల, వ్యవసాయం, కార్మికులు, అన్ని ఇతర సామాజిక రంగాలకు కేటాయింపుల్లో భారీగా కోతలు పెట్టటం దారుణమన్నారు. 2023 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న తన వాగ్దానాన్ని ప్రధాని మోడీ విస్మరించారని చెప్పారు. దేశంలోని 81 కోట్ల మంది ప్రజలకు బియ్యం, గోధుమలను వరుసగా రూ. 2, రూ. 3 చొప్పున సబ్సిడీ నిరాకరించారని తెలిపారు. ఎంఎస్పీ చట్టబద్ధతతో సేకరణ వ్యవస్థ, పేద, మధ్యతరగతి రైతాంగం, వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణమాఫీ కోసం బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు లేవని విమర్శించారు. ఉపాధి హామీ కింద రోజుకు రూ.600 కనీస వేతనంతో 200 పనిదినాలు కల్పించాలనే డిమాండ్ తిరస్కరించబడిందని అన్నారు.

నరేంద్ర మోడీ ఎనిమిదేండ్ల పాలనలో ప్రపంచ పేదరిక సూచీలో భారతదేశం స్థానం 55వ ర్యాంక్ నుంచి 107వ ర్యాంక్‌కు దిగజారిందని విమర్శించారు. నయా ఉదారవాద విధానాలు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాలలో మాంద్యాన్ని పెంచాయని, 2023లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత మందగించనుందని ఐఎంఎఫ్ తెలిపిందని అన్నారు. దేశ ప్రజలపై ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యవస్థాగత సంక్షోభ ప్రభావాన్ని కేంద్ర బడ్జెట్ ప్రస్తావించ లేదనీ, దేశ ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. బీజేపీ నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం ధనవంతులపై పన్ను విధించడానికి ఇష్టపడటం లేదనీ, బదులుగా రైతులకు కనీస మద్దతు ధరను, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలను నిరాకరించడంతో పేదరికం, శ్రామికవర్గీకరణ క్రూరమైన ప్రక్రియను సులభతరం చేస్తుందని అన్నారు. ఆ విధంగా ప్రధానమంత్రి ప్రకటించుకుంటున్న డబుల్ ఇంజన్ ప్రభుత్వం ద్వంద్వ భారతదేశాన్ని సృష్టించిందని ఆరోపించారు.

టెన్త్ ఫీజు గడువు 15 వరకు పొడిగింపు

- **ఆలస్య రుసుం రూ.వెయ్యితో చెల్లించే అవకాశం**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాది ఏప్రిల్ మూడు నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం తత్కాల్ స్కీం కింద అవకాశం కల్పించింది. ఈ గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం రూ.వెయ్యితో ఈనెల 15వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. ఇతర సమాచారం కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

పేదలందరికీ ఇండ్లస్థలాలివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానంపై ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపడుతున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. భాషాపండితులు, పీఈటీలకు పదోన్నతులివ్వాలనీ, తద్వారా ఆ సమస్యకు ముగింపు పలకాలని సూచించారు. మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. కేజీబీవీ సిబ్బందికి స్థానచలనం కల్పించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. మల్లిఖార్జున్ అనే టీచర్‌పై మతోన్మాద మూకలు దాడిచేయడాన్ని ఖండించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో స్వేచ్ఛగా బోధించే వాతావరణం కల్పించాలని కోరారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ భార్యాభర్తలను ఒకే జిల్లాకు పంపారని చెప్పారు. అదే విధంగా ఎస్జీటీలనూ బదిలీ చేయాలని సూచించారు. దేశంలో, రాష్ట్రంలో సంపద ఒకేచోట కేంద్రీకృతమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లో టీచర్లకు రూ.26 వేలు చెల్లిస్తున్నారనీ, అదే పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులకు మాత్రం రూ.80 వేలకుపైగా వేతనం వస్తున్నదని వివరించారు. అందువల్ల కేజీబీవీ టీచర్లకు మినిమం బేసిక్ పే చెల్లించాలని కోరారు. కొత్త పరిశ్రమలొస్తున్నాయనీ, వాటి ద్వారా పెట్టుబడులు కూడా వస్తున్నాయంటూ ఆ శాఖ మంత్రి ప్రకటిస్తున్నారనీ, అదేతరహాలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంపై సంబంధిత శాఖ మంత్రి దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో 76 షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాల జీవోను విడుదల చేయాలని చెప్పారు. ఐదు పరిశ్రమలకు సంబంధించిన జీవో జారీ చేసినా గెజిట్ కానందున అమలు కావడం లేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)ను అభివృద్ధి చేస్తేనే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని వివరించారు. బస్తీ దవాఖానాలు అభినందనీయమేనని అన్నారు. ముగ్గురు డాక్టర్లు, ఆరుగురు నర్సులతో 24 గంటలూ పనిచేసేలా పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలను పటిష్టపర్చాలని సూచించారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. శ్రీశైలం సొరంగమార్గం పనులను పూర్తి చేయాలని కోరారు. గురుకులాలు, కేజీబీవీల్లో కేర్‌టేకర్లను నియమించాలని కోరారు. సేద్యం చేయని భూములకు రైతుబంధు ఇవ్వొద్దని అన్నారు. కౌలురైతులకు ఆ పథకాన్ని వర్తింపచేయాలని సూచించారు. మన ఊరు మనబడి పథకం ద్వారా మొదటి విడతలో 9,123 బడులను రూ.3,497 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు 1,210 స్కూళ్ల పనులే పూర్తయ్యాయని వివరించారు. మిగతా బడుల్లో పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్త బస్తీలు, కాలనీల్లో సర్కారు బడులు, కాలేజీలను ప్రారంభించాలని కోరారు.

మానవాభివృద్ధిలో కేరళ నెంబర్‌వన్

మానవాభివృద్ధి సూచికల్లో కేరళ నెంబర్‌వన్ స్థానంలో ఉందని నర్సిరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఆ సూచికల్లో తెలంగాణ ఏ స్థానంలో ఉందో చెప్పాలని మంత్రి కేటీఆర్‌ను కోరారు. అక్కడ గ్రామీణ కార్మికుల రోజు వేతనం రూ.800గా ఉందన్నారు. ఇక్కడ రూ.400, రూ.500, రూ.600 మాత్రమే కూలి వస్తున్నదని అన్నారు. అక్షరాస్యతలో ఆ రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో దేశంలోనే తెలంగాణ రెండోస్థానంలో ఉందని వివరించారు.

కమ్యూనిస్టు ప్రభుత్వం ఏమీ చేయలేదని చెప్పడం లేదు : కేటీఆర్

నర్సిరెడ్డి లేవనెత్తిన అంశంపై మంత్రి కేటీఆర్ స్పందిస్తూ కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం అభివృద్ధి ఏమీ చేయలేదంటూ తాను చెప్పడం లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. విద్యారంగంలో మార్పునకు నాంది ప్రారంభమైందని చెప్పారు. మన ఊరు మనబడి పథకం ద్వారా 680 పాఠశాలల్లో పనులు పూర్తిచేసి ప్రారంభించామన్నారు. రూ.7,300 కోట్లతో 26,085 సర్కారు బడుల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నామని అన్నారు. మానవాభివృద్ధిలో తెలంగాణ టాప్‌లోనే ఉంటుందన్నారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని శాసనమండలి ఆమోదించినట్టు ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. సభను సోమవారం ఉదయం 10.30 గంటలకు వాయిదా వేస్తున్నామని చెప్పారు.

అక్బర్ వర్సెస్ కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

వారిరువురి మధ్య ఇలా వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. చివరకు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కూడా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత సభా వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కలుగజేసుకుని శాంతపరిచేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ అక్బరుద్దీన్ తగ్గకుండా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మెచ్చుకుంటూనే...పాతబస్తీలోని సమస్యలను ఏకరువు పెట్టారు. అధికార బీఆర్ఎస్ వైఫల్యాలను ఎత్తి చూపారు. గవర్నర్ ప్రసంగం గతంలో 42 పేజీలుగా ఉండేదనీ, ఇప్పుడు 27 పేజీలకు పడిపోయిందని తెలిపారు. ఎనిమిదేండ్ల కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదా? సీఎం కేసీఆర్ బయట అనేక విషయాలు మాట్లాడుతారు, కానీ గవర్నర్ ప్రసంగంలో వాటిని ఎందుకు పొందుపరచలేకపోయారని నిలదీశారు. బీజేపీకి బీఆర్ఎస్‌కు ఏమైనా ఒప్పందం ఉందా? అని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే చేశారా? లేదంటే గవర్నర్ కొన్ని అంశాలను తప్పించారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఏసీ సమావేశానికి సీఎం హాజరు కాకపోవటం శోచనీయమన్నారు. ఆయనతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు చర్చల సమయంలో సభలో కనిపించకపోవడాన్ని తప్పుపట్టారు. ఇలాంటి సభను తన 25 ఏండ్లలో ఏనాడూ చూడలేదని తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు టీవీ డిబేట్‌లకు వెళ్లే సమయం ఉంటుంది కానీ సభకు వచ్చే సమయం లేదా? అని ఎద్దేవా చేశారు. 'హామీలు ఇస్తారు.. అమలు చేయరు. సీఎం, మంత్రులు మమ్మల్ని కలవరు. మీరు చెప్రాసిని చూపిస్తే వారినైనా కలుస్తాం. పాతబస్తీలో మెట్రోరైలు సంగతి ఏమిటి? ఉస్మానియా ఆస్పత్రిని ఎప్పుడు నిర్మిస్తారు ? ఉర్దూ రెండో భాషగా ప్రకటించారు.

కానీ అమలు చేయడం లేదు...' అని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ తీర్మానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందా? కేంద్రంలోని బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసినట్టు గుర్తించిందా? లేదా? చెప్పాలన్నారు. దేశంలో 171 మెడికల్ కళాశాలలు, 157 నర్సింగ్ కళాశాలలను ఇస్తే, తెలంగాణకు ఒక్కటీ కూడా ఇవ్వలేదనీ, దాన్ని గవర్నర్ ప్రసంగంలో ఎందుకు చెప్పలేదని నిలదీశారు. తెలంగాణపై కేంద్రం సవతితల్లి ప్రేమ చూపిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఏ పథకానికి కేంద్రం నిధులు ఇవ్వలేదన్నారు. మక్కా మసీదుకు మరమ్మతులు, చార్మినార్ వద్ద అభివృద్ధి పనులు, ఇస్లామిక్ స్టడీ సెంటర్, ఇమామ్‌లకు వేతనాలు, పాతబస్తీలో స్టేడియం నిర్మాణం వంటి కార్యక్రమాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కేటీఆర్ కౌంటర్...

ఎంఐఎం నేత అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. స్లీపింగ్ రిమార్క్స్ చేయొద్దంటూ (వాస్తవాలు తెలుసుకోకుండా) హితవు పలికారు. బీఏసీకి సభా నాయకుడు రాకపోయినా, నలుగురు మంత్రులు హాజరయ్యారని గుర్తు చేశారు. ఏడుగురు సభ్యులున్న ఎంఐఎంకు గంటసేపు మాట్లాడేందుకు అవకాశమిచ్చారనీ, 105 మంది సభ్యులున్న బీఆర్ఎస్ ఎంత సమయం తీసుకోవాలంటూ స్పీకర్‌ను ప్రశ్నించారు. ఈ అంశంపై జోక్యం చేసుకోవాలని స్పీకర్‌ను కోరారు. అక్బరుద్దీన్ గవర్నర్ ప్రసంగంపై మాట్లాడకుండా బడ్జెట్ పద్దులపై కూడా మాట్లాడుతున్నారంటూ ఎద్దేవా చేశారు.

ఆమెకేది రక్షణ!

(మొదటిపేజీ తరువాయి)

2022లో 1,048 ఫిర్యాదులు అందాయి. నిజానికి మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకొచ్చింది. గృహ హింస, లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు సహా పోక్సో యాక్ట్ వంటి చట్టాలను ప్రయోగిస్తోంది. పోక్సోయాక్ట్ 18 ఏండ్లలోపు బాలికలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది. పోక్సో కేసు నమోదైతే శిక్షలు కఠినంగా ఉంటాయి. కేసు విచారణ కూడా మూడు నెలల్లో పూర్తవుతుంది. అయినా మహిళలపై అఘాయిత్యాలు తగ్గకపోగా యేటా మరింతా పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

మధ్యదళారీలు, కొనుగోలుదారులపై ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం, సీసీఐ జోక్యం చేసుకుని తక్కువ ధరకు కొనుగోలు చేసే దళారీల ఆట కట్టించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో 60 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి అయినట్టు ప్రభుత్వం అంచనా వేసిందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దాని ధర క్వింటాల్‌కు రూ.12 వేల వరకు ఉండగా, కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను రూ.6,600లుగా నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎకరాకు రూ.50 వేల వరకు రైతు ఖర్చు చేస్తుండడంతో రూ.15 వేలు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యదళారీలు, మార్కెట్ వ్యవస్థలు కుమ్మక్కై ధరలు తగ్గించి కొనుగోలు చేయడం వల్ల రైతులు ఆందోళనకు గురౌతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్ ధరతో సమానంగా సీసీఐతో కొనుగోళ్లను ప్రారంభించాలని సూచించారు. రైతులను మోసం చేస్తున్న దళారీలు, కార్పొరేట్ సంస్థలను అరికట్టాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా పత్తి కొనుగోలు చేసి, మద్దతుధర వచ్చే విధంగా తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజనం కార్మికుల గౌరవ వేతనం రూ.3 వేలకు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

రూ.మూడు వేలకు పెంచుతామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 54,201 మంది వంట కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ హర్షం

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే కార్మికుల గౌరవ వేతనాన్ని రూ.మూడు వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేతన పెంపు కోసం తమ సంఘం అనేక పోరాటాలను చేసిందని గుర్తు చేశారు. ఇది ముమ్మాటికీ సుదీర్ఘ పోరాటాల వల్ల దక్కిన విజయమేనని తెలిపారు. గతేడాది మార్చి 15న సీఎం చేసిన ప్రకటన ఆధారంగా అప్పటి నుంచి బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 8 విడుదలను స్వాగతిస్తూ ఈనెల ఆరు, ఏడు, ఎనిమిది తేదీల్లో మండల కేంద్రాల్లో, 12న జిల్లా కేంద్రాల్లో విజయోత్సవ సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల హక్కుల కోసం పోరాట కార్యాచరణను తీసుకుని ముందుకు సాగుతామని తెలిపారు.

మూగబోయిన సుమధురవాణి

(మొదటిపేజీ తరువాయి)

సాయంతో గది తలుపులు బద్దలు కొట్టించింది. లోపలికి వెళ్లి చూడగా అప్పటికే వాణీ జయరాం స్పృహ లేకుండా కింద పడిపోయి ఉన్నారు. ఆమె ముఖంపై ఎవరో కొట్టినట్టుగా తీవ్ర గాయాలున్నాయి. వెంటనే పనిమనిషి, స్థానికులు కలిసి ఆమెను ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. పనిమనిషి, స్థానికుల నుంచి వివరాలు సేకరించిన పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆమె ఫ్లాట్‌ను ఆధీనంలోకి తీసుకుని అన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. ఫ్లాట్‌లోని సీసీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

నవతెలంగాణ

ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వండి

- గృహనిర్మాణ శాఖ మంత్రికి తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక వినతి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని పేదలకు ఇండ్లు, ఇండ్లస్థలాలు, డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వేదిక ప్రతినిధులు రాష్ట్ర కమిటీ తరఫున శనివారం మంత్రికి వినతిపత్రం సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో శాసనమండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి, తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య, పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ నరసింహారావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ ఉన్నారు. ఇండ్ల స్థలాల కోసం 22 జిల్లాల్లో గుడిసెలు వేసుకొని పేదలు గత 6 నెలలుగా శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలనీ, ఇండ్ల నిర్మాణం చేపట్టాలనీ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి వాటిని ఇవ్వాలనీ కోరారు. సొంత స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలనీ, స్థలమే లేని పేదలకు 120 గజాల స్థలం కేటాయించి రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకోసం శుక్రవారం (ఫిబ్రవరి 3) అన్ని మున్సిపల్ పట్టణాల్లో ధర్నాలు జరిగాయనీ, ఈనెల 9న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నామని వివరించారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఎమ్మెల్సీ నివాసంలో ఐదో రోజూ కొనసాగిన ఐటీ సోదాలు

- ముప్పా, వర్టెక్స్ బిల్డర్స్ పైనా సాగిన సోదాలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

భారీ ఎత్తున పన్ను ఎగవేతకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి నివాసంలో శనివారం ఐదో రోజూ ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలను నిర్వహించారు. దీంతోపాటు ముప్ప, వర్టెక్స్ బిల్డర్స్ ప్రధాన కార్యాలయాలలోను ఐదవ రోజు సోదాలు కొనసాగాయి. గత మంగళవారం నుంచి ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాదాపు యాభై మందికి పైగా ఈ సోదాలను నిర్వహిస్తున్నారు.

నేర విచారణలో ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడొద్దు : డీజీపీ

రాష్ట్రంలో నేర పరిశోధనలో చట్ట ప్రకారం వ్యవహరించాలనీ, ఎక్కడా లోపాలు లేకుండా చూసుకోవాలని అన్ని జిల్లాల ఎస్పీలు, ఐజీలను రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. ముఖ్యంగా నేర విచారణకు సంబంధించిన వర్టికల్స్‌ను ఖచ్చితంగా పాటించాలని ఆయన కోరారు. శనివారం ఆయన అన్ని జిల్లాల ఏస్పీలు, రేంజ్ డీఐజీలు, జోన్‌ల ఐజీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

జాతీయ ఎస్సీ కమిషన్ ఉత్తర్వులు నిలుపుదల

- హైకోర్టు ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో, టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ విద్యుత్ సంస్థల్లో 2009 నుంచి నేరుగా నియమించబడిన ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన చెయ్యాలని 2001లో ట్రాన్స్‌కో 954ను జారీ చేసింది. ఆ ఉత్తర్వులను నిలిపివేయాలని విద్యుత్ సంస్థల్లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ ఎస్సీ కమీషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషన్ గతేడాది నవంబర్ 29న విచారణ జరిపి, విద్యుత్ సంస్థల్లోని జీవో నంబర్లు 954, 62, 101, 37లపై యథాతథస్థితి విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల వల్ల విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న బీసీ, ఓసి ఉద్యోగులకు అన్యాయం జరుగుతున్నదని బీసీ, ఓసి ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి సంయుక్తంగా హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. దానిలో జాతీయ ఎస్సీ కమీషన్ ఉత్తర్వులను సవాల్ చేశారు. సమితి తరపు అడ్వకేట్ సుంకర చంద్రయ్య వాదనలతో ఏకీభవించిన హైకోర్టు విచారణ అనంతరం, జాతీయ ఎస్సీ కమీషన్ జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చినట్టు సమితి ప్రతినిధులు శనివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. గతంలో సుప్రీంకోర్టు చెప్పిన విధంగా ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల సర్వీసు అంశాలపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్లకు విచారించి ఉత్తర్వులు జారీ చేసే అధికారం లేదని చెప్పిన అంశాన్ని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు సమితి తెలిపింది.

ఆర్టీసీలో మళ్లీ జీతాల కోసం ఎదురుచూపులు

- బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయించాలి : టీజేఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి కే హన్మంతు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీ వేతనాలు ఇస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ చాలాసార్లు చెప్పారనీ, కానీ ఇప్పుడు మళ్లీ పరిస్థితి మొదటికే వచ్చిందని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎమ్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే హన్మంతు ముదిరాజ్ విమర్శించారు. ఉద్యోగులు మళ్లీ వేతనాల గురించి ఎదురు చూసే పరిస్థితి రావడం చాలా హేయమైనదనీ, ఇప్పటికే చాలీచాలని వేతనాలతో డ్యూటీలు చేస్తూ కార్మికులు కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కండక్టర్, డ్రైవర్లకు వేతనాలు ఇచ్చి, మిగతా మెయింటెనెన్స్ సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఆఫీసు సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఇప్పటికే సంస్థలో రెండు వేతన సవరణలు మొదలు కార్మికులకు అనేక బకాయిలు రావల్సి ఉన్నాయన్నారు. చట్ట వ్యతిరేక డ్యూటీలను వేస్తూ ఆర్టీసీ సిబ్బందిని నానా రకాలుగా వేధిస్తూ, జీతాలు కూడా సమయానికి ఇవ్వకపోతే ఎలాగని ప్రశ్నించారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి రూ.6వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత బడ్జెట్‌లో పెట్టిన రూ. 1,500 వందల కోట్లలో కేవలం రూ. 500 కోట్లు మాత్రమే ఇచ్చారనీ, ఫలితంగా ఆర్టీసీ పరిస్థితి ఆర్థికంగా దిగజారుతున్నదని చెప్పారు.

వాణీ జయరాం మృతికి సీఎం సంతాపం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రముఖ సినీ నేపథ్య గాయని, పద్మభూషణ్ వాణీ జయరామ్ మరణం పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు విచారం వ్యక్తం చేశారు. 14 భాషల్లో 20 వేలకు పైగా పాటలు పాడిన వాణీ జయరాం సినీ రంగానికి అందించిన సేవలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆమె మరణం భారత సినీ పరిశ్రమకు, సంగీత ప్రపంచానికి తీరని లోటు అని అన్నారు. వాణీ జయరాం కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నైకా నుంచి 'జెంటిల్‌మెన్స్ క్రూ' ఉత్పత్తులు

న్యూఢిల్లీ : మహిళలకు సంబంధించిన ప్రీమియం కాస్మోటిక్స్ ఉత్పత్తుల్లో గుర్తింపు పొందిన నైకా కొత్తగా జెంటిల్‌మెన్స్ క్రూ బ్రాండ్‌తో పురుషుల ఉత్పత్తుల్లోకి ప్రవేశించినట్టు తెలిపింది. పురుషుల కోసం విస్తృత శ్రేణీలో ప్రతి రోజూ అవసరమైన డియోడరెంట్లు, బియర్డ్ కేర్, హెయిర్‌స్టైలింగ్ శ్రేణితో విడుదల చేసినట్టు పేర్కొంది. 48 గంటల పాటు యాక్టివ్‌గా ఉండే మూడు అహ్లాదకరమైన డియోడరెంట్స్‌ను ఆవిష్కరించినట్టు తెలిపింది.

ఎస్‌బీఐ లైఫ్ కొత్త క్యాంపెయిన్

హైదరాబాద్ : ప్రయివేటు బీమా కంపెనీ ఎస్‌బీఐ లైఫ్ 'కలలు కంటే నిజం చేసుకోండి' పేరుతో కొత్త ప్రచార క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్నట్టు తెలిపింది. ప్రతీ ఒక్కరూ తమ కలలను నెరవేర్చుకునే ప్రాముఖ్యతను ఇది నొక్కి చెబుతుందని ఆ సంస్థ పేర్కొంది. "ఎస్‌బీఐ లైఫ్ ఎల్లప్పుడూ వినియోగదారుల మారుతున్న అవసరాలను అర్థం చేసుకోవడానికి చాలా ఆసక్తితో ఉంటుంది. కొత్త క్యాంపెయిన్ వినియోగదారులకు ప్రేరణను ఇస్తోంది." అని ఎస్‌బీఐ లైఫ్ కార్పొరేట్ కమ్యూనికేషన్, సీఎస్ఆర్ బ్రాండ్ చీఫ్ రవీంద్ర శర్మ పేర్కొన్నారు.

భాషాపండితులకు న్యాయం చేస్తాం

పండిత, పీఈటీ జేఏసీ నేతలకు ఎమ్మెల్సీ కవిత హామీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషాపండితులకు న్యాయం చేస్తామంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లో కవితను పండిత, పీఈటీ జేఏసీ రాష్ట్ర నాయకులు సి జగదీష్, రాఘవరెడ్డి, నర్సింలు, గౌరీ శంకర్, కృష్ణమూర్తి కలిసి వినతిపత్రం సమర్పించారు. భాషా పండితులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వకేట్ జనరల్ హాజరై అప్‌గ్రేడ్ జీవోలపై కోర్టులో ఉన్న స్టేను వెంటనే తొలగించేలా ప్రయత్నించాలని సూచించారు. అది సాధ్యం కాని పక్షంలో అసెంబ్లీ సమావేశాల్లో ఆర్డినెన్స్ తీసుకొచ్చి భాషా పండితులు, పీఈటీల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ మేరకు తమకు మేలు చేయాలని సూచించారు. అందుకనుగుణంగా సర్వీస్ రూల్స్‌ను మార్చి కూడా జీవోలిచ్చారని తెలిపారు.

10,479 పండితులు, పీఈటీల పోస్టులను అప్‌గ్రేడ్ చేశారని పేర్కొన్నారు. కోర్టులో ఉన్న న్యాయపరమైన చిక్కులను తొలగించడానికి ప్రభుత్వం తరఫున తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, తప్పనిసరిగా న్యాయం జరిగేలా చూస్తానని కవిత హామీ ఇచ్చారని తెలిపారు. పండితులకు పదోన్నతులు రావడానికి తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీటీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కె ఇశ్రాయేలు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి నర్సింగరావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మహావీర్ సింగ్, ప్రధాన కార్యదర్శి గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయాల ఎదుట ఆందోళనలు విరమించుకోండి

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకి ఎల్ఐసీ ఉద్యోగ సంఘాల జాయింట్ ఫ్రంట్ లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హిండన్‌బర్గ్ నివేదికలో పేర్కొన్నట్టు అదానీ గ్రూపులో పెట్టుబడులు పెట్టినందువల్ల ఎల్ఐసీ సంస్థకు నష్టాలు వచ్చాయనే ప్రచారంలో వాస్తవం లేదని ఎల్ఐసీ ఉద్యోగ సంఘాల జాయింట్ ఫ్రంట్ స్పష్టం చేసింది. దీనిపై కాంగ్రెస్‌పార్టీ ఈనెల 6వ తేదీ దేశవ్యాప్తంగా అన్ని ఎల్ఐసీ కార్యాయాల ఎదుట నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని అనుకుంటున్నట్టు తెలిసిందనీ, దీన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ క్లాస్ 1 ఆఫీసర్స్ అసోసియేషన్స్ ప్రధాన కార్యదర్శి ఎస్ రాజ్‌కుమార్, ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యూ సెక్రటరీ జనరల్ వివేక్‌సింగ్, ఏఐఐఈఏ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా, ఏఐఎల్ఐసీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి రాజేష్‌కుమార్ శనివారంనాడొక సంయుక్త పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు, ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగే రీతిలో దేశంలోని ఏ పారిశ్రామిక గ్రూపునకు రాజకీయ దన్ను అందినా దాన్ని తాము వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. హిండన్ బర్గ్ నివేదికలోని వాస్తవాలను బయట పెట్టడానికి, ప్రభుత్వం నిష్పాక్షిక విచారణకు ఆదేశించాలని తాము కోరుతున్నామన్నారు. ఎల్ఐసీ దీర్ఘకాలిక ఇన్వెస్టర్ అనీ, పాలసీదారుల దీర్ఘకాలిక ప్రయోజనాలను దష్టిలో పెట్టుకొని మాత్రమే పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. దీనికోసం సంస్థలో ప్రత్యేకంగా ఇక పెట్టుబడుల బోర్డు ఉన్నదనీ, దాని విధానాల ప్రకారం, 80 శాతం పెట్టుబడులను ప్రభుత్వ సెక్యూరిటీల్లో, బాండ్లలోనూ పెట్టి, మిగిలిన 20 శాతం మాత్రమే షేర్లలో పెడుతుందని స్పష్టంచేశారు. దీనివల్ల ఎల్ఐసీ పాలసీదారుల పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని తెలిపారు. అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టడం వల్ల ఎల్ఐసీకి నష్టం వచ్చిందనే ప్రచారం పూర్తిగా ఊహాత్మకమైనదని చెప్పారు. నష్టాలు రావడానికి అదానీ సంస్థల్లోని తన షేర్లను ఎల్ఐసీ అమ్మలేదని వివరణ ఇచ్చారు. దీనిపై ఎల్ఐసీ జనవరి 31న ఇచ్చిన పత్రికా ప్రకటనలో అదానీ గ్రూప్ సంస్థల్లో తాము రూ.36,474.78 కోట్ల పెట్టుబడులు పెట్టామనీ, వాటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.56,142 కోట్లని ప్రకటించింది. ఆ రకంగా ఎల్ఐసీ రూ. 20వేల కోట్ల ఊహాత్మక లాభాలను సంపాదించిందని వివరించారు. ఊహాత్మక నష్టాల మాదిరే, ఊహాత్మక లాభాలను కూడా ఎల్ఐసీ సాధించిందన్నారు. అదానీ గ్రూపులో పెట్టిన పెట్టుబడులు కేవలం 7 శాతమేననీ, ఆ గ్రూపు సంస్థల మొత్తం క్యాపిటలైజేషన్ విలువలో ఎల్ఐసీ వాటా 3.91 శాతమేనని తెలిపారు. టాటా సంస్థల్లో ఎల్ఐసీ వాటా 3.98, రిలయన్స్ గ్రూప్ కంపెనీల్లో 6.45శాతం నిబంధనలకు లోబడే పెట్టుబడులు పెట్టినట్టు వివరించారు. ఎల్ఐసీ గొప్ప సంస్థ అనీ, దాని కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించడం, సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తుందని తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. అందువల్ల నిరసనల నిర్ణయంపై పునరాలోచించాలని కోరారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఎత్తేయాలి

డీవైఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతి యుతంగా ఆందోళనలు చేస్తున్న వారిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన 12 మందితోపాటు, అసెంబ్లీ వద్ద ఆందోళన చేపట్టిన 16 మంది అభ్యర్థులపై 341, 147, 149, 352, 353 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారని తెలిపారు. వాస్తవానికి దేహదారుఢ్య పరీక్షల్లో జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని అభ్యర్థులు అనేక రోజులుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. వారి డిమాండ్లను పరిష్కరించని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా కేసులను నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. డిజిటల్ కొలతల పద్ధతి వల్ల వేలాది మంది అభ్యర్థులకు నష్టపోయారని తెలిపారు. ఈ విషయంలో పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు.

ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోగా పోరాడుతున్న అభ్యర్థులపై క్రిమినల్ కేసులు పెట్టడం మూలంగా వారి భవిష్యత్తు ఉద్యోగావకాశాలకు నష్టం వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారిపై నమోదు చేసిన క్రిమినల్ కేసులను తక్షణమే ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

అభ్యర్థులపై ఆ కేసులను ఉపసంహరించుకోవాలి : ఏఐవైఎఫ్

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలీ ఉల్లా ఖాద్రీ, కె ధర్మేంద్ర ఒక ప్రకటన విడుదల చేశారు. డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన 12 మందితో పాటు, అసెంబ్లీ వద్ద ఆందోళన చేపట్టిన 16 మంది అభ్యర్థులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారని తెలిపారు. అభ్యర్థుల పట్ల ప్రభుత్వం, పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించాలని కోరారు. వారిపై నమోదు చేసిన కేసుల కారణంగా భవిష్యత్‌లో నష్టపోయే ప్రమాదముందని తెలిపారు.

6న హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర


- సమ్మక్క సారలమ్మ నుంచి ప్రారంభం
- ఈనెల 24, 25, 26 తేదీల్లో యాత్రకు బ్రేక్ : టీపీసీసీ చీఫ్ రేవంత్ వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తిని ఇంటింటికి తీసుకెళ్లేందుకు ఈనెల 6 నుంచి హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను ప్రారంభించనున్నట్టు టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ నుంచి ప్రారంభమై, మహబూబాబాద్ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో తాను ప్రత్యక్షంగా యాత్రలో పాల్గొంటానన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రేతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కొత్త నియామకాలు వచ్చే వరకు పాత మండలాధ్యక్షులు యాత్రకు పని చేస్తామన్నారు. ఈనెల 24, 25, 26 తేదీల్లో ఏఐసీసీ ప్లీనరీ సమావేశాలు ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతాయనీ, అందు కోసం ఆ మూడు రోజులు యాత్రకు విరమిస్తామన్నారు. ప్రజల్లో విశ్వాసాన్ని కల్పించే ప్రయత్నం కోవిడ్ సమయంలోనే కాక నిత్యం ప్రజల కోసం కొట్లాడే సీతక్క నియోజకవర్గం నుంచే ఈ యాత్ర చేపట్టడం సంతోషకరమన్నారు. ఆనాడు రాజులు, రాచరికం మీద పోరాడిన సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితోనే ఈ యాత్ర చేస్తున్నట్టు తెలిపారు. బీజేపీ బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని ఆరోపించారు. అన్ని విషయాల్లో వైఫల్యం చెందిన కేసీఆర్ అబద్దాలను గవర్నర్ కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ విధానాలు అన్ని ఒక్కటేనన్నారు. మంత్రి కేటీఆర్‌కు రాహుల్‌గాంధీపై కాకుండా క్యాట్ వాక్, డిస్కో డాన్స్‌లపై మాట్లాడుకుంటే మంచిదని సూచించారు. సీఎంకు ప్రజలు, ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదనీ, వారికి ఇవే చివరి ఎన్నికలని చెప్పారు. అందుకే కుమారుడికి అసెంబ్లీలో మాట్లాడే అవకాశమిచ్చారని ఎద్దేవా చేశారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు అక్రమంగా జైలుకు పంపడం సరికాదన్నారు. విద్యార్థి నేతల అరెస్టును టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఖండించారు.

వ్య.కా.స. జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

- హౌరాలో ఈనెల 15 నుంచి 18 వరకు...



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పశ్చిమ బెంగాల్‌లోని హౌరా పట్టణంలో ఈనెల 15 నుంచి 18 వరకు జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభల్ని జయప్రదం చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం చిక్కడపల్లిలోని తెలంగాణ వ్య.కా.సం. రాష్ట్ర కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. అఖిల భారత కిసాన్ సభ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, టీ సాగర్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు, నాయకులు బి ప్రసాద్, బి పద్మ ఆర్ ఆంజనేయులు, శోభన్‌నాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోటా రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక వ్యవసాయ కార్మికులు దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేసి రాజ్యాంగబద్ధంగా సాధించుకున్న చట్టాలు, హక్కులను అమలు చేయకుండా నీరు కారుస్తున్నదని చెప్పారు.. కుటుంబానికి వంద రోజుల పనిని గ్యారెంటీ చేస్తూ యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్లో ఆమోదించిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయకుండా తొక్కి పట్టి, బడ్జెట్ కేటాయింపుల్లో భారీగా కోత విధించారని అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన మహాసభల్లో జరుగుతుందనీ, దాన్ని విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లపై తీర్మానం చేయాలి : దాసు సురేష్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రా ముఖ్యమంత్రులు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లపై తీర్మానం చేసి దేశానికి దిక్సూచిగా నిలవాలని బీసీ రాజ్యాధికార వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు సాధ్యమయ్యే విధంగా బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంత్రి వర్గ తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని పేర్కొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి ఢిల్లీ కేంద్ర కమిటీ కన్వీనర్ ప్రకాశ్ శర్మ నేతృత్వంలో ఢిల్లీలోని యువకులు, విద్యార్థులు తమ సంస్థ పట్ల ఆకర్షితులై సమితిలో చేరారని తెలిపారు.

సచివాలయంలో అగ్నిప్రమాదంపై విచారణ జరపాలి

- వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సచివాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ జరిపించాలని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనపై కేసు ఎందుకు పెట్టలేదో తెలపాలని పేర్కొన్నారు. నిపుణులతో కూడిన కమిటీ వేసి, ఖర్చు పై ఆడిట్ చేయించాలని డిమాండ్ చేశారు. మాక్ డ్రిల్ అంటూ అబద్ధాలు చెప్పి, కప్పిపుచ్చుకునేందుకు చూడటమేంటని ప్రశ్నించారు.

నేడు నాందేడ్‌కు సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడ నిర్వహించబోయే బీఆర్ఎస్ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. అనంతరం అక్కడ మీడియా సమావేశంలో సీఎం పాల్గొంటారు. బీఆర్ఎస్‌ను దేశవ్యాప్తంగా విస్తరించే క్రమంలో భాగంగా నాందేడ్‌లో సీఎం సభను నిర్వహిస్తున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో ఆ ప్రాంతానికి చెందిన పలువురు ముఖ్యులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరనున్నారు. అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గత వారం రోజులుగా నాందేడ్‌లోనే మకాం వేశారు. సభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఆయనతోపాటు ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు జోగు రామన్న, షకీల్ తదితరులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పలువురు నేతల భేటీ...

వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు సీనియర్‌లు శనివారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన నేషనల్ యునైటెడ్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు గోపాల్ రిషికార్ భారతి, మధ్యప్రదేశ్ బాలాఘాట్‌కు చెందిన మాజీ ఎంపీ బోధ్ సింగ్ భగత్, మహారాష్ట్ర బండారా మాజీ ఎంపీ కుషాల్ భోప్చే, ఛత్తీస్‌ఘడ్ మాజీ మంత్రి చబ్బీలాల్ రాత్రే, గడ్చిరోలి మాజీ జిల్లా పరిషత్ చైర్మెన్ పసుల సమ్మయ్య పోచమ, రిపబ్లికన్ పార్టీ గడ్చిరోలి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ శంకర్ తదితరులు కేసీఆర్‌ను కలిశారు. బీఆర్ఎస్ విధానాల పట్ల ఆకర్షితులైన తాము ఆ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

పేర్లు మారుస్తారు.. వాటా మాత్రం పెంచరు : ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రాయోజిత పథకాల పేర్లను మార్చుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆ పథకాల్లో భాగంగా రాష్ట్రాలకు అందించే తన వాటాను మాత్రం పెంచటం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వేతనాలను రూ.3 వేలకు పెంచిన నేపథ్యంలో మధ్యాహ్న భోజన వర్కర్లు శనివారం కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయా వర్కర్ల వేతనంలో కేంద్రం తన వాటాను ఒక్క రూపాయి కూడా పెంచకపోవటం శోచనీయమన్నారు.

పట్టాలివ్వండి

- రెవెన్యూ అధికారులకు సీఎస్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పేదల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నెంబరు 58, 59, 76 ఉత్తర్వుల ప్రకారం క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేసి లబ్ధిదారులకు పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. రెవెన్యూ సంబంధిత అంశాలపై శనివారంనాడామె జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంచిర్యాల, సిద్ధిపేట, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ విషయంలో పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు రెవెన్యూ అధికారులు కషిచేయాలని స్పష్టం చేశారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి ఈ జీవోలకు సంబంధించిన అంశాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, సిసిఎల్ఏ ప్రత్యేక అధికారి సత్యశారద, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం అందరితో ఎందుకు పోరాడుతుంది?

- అందరితో గొడవపెట్టుకుంటే దేశం అభివృద్ధికాదు : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఇతరుల పనుల్లో జోక్యం చేసుకోవద్దని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సూచించారు. సోషల్‌మీడియా వేదికగా ఆయన శనివారం కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. న్యాయమూర్తుల నియామకంపై సుప్రంకోర్టు, కేంద్రానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. దీనికి సంబంధించిన ఓ వార్తా నివేదికను ఉటంకిస్తూ.. 'కేంద్ర ప్రభుత్వం అందరితో ఎందుకు పోరాడుతుంది? న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు, రైతులు, వ్యాపారులతో.. ఇలా అందరితో గొడవలు పెట్టుకుంటే దేశం అభివృద్ధి చెందదు. మీ పని మీరు చేయండి... ఇతరుల్ని కూడా వారు చేసే పనులను వారిని చేసుకోనివ్వండి. ఇతరుల పనిలో జోక్యం చేసుకోకండి' అంటూ ఆయన ట్వీట్ చేశారు.



కోవిడ్ తర్వాత పెరిగిన తుంటి సమస్యలు

- ఆర్థో సింపోజియంలో డాక్టర్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోవిడ్ తర్వాత దేశవ్యాప్తంగా తుంటి సంబంధిత కేసులు పెద్ద ఎత్తున పెరిగాయని పలువురు ప్రముఖ ఆర్థో పెడిక్ సర్జన్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమయంలో చాలా మంది కరోనా పాజిటివ్ బాధితులు మోతాదుకు మించి స్టెరాయిడ్స్ కలిసిన టాబ్లెట్లు వాడారనీ, ఫలితంగా అవి ప్రస్తుతం చాలా మందిలో తుంటిలో రక్త ప్రసరణ సమస్యలను పెంచాయని హిప్ మాస్టర్ సైన్టిఫిక్ వర్క్‌షాప్ అభిప్రాయ పడింది. టోటల్ హిప్ బేసిక్ టు అడ్వాన్స్, తుంటి ఫెయిల్యూర్ పై హిప్ రివిజన్ అనే అంశాలపై ఆర్థో పెడిక్ సర్జన్ల జాతీయ స్థాయి సింపోజీయం నగరంలోని హైటెక్స్‌లో శనివారం ప్రారంభమయింది. రెండ్రోజుల పాటు అది కొనసాగనున్నది. ఈ సందర్భంగా సింపోసిజియం చైర్మెన్, ఆర్థో సర్జన్ డాక్టర్ ఉదయ్ కృష్ణ మైనేని మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ఏ వాస్క్యులర్ నెక్రోసీస్ - (ఏ వీ ఎన్- తుంటిలో రక్త ప్రసరణ తగ్గిపోవడం లేదా కొన్ని చోట్ల ఆగిపోవడం వంటి కేసులు విపరీతంగా పెరిగాయని తెలిపారు. మద్యపానం, స్మోకింగ్ సేవించే అలవాటు ఉన్న వారిలో తుంటి సంబందిత సమస్యలు మరింత అధికమయ్యాయని చెప్పారు. అయా సమస్యల నుంచి రోగులను గట్టేక్కించేందుకు పీఆర్‌పీ (ప్లేట్ లెట్ రీచ్ ప్లేజ్మా), స్టెమ్ సెల్ థెరపీ, భీమాస్ (బోన్ మ్యారో యాస్పిరెట్ స్టెమ్ సెల్ థెరపీ కాంసెంట్రెషన్) వంటి అదునాతన చికిత్స విధానాలపై దేశవ్యాప్తంగా వచ్చిన 300 మంది ఆర్థో పెడిక్ సర్జన్లకు అవగాహన కల్పించినట్టు తెలిపారు.

కెపిహెచ్‌బి ఫేస్-13లో బీఓబీ ఎటిఎం..



బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కూకట్‌పల్లిలోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్ గార్డెనియాలో నూతన ఏటీఎం కేంద్రాన్ని తెరిచింది. కేపీహెచ్‌బీ, ఫేస్-13లో ఏర్పాటుచేసిన దీన్ని ఆ బ్యాంక్ హైదరాబాద్ జోన్ సీజీఎం మన్మోహన్ గుప్తా లాంచనంగా ప్రారంభించారు.

ఈనెల 12 వరకే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12 వరకే కొనసాగనున్నాయి. అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆదివారం, మంగళవారాల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. ఈ నెల 6న ఆర్థిక మంత్రి హరీశ్ రావు శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. 8న బడ్జెట్‌పై సాధారణ చర్చ జరుగుతుంది. అదే రోజు బీఏసీ సమావేశమవుతుంది. 9 నుంచి పద్దులపై చర్చ కొనసాగనుంది. చివరి రోజు ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనసభ, మండలి ఆమోదం తెలపనున్నాయి.

నేడు దేశవ్యాప్త ఆర్టీసీ నాయకుల సమావేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆర్టీసీలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కారాలు, కార్మిక సంఘాలు అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించేందుకు ఆదివారం (ఫిబ్రవరి 5) హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో దేశవ్యాప్త ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకుల సమావేశం జరగనుంది. దేశవ్యాప్త ఆర్టీసీలకు చెందిన దాదాపు 80 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు అవుతున్నట్టు టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్), ఎస్‌డబ్ల్యూఎఫ్ సంయుక్తంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్ సహా దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ అనుబంధ ఆర్టీసీ సంఘాల నాయకులు పాల్గొంటున్నారు. ముఖ్య అతిథులుగా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ అధ్యక్షులు నేపాల్‌దేవ్ భట్టాచార్య, ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య, ఎస్‌టీయూ సెక్టార్ కన్వీనర్ ఆర్ముగనాయనార్ హాజరవుతున్నారు. ఆర్టీసీల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశం కార్మికోద్యమ చరిత్రలో మైలురాయిగా నిలుస్తూ, భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం చేస్తుందని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తెలిపారు.

ఎస్‌డీఎఫ్ నిధులివ్వటం లేదు..

- రఘునందన్ రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివద్ధికి నిధులిచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీజేపీ సభ్యుడు రఘునందన్ రావు ఆరోపించారు.నియోజక వర్గాల ప్రత్యేక అభివృద్ధి పథకం కింద గజ్వేల్‌కు రూ.890 కోట్లు, సిద్ధిపేటకు రూ.790కోట్ల నిధులు ఇచ్చిన సీఎం కేసీఆర్.. దుబ్బాక నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులకు ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రగతి భవన్ ముందు ఓ సర్పంచ్ కుటుంబంతో కలిసి ఆత్మహత్యాయత్నం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నగరంలో పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వడం లేదని చెప్పారు. ఇంటి నిర్మాణానికి గతంలో రూ.5లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు దాన్ని రూ.3లక్షలకు తగ్గించిందన్నారు. 2019లో నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించి మూడేండ్లయినా ఇంకా అమలు చేయలేదని గుర్తు చేశారు. గిరిజన యూనివర్సిటీకి కేంద్రం నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించడంలేదని ఆరోపించారు. వడ్ల కొనుగోలు విషయంలో కేసీఆర్ సర్కారు కేంద్రాన్ని బద్నాం చేస్తోందనీ, ఈ విషయంలో మోడీ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని రఘునందన్ స్పష్టం చేశారు.

అసెంబ్లీలో నాపై వ్యక్తిగత ఆరోపణలు

- 2020లో తాను ఎలాంటి పాంప్లెట్ ముద్రించలేదు
- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

శాసనసభలో తనపై వ్యక్తిగత ఆరోపణలు చేశారని, అధికారంలో ఉన్నవారికంటే ప్రజాశక్తి గొప్పది అనేది నాకన్నా కేటీఆర్ ఎక్కువ గుర్తుంచుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఆయన శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 2020 దుబ్బాక ఉప ఎన్నికల్లో తాను ఎటువంటి పాంప్లెట్‌నూ ముద్రించలేదని, సభలోకి తెచ్చిన పాంప్లెట్ 2018 సాధారణ ఎన్నికలప్పుడు ముద్రించిందని, దానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. అదే సమయంలో 2014లో మీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చారా అని మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. చేగుంటకు డిగ్రీ కాలేజ్.. దుబ్బాకకు రింగు రోడ్డు ఇవ్వాల్సింది ఎవరని ప్రశ్నించారు. 103మంది ఎమ్మెల్యేలు ఉన్నామని, అహంకారం పనికిరాదు.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. నేను ఇచ్చిన మ్యానిఫెస్టోకు కట్టుబడి ఉంటానని, తాము అధికారంలోకి వచ్చాక అమలు చేసి చూపిస్తానని చెప్పారు. హామీలు, నిధులపై అడిగితే కేటీఆర్ తెలంగాణ తొమ్మిదేండ్ల పసిగుడ్డు అంటున్నారని, అలాంటప్పుడు రెండేండ్ల పసిగుడ్డు అయిన తాను చేయడానికి కూడా సమయం పడుతుందన్నారు. రెండు నిమిషాలు మాట్లాడటానికి అవకాశం ఇవ్వలేదన్నారు. తమకూ సమయం వస్తుందని, తమరు ప్రతిపక్షంలో ఉన్నా మాట్లాడటానికి అవకాశం ఇస్తామని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పించుకొని పారిపోయారని ఎద్దేవా చేశారు. దుబ్బాక నియోజకవర్గానికి మీ బావతో కలిసిరా కేటీఆర్.. తప్పకుండా ప్రజలతో సమాధానం చెప్పిస్తానని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం, మోడీపై అనేక ఆరోపణలు చేశారని, అవకాశమిస్తే కచ్చితంగా సమాధానం చెప్తానని అన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం


- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొని ప్రజల్లో సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నదని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. 24 గంటలు ఉచిత కరెంటు అని అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ చెప్పిన విషయం శుద్ధ అబద్ధం అన్నారు. దళిత ప్రాంతాల్లో రాత్రిపూట కరెంటు తీసి వాళ్ల అన్నం తినకుండా చేస్తున్నారని, లాండ్రీ, సెలూన్ షాపులకు వంద యూనిట్లలోపు ఉచిత కరెంటు ఎక్కడా సరిగ్గా అమలు కావడం లేదన్నారు. అది నిజామా? కాదా తెలుసుకోవాలన్నారు. ప్రతిపక్షాలు మాట్లాడకుండా ప్రయత్నం చేస్తున్నారని, దమ్ముంటే ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇవ్వాలన్నారు. అన్నింటికీ కేంద్ర ప్రభుత్వంపై నింద వేస్తున్నారని, ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని జిల్లాలను పోషించే సత్తా హైదరాబాద్‌కు ఉండేదని, మరి ఇప్పుడు నిధుల కొరత ఎలా వచ్చిందని ప్రశ్నించారు. దేశంలో కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకుంటున్న రాష్ట్రం ఏదన్నా ఉంది అంటే అది తెలంగాణ మాత్రమేనన్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు రావడం లేదని, సర్పంచులు, ఉపసర్పంచులు చిన్న పనులు చేస్తున్నా బిల్లులు రావడం లేదన్నారు. స్పీకర్‌ను అడ్డుపెట్టుకొని సంఖ్యా బలంతో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం మంచిది కాదన్నారు. అలా చేసినవారు కాల గర్భంలో కలిసి పోయారని గుర్తుచేశారు. పదవులు, అధికారం శాశ్వతం కాదని, ప్రభుత్వానికి ప్రజలు సమాధానం చెప్పే రోజులు చాలా దగ్గరలో ఉన్నాయన్నారు.

ఎన్‌డీసీఏ జాతీయ అవార్డులు అందుకున్న శ్రీచైతన్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ప్రతిష్టాత్మకమైన నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమి (ఎన్‌డీసీఏ) జాతీయ అవార్డులను శ్రీచైతన్య స్కూల్ అందుకుంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మెన్ సముద్రాల వేణుగోపాలాచారి, తెలంగాణ పర్యాటక సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాసగుప్తా, నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమి ప్రతినిధులు బింగి నరేంద్రగౌడ్, విజయ్‌కుమార్ చేతుల మీదుగా శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ జాతీయ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్ చైర్మెన్ బిఎస్ రావు, చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మిబాయి, డైరెక్టర్లు నాగేంద్ర, సుష్మ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు కొట్టి పెద్దలకు

- ప్రజావ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-నేరేడుచర్ల

ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేకంగా ఉందని, పేదల కడుపుగొట్టి, పెద్దలకు పెట్టిన చందంగా ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని సీపీఐ(ఎం) కార్యాలయం అరిబండి భవన్‌లో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టానికి భారీగా కోతలు పెట్టిన కేంద్ర సర్కార్ కార్పొరేట్ శక్తులకు ఇప్పటికే ఇస్తున్న రూ.లక్షల కోట్ల సబ్సిడీలకు అదనంగా మరో రూ.35 వేల కోట్లు పెంచడం దారుణమన్నారు. పన్ను పరిధిని రూ.5లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచడం మినహా ఏ ఒక్కటి దేశ ప్రజలకు మేలు చేసే విధంగా లేవని చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని, పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని కొన్నేండ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నా మోడీ సర్కార్ పెడచెవిన పెట్టడాన్ని తప్పుపట్టారు. ఎల్ఐసీలో వాటాలను అదానికి అమ్మడంతో ఒక్క రోజులోనే రూ.18 లక్షల కోట్ల ప్రజల డబ్బు ఆవిరైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించడానికి ప్రతిపక్షాలకు సమయం ఇవ్వకపోవడం వీరి నిరంకుశపాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ ఎన్నికల వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ బలమైన శక్తిగా ఉండి బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతుందని భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే శక్తులన్నింటినీ కలుపుకువెళ్లడానికి తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలైన పోడు భూములకు హక్కు పత్రాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, ఖాళీ జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల హామీని రూ.5 లక్షలకు పెంచాలని, గుడిసెలు వేసుకున్న ప్రతి పేదవారికీ ఇంటి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ధరణిలో సమస్యలు ఉన్నాయని, 9 లక్షల ఎకరాల భూమి రికార్డులు పెండింగ్‌లు ఉన్నాయని వీటన్నింటినీ పరిష్కరించాలని కోరారు. సమస్యను పరిష్కరించే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై సీపీఐ(ఎం) రాజీలేని పోరాటం చేస్తుందని చెప్పారు. దేశవ్యాప్తంగా మూడో ఫ్రంట్ అనే వాదనను తోసిపుచ్చారు. అనంతరం పార్టీ నేరేడుచర్ల పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ ఇంటికెళ్లి ఆయన తండ్రి చిత్రపటానికి పూలమాలేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు, కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, బుర్రి శ్రీరాములు, ధీరావత్ రవినాయక్, నాగారపు పాండు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మట్టపల్లి సైదులు, కోట గోపి తదితరులు ఉన్నారు.

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలపలేను....

- మండలిలో కాంగ్రెస్ సభ్యుడు జీవన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వాస్తవాలకు భిన్నంగా ఉన్న గవర్నర్ ప్రసంగానికి తాను ధన్యవాదాలు తెలుపలేనని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి తెలిపారు. శనివారం శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రసంగంలో కొంత మేరకైనా వాస్తవాలుంటే ధన్య వాదాలు తెలిపేవాడినని స్పష్టం చేశారు. జీవన్ రెడ్డి ఆయా రంగాల వారీగా మాట్లాడుతూ విమర్శిస్తుంటే టీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, భాను ప్రసాద్, ప్రభాకర్‌రావు తదితరులు అభ్యంతరం తెలిపారు. అబద్ధాలాడొద్దంటూ కామెంట్ చేశారు. ఇందుకు బదులుగా జీవన్ రెడ్డి గవర్నర్ తన ప్రసంగంలో అబద్ధాలే చెప్పారని వ్యాఖ్యానించారు. 24 గంటల విద్యుత్ నిజంగా సరఫరా అవుతుంటే సబ్ స్టేషన్ల వారీగా శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ పరిధిలో సబ్ స్టేషన్లలో వారీగా నిరంతర కరెంటు రావడం లేదని తెలిపారు. రైతు రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుంటే ఓట్లు అడగబోమని చెప్పాలంటూ సవాల్ విసిరారు. మార్కెట్లలో హమాలీ ఛార్జీల భారం రైతులపై పడుతున్నదనీ, గత ప్రభుత్వాల మాదిరిగా ప్రభుత్వమే ఆయా ఛార్జీలను భరించాలని కోరారు. చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జోక్యం చేసుకుని పండిన ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. దీనికి జీవన్ రెడ్డి బదులిస్తూ, 'మీరు భావిస్తే సరిపోద్దా?' అంటూ ప్రశ్నించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు బీమా పథ కాలు ఎటు పోయాయంటూ ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అమలైన రైతు సంక్షేమ కార్యక్రమాలను నిలిపేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఖమ్మంలో ఏడు మండలాలను కేంద్రం ఏపీలో కలిపిందనీ, పసుపు బోర్డు ఇవ్వకుండా మో సం చేసిందనీ, ఇంత చేస్తున్నా బీఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తి ఏమైందని ప్రశ్నించారు. కేంద్రంపై బీఆర్ఎస్ పోరాటం చేస్తే తాము కూడా పాల్గొంటామని తెలిపారు.

తెలంగాణ భారతదేశంలో భాగం కాదా?
మెడికల్, నర్సింగ్ కాలేజీలు కేటాయించరా?

- బీజేపీ సర్కార్ పై పల్లా ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ సర్కార్ వివక్ష చూపిస్తున్నదనీ, ఈ రాష్ట్రం భారతదేశంలో భాగం కాదా? అని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆయన ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. గతంలో దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలకు అనుమతించి తెలంగాణను విస్మరించారనీ, తాజాగా 157 నర్సింగ్ కాలేజీల విషయంలోనూ అదే విధంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సొమ్మును గుజరాత్‌తో పాటు ఎన్నికలు జరగబోతున్న రాష్ట్రాలకు పంపిణీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం సహకరించకున్నా, ప్రతిపక్ష పార్టీలు అడుగడుగునా అడ్డుకున్నా బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం విద్య, ఉపాధి, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందని వివరించారు. గత పదేండ్లలో వ్యవసాయాభివద్ధిలో రాష్ట్రానికి దేశంలోనే రెండో స్థానం దక్కిందనీ, వైద్యారోగ్య రంగంలో మూడో స్థానంలో నిలిచిందని ఉదహరించారు. సంపదను సీఎం కేసీఆర్ సృష్టిస్తుంటే ప్రధాని కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని విమర్శించారు. ఫీనిక్స్ పక్షిలా అభివృద్ధిని సాధించటం ద్వారా... తెలంగాణ దేశానికే నమూనాగా నిలిచిందని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ తీర్మానాన్ని బలపరుస్తూ, దళితులు, గొల్ల కురుమలు, గంగపుత్రులు, ముదిరాజ్‌లు, గౌడ తదితర సామాజిక వర్గాల సంక్షేమానికి అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. జర్నలిస్టుల నిధికి రూ.100 కోట్లు కేటాయించిన సీఎం కేసీఆర్ వారికి స్థలాలిచ్చేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

ప్రయివేటు ఆస్పత్రులు మూతపడే పరిస్థితి

ప్రభుత్వాస్పత్రుల్లో పెరిగిన వసతులు, సౌకర్యాలతో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోగులు వైద్యాన్ని పొందుతున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తెలిపారు. దీంతో ప్రయివేటు ఆస్పత్రులు మూతపడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ వల్ల పెట్టుబడులను పెద్ద ఎత్తున ప్రభుత్వం ఆకర్షించిందన్నారు.

కేంద్రం సహకరించకున్నా....

కేంద్రం సహకరించకున్నా, ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డుపడినా అన్ని రాష్ట్రాలకు ప్రేరణ, ఉత్తేజం ఇచ్చేలా తెలంగాణను ప్రగతిపథంలో నడిపిన మహనీయుడు సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొనియాడారు. ఈ విషయాలను రాష్ట్ర గవర్నర్ ప్రసంగంలో కూలంకషంగా చెప్పారని గుర్తుచేస్తూ ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు కంటి వెలుగు బాగుందంటూ వారి రాష్ట్రాల్లో అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్రజల తలసరి ఆదాయమే అభివృద్ధికి కొలమానమంటూ, 2014లో రూ.1,24,104గా ఉన్న తలసరి ఆదాయం రూ.3,17,118కి పెరిగిందని తెలిపారు. మహిళలు, శిశువుల సంక్షేమం, ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. నిజామాబాద్ సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర నాందేడ్ ప్రాంతానికి చెందిన గ్రామాలు తమనూ తెలంగాణలో కలపాలంటూ తీర్మానాలు చేయడం రాష్ట్రానికే గర్వకారణమని తెలిపారు. ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ సిఫారసుల మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయుల నుంచి ఒక శాతం వాటా తీసుకుని ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలని కోరారు. మోడల్ స్కూళ్లు, ఎయిడెడ్ స్కూళ్ల సిబ్బందికి దీన్ని వర్తింపజేయాలన్నారు.

దేశాన్ని మత భూతం ఆవహించింది

- ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు సమాయత్తమవ్వాలి
- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీశంకర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశాన్ని మతభూతం ఆవహించిందనీ, ఆ ప్రమాదం నుంచి కాపాడుకొనేందుకు ప్రజాస్వామ్య లౌకిక శక్తులు సమాయత్తం కావాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. మఖ్దూం మొహియుద్దీన్ 115వ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పైనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటాలను వక్రీకరించి, చరిత్రకు మతం రంగు పూయాలని ప్రయత్నించే శక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కే ఆనందాచారి మాట్లాడుతూ మఖ్దూం మొహియుద్దీన్ ఆదర్శాలు, ఆశయాలు, స్వప్నాలు నెరవేరాలంటే మనిషిని మనిషిగా గౌరవించే సమాజం కోసం పోరాడటమేనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు తంగిరాల చక్రవర్తి, ఆనంతోజు మోహనకృష్ణ, శాంతారావు, సలీమా, రేఖ, పేర్లరాము, సీపీఐ నాయకులు బోసు తదితరులు పాల్గొన్నారు.

హెూదాను బట్టి జీతాలిస్తారా?

- టీఎస్ఆర్టీసీజేఏసీ ఆక్షేపణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీలో హెూదాలను బట్టి జీతాలు ఇవ్వడం ఏంటని టీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి, కన్వీనర్ వీఎస్ రావు ఆక్షేపించారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రతినెలా 1వతేదీ జీతాలిస్తామంటూ కార్మికులు, సంస్థ బ్యాంకు ఖాతాలను ఎస్‌బీఐ నుంచి యూనియన్ బ్యాంకుకు మార్చారని చెప్పారు. ఈనెల 4వ తేదీ వచ్చినా గ్యారేజీ కార్మికులు, సూపర్‌వైజర్లు, ఆఫీస్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి జీతాలివ్వలేదని తెలిపారు. రోజూ ఆర్టీసీకి లాభాలొస్తున్నాయని యాజమాన్యం మీడియాలో ప్రచారం చేసుకుంటున్నదనీ, సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. కార్మికులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారనీ, వారి ఈఎమ్‌ఐలు బౌన్స్ అయితే ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సోమవారంనాటికి జీతాలు ఇవ్వకుంటే ఈనెల 7వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

సమాజంలో సంస్కృతీసంప్రదాయాల పాత్ర కీలకం

- మంత్రి జగదీశ్‌రెడ్డి
- భేరీలు వాయించి పెద్దగట్టు జాతర ప్రారంభం
- వైభవంగా మకరతోరణం తరలింపు

నవతెలంగాణ-సూర్యాపేట



సమాజాన్ని క్రమపద్ధతిలో నడపడంలో ఆయా ప్రాంతాలు, వర్గాల సంస్కృతీ సంప్రదాయాల పాత్ర కీలకమని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని పెద్దగట్టు జాతరలో తొలిఘట్టమైన మకరతోరణం తరలింపు ప్రక్రియను శనివారం స్థానిక గొల్లబజార్, ఎల్లమ్మగుడిలో ప్రత్యేక పూజలు చేసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి మంత్రి భేరీలు వాయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని కులాలు, మతాలకు సమన్యాయం కల్పించామని చెప్పారు. ప్రజలను ఐక్యం చేయడంలో పెద్దగట్టు వంటి జాతరలు దోహదపడుతాయన్న మంత్రి.. తెలంగాణలో రెండో అతి పెద్ద జాతరకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఆదివారం రాత్రి కేసారం నుంచి దేవరపెట్టే తరలింపు అనంతరం సోమవారం నుంచి సందర్శకులు వస్తారని తెలిపారు. మూడ్రోజుల పాటు రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా 15 లక్షల మంది వరకు తరలివస్తారని అంచనా వేశారు. ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దగట్టు చైర్మెన్ కోడి సైదులు, డీసీఎంఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మెన్ వట్టె జానయ్య యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ జీడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఓయూకు రూ.1000 కోట్లు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అర్.ఎల్.మూర్తి
- ఓయూలో సంతకాల సేకరణ



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీకి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అర్.ఎల్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ఓయూలో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. ఓయూకు ప్రభుత్వం కేటాయించే నిధులు వేతనాలు ఇవ్వడానికి మాత్రమే సరిపోతున్నాయని, యూనివర్సిటీలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకూ నోచుకోవడం లేదన్నారు. యూనివర్సిటీని నడిపించడానికి అధికారులు విద్యార్థుల మీద ఫీజుల భారం వేసే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల పరిస్థితీ ఈ విధంగానే ఉందని, రోజురోజుకు అవి నిర్వీర్యానికి గురవుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కూడా విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ 2.4 శాతం మాత్రమేనని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని చెప్పారు. సీఎం రాష్ట్రంలో విద్యారంగ పరిరక్షణ కోసం 30 శాతం నిధులు కేటాయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలపై అసెంబ్లీలో ప్రత్యేకంగా చర్చించి వాటి సమగ్ర అభివృద్ధి కోసం తగిన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. యూనివర్సిటీలో చదివే ప్రతి విద్యార్థికీ ఉచిత మెస్, స్కాలర్‌షిప్, ఫెలోషిప్ కూడా అందించే విధంగా తగిన బడ్జెట్ కేటాయించాలన్నారు. ఓయూ అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు, రవి మాట్లాడుతూ.. ఓయూకు నిధులు కేటాయించకపోతే అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సంతకాల సేకరణలో ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షులు శ్రీను, పవన్, సహాయ కార్యదర్శి కృష్ణ, అశ్విని, నాయకులు రమ్య, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విలేకరిపై దాడిని ఖండించిన తమ్మినేని

- వినతిపత్రం అందజేసిన జర్నలిస్టు సంఘాల నాయకులు



నవతెలంగాణ-నేరేడుచర్ల

నీతి, నిజాయితీ నిస్వార్థంతో పనిచేస్తున్న విలేకరులపై కొంతమంది రాజకీయ నాయకులు కక్షగట్టి దాడులు చేస్తున్నారని టీడబ్ల్యూజేఎఫ్, టీడబ్ల్యూజే (ఐజేయూ), టీడబ్ల్యూజేహెచ్ 143 జర్నలిస్ట్ సంఘాల నాయకులు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం దృష్టికి తీసుకెళ్లారు. శనివారం నేరేడుచర్ల పట్టణంలోని అరిబండి భవన్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలో కౌన్సిలర్లకు, చైర్మెన్‌కు మధ్య అసమ్మతి గురించి వార్త రాసినందుకుగాను చైర్మెన్‌కు సంబంధించిన వ్యక్తులు ఆ జర్నలిస్ట్ ఇంటికి వెళ్లి దాడి చేయడాన్ని ఆయనకు వివరించారు. దీనికి సంబంధించిన వివరాలు పూర్తిగా తెలుసుకొని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని, అదేవిధంగా దాడిని తీవ్రంగా ఖండించారు. అలాగే జర్నలిస్టుల సమస్యలపైనా సీఎంకు చెప్పి పరిష్కారమయ్యేలా చూడాలని విలేకరులు కోరారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సట్టు శ్రీనివాస్, హుజూర్‌నగర్ డివిజన్ అధ్యక్షులు రావుల రాజు, కార్యదర్శి ఆర్లపూడి వీరభద్రం, టీడబ్ల్యూజేహెచ్-143 డివిజన్ ప్రధాన కార్యదర్శి మానుకొండ రాంరెడ్డి, టీడబ్ల్యూజే (ఐజేయూ)జిల్లా ఉపాధ్యక్షులు టీఎస్.స్వామి, విలేకరులు బాలకృష్ణ, శంకర్, యుగంధర్, వీరయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ఖమ్మంలో వందే భారత్ రైలుపై రాళ్ల దాడి

- సీసీ కెమెరాలలో నిందితుల గుర్తింపు?

నవతెలంగాణ-ఖమ్మం

వందే భారత్ రైలుపై శనివారం ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో రాళ్ల దాడి జరిగింది. రైల్వే స్టేషన్ సమీపంలో ఆకతాయిలు రాళ్లతో దాడి చేసినట్టు తెలుస్తోంది. ఈ దాడిలో సీ12 కోచ్ విండో ఎమర్జెన్సీ గ్లాస్ ధ్వంసమైంది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఆకతాయిలు రైలుపై రాళ్లు విసిరిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్టు సమాచారం. ఆర్‌పీఎఫ్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకునే పనిలో ఉన్నట్టు సమాచారం.

ఇండ్ల స్థలాల ఊసే లేకపోవటం విచారకరం..

- జర్నలిస్టులకూ ఇండ్ల స్థలాలివ్వాలి
- అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గవర్నర్ ప్రసంగంలో పేదలకు ఇండ్ల స్థలాల ఊసే లేకపోవటం విచార కరమని శాసన సభలో కాంగ్రెస్ సభ్యుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాల హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. పేదోళ్లకు 100 గజాల ఇళ్ల స్థలం ఇచ్చే జీవోను మళ్ళీ తీసుకురావాలని కోరారు. రైతు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు నిధుల్లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సహాయాన్ని రూ. రెండు లక్షలు పెంచాలన్నారు. క్యాన్సర్ రోగుల సమస్యలపై ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యం కోసం ఆ కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని గుర్తుచేశారు. యాదాద్రికి మెట్రో రైల్ ఏర్పాటు చేయాలనీ, సంగారెడ్డికి కూడా మెట్రోను విస్తరించాలని కోరారు. నిరుద్యోగ భతి కింద ఇస్తామన్న రూ. 3,016 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలు గవర్నర్ ప్రసంగంలో లేవని గుర్తుచేశారు.

వందెకరాల భూదాన భూములను పేదలకు ఇండ్లస్థలాలివ్వండి

- సీఎం కేసీఆర్‌కు చాడ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 216 నుంచి 224 వరకు గల సుమారు వందెకరాల భూదాన భూములను పేదలకు ఇంటిస్థలాల పట్టాలివ్వాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. భూకబ్జాదారులు వివిధ బోగస్ పత్రాలు చూపి భూమిని ఆక్రమించుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రికార్డులను మార్చి ప్రయివేటు భూములుగా చిత్రీకరించి అక్రమాలకు పాల్పడుతూ కోర్టు వివాదాలు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఆ భూములను రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

విద్యార్థులతో వరల్డ్ క్యాన్సర్ డేపై అవగాహన

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ హెచ్‌ఎం బెన్ని ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ క్యాన్సర్ నివారణా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ (రహీంపుర బ్రాంచ్) విద్యార్థులు క్యాన్సర్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్ల కార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బెన్నీ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కోఠిలో ఈఎన్‌టీ హాస్పిటల్‌లో ఆర్టీసీ చైర్మెన్‌కు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీ (చెవి, ముక్కు, గొంతు) హాస్పిటల్‌లో ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డికి డాక్టర్ రవి శంకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈఎన్‌టీ హాస్పిటల్‌లో వైద్య సేవలు బాగున్నాయని కితాబిచ్చారు. చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడే ప్రజలు ఈ ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

అర్హులకు డబుల్ బెడ్ రూం ఇండ్లివ్వాలి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్





జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అర్జీలు పెట్టుకున్న వారికి వెంటనే డబల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేటాయించే వరకు అర్జీదారులతో కలిసి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరిస్తూ రహమత్ నగర్ ఎస్‌పీఆర్ హిల్స్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ డబల్ బెడ్ రూం ఇండ్లతో పాటు 120 గజాల స్థలంలో రేకులతో నిర్మించుకుని ఉంటున్న వారికి కూడా తక్షణమే రూ.5లక్షలు డిమాండ్ చేస్తూ సీఐటీయూ, డీవైఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, స్థానిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు కుమారస్వామి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. కమలానగర్‌లో పూర్తయిన ఇండ్లను వెంటనే అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన నగరవ్యాప్తంగా డబుల్ బెడ్‌రూం సమస్యను పరిష్కరించాలని చేపట్టనున్న చలో హైదరాబాద్ మహాధర్నాను చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జె.స్వామి, టి.సాయి శేషగిరిరావు, ఆర్.అశోక్, మాలాద్రి, ఏఆర్ నరసింహ, భిక్షపతి, సోమేష్, టి.భాగ్యరాజు, జె.సువర్ణ, సమాధానం, సునీల్ కృష్ణ, బి.దేవదాస్, బి.బాలయ్య, మద్దులేటి, డాక్టర్ రాజు, సి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్ : తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో షేక్ పేట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. నాగలక్ష్మి దీక్షలో కూర్చున్న వారికి పూల దండలు వేసి ప్రారంభించారు. ఆ తర్వాత ప్రభుత్వ విధానాలు, ఇంటి కిరాయిలు కట్టలేక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల గురించి మాట్లాడారు. సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ కార్మికుల సమస్యలు, డబుల్ బెడ్ రూం ఇండ్లు సాధించుకోవడం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలా గురించి మాట్లాడారు. గోపాస్ కిరణ్ డబుల్ బెడ్ రూం ఇండ్లు సాధించుకునే వరకు పోరాడాలని మాట్లాడి దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమించారు. ఈ దీక్షలు పి.శ్రీనివాస్, రాధిక, హైదరాబాద్ జిందాబాద్ ఖైరతాబాద్ జోన్ ప్రెసిడెంట్ మాధవి, కొండల్ రావు, బాలరాజు, డప్పు నర్సి హ్మా, సురేష్, శ్రీకాంత్, కష, లక్ష్మణ్, మన్యం, యాదగిరి, రామస్వా మి, సుశీల, వరలక్ష్మి, సుజాత, లక్ష్మి బస్తీవాసులు పాల్గొన్నారు.

ఈ తరానికి మగ్దూం సాహిత్య స్ఫూర్తిని చాటి చెప్పాలి

- జాతీయ పురస్కార ప్రదాన సభలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

నవతెలంగాణ-ధూల్‌పేట్



సమకాలీన సామాజిక పరిస్థితులలో మగ్దూం సాహిత్య స్ఫూర్తిని మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సుప్రసిద్ధ కవి, శాసనమండలి అభ్యులు గోరటి వెంకన్న అన్నారు. సిటీ కాలేజీ పూర్వ అధ్యాపకులైన మగ్దూం పేరు జాతీయ పురస్కారాన్ని ఉత్తమ సాహితీ వేత్తలకు 2019 నుంచి ప్రదానం చేస్తున్నారు. ఈ పురస్కారాన్ని 2022 సంవత్సరానికిగాను కవి జయరాజుకు, 2023 సంవత్సరానికి గాను ఆంధ్రజ్యోతి సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్దూం తాత్విక చైతన్యాన్ని తమ రచనల ద్వారా చాటి చెప్పున్న కె.శ్రీనివాస్, జయరాజులకు ఈ పురస్కారం ఇవ్వటం అత్యంత సముచితమైన నిర్ణయమని కొనియాడారు. నార్ల వేంకటేశ్వర రావు, ముట్నూరి కృష్ణారావు తర్వాత అంత నిజాయితీ, నిబద్ధతతో ప్రజాస్వామ్య భావజాలానికి ప్రాణం పోస్తున్న ఏకైక సంపాదకులు శ్రీనివాస్ అన్నారు. ప్రకృతి తత్వాన్ని, అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని జయరాజు తన పాటల్లో కవిత్వీకరించాడని చెప్పారు. ప్రజావాగ్గేయకారుల్లో జయరాజు శైలి విశిష్టమైనదన్నారు. మగ్దూం, పోతులూరి వీరబ్రహ్మం, రమణ మహర్షి, వేమన తదితర తత్వకవుల రచనలను అధ్యయనం చేస్తే విద్యార్థుల్లో సంపూర్ణమైన మూర్తిమత్వం వికసిస్తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను తాకట్టుపెట్టి తద్వారా సంపాదన సమకూర్చుకోవటం పాలకులకు మంచిది కాదన్నారు. మీడియా అకాడెమీ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ కవిగా, నాటక కర్తగా, అధ్యాపకుడిగా, అనువాదకుడిగా, కార్మికోద్యమ నాయకుడిగా ఆనాటి తెలంగాణ సమాజంపై మగ్దూం చూపిన ప్రభావానికి నేటికీ ప్రాసంగికత ఉన్నదన్నారు. వర్తమాన పరిస్థితులలో అతని మార్గం అనుసరణీయమన్నారు. తెలంగాణ సాహిత్య పరిణామ క్రమాన్ని తన పరిశోధన గ్రంథంలో శ్రీనివాస్ అద్భుతంగా విశ్లేషించారనీ, ఎంత గొప్ప సంపాదకుడో, అంత గొప్ప సాహితీ వేత్త అని అభినందించారు. వాగ్గేయకారుడిగా ఉద్యమాలలో జయరాజు నిర్వహించిన పాత్ర కీలకమైనదనీ, సమర్థులైన వీరిద్దరికీ మగ్దూం జాతీయ పురస్కారం ప్రదానం చేయడం ఆదర్శనీయమన్నారు. ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం గురించి మగ్దూం చూపిన బాటలో ఇవ్వాళ అందరం నడవాల్సిన అవసరం ఉందన్నారు. పురస్కారాన్ని అందిస్తున్న నిర్వాహకులు, అవార్డు గ్రహీతలు, సిటీ కళాశాల విద్యార్థులు మగ్దూం తాత్విక వారసత్వాన్ని కొనసాగించాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన అవార్డు కమిటీ ఛైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.బాల భాస్కర్ మాట్లాడుతూ మగ్దూం సాహిత్య వ్యక్తిత్వాన్ని, ఉద్యమ కృషిని, అధ్యాపకుడిగా మగ్దూం ప్రబోధించిన జ్ఞానతత్వాన్ని ఈ తరానికి అందజేయాలన్నారు. అతని పేరిట ప్రతి ఏడాదీ ఈ జాతీయ పురస్కారం అందిస్తున్నామనీ, రాష్ట్రంలో మరే కళాశాల ఇలాంటి పురస్కారం అందించటం లేదన్నారు. అవార్డు కమిటీ ఆధ్వర్యంలో గోరటి వెంకన్న, అల్లం నారాయణ, డాక్టర్.బాల భాస్కర్, యాకూబ్ చేతుల మీదుగా కె.శ్రీనివాస్, జయరాజులకు సిటీ కాలేజ్ మగ్దూం మొహియుద్దీన్ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. రూ.10వేల నగదు, జ్ఞాపిక, ధృవపత్రం, శాలువాతో గ్రహీతలను సత్కరించారు. సన్మాన గ్రహీతలు ప్రతిస్పందిస్తూ ఎన్ని అవార్డులు అందుకున్నప్పటికీ మగ్దూం పేరిట సిటీ కాలేజీ ఇచ్చిన అవార్డు ఎంతో ప్రత్యేకమన్నారు. మగ్దూం పట్ల ఉన్న అభిమానం, సిటీ కాలేజీ పట్ల గౌరవం ఇందుకు కారణమన్నారు. ఈ కార్యక్రమాన్ని అవార్డు కమిటీ కన్వీనర్ డాక్టర్.విప్లవ్ దత్ శుక్లా, సభ్యులు డాక్టర్.యాదయ్య, డాక్టర్.రత్న ప్రభాకర్, డాక్టర్.కోయి కోటేశ్వర రావులు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ వెల్చాల కొండలరావు, మగ్దూం కుమారుడు జాఫర్ మొహియుద్దీన్, కొండపల్లి పావన్, పాశం యాదగిరి, మెర్సి మార్గరెట్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు కృషి : ఎమ్మెల్యే కాలేరు



నవతెలంగాణ-అంబర్‌పేట

పార్కుల సుందరీకరణకు కృషి చేస్తామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం రూ.2 కోట్లతో చేపట్టిన వైభవ్ నగర్ కాలనీ అభివృద్ధి పనులను, రూ. 74లక్షలతో పార్కు పనులకు శంకుస్థాపన చేశారు. బాగ్ అంబర్ పేట డివిజన్ వైభవ్ నగర్ కాలనీలో రూ.2 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో ఇప్పటికే కొన్ని పనులు పూర్తికాగా మిగతా పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. బాగ్ అంబర్ పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మ వెంకటరెడ్డితో కలిసి పార్కు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు గాయత్రి టవర్ నుంచి వైభవ నగర వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలనీ, పార్కును అందంగా తీర్చిదిద్దాలనీ, వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వైభవ్‌నగర్ పార్కును రూ. 75 లక్షలతో సుందరంగా తయారు చేస్తున్నామని తెలిపారు. స్థానిక కాలనీవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఈ పార్కును అతి సుందరంగా రూపుదిద్దుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. పార్కులో ఫౌంటెన్, చుట్టూ చైన్ లింక్ మెష్, బల్లలు, పచ్చటి గడ్డి పరుపు, అందమైన మొక్కలు అన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. గాయత్రి టవర్ నుంచి కాలనీ లోపలకు రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం కూడా చేపడుతున్నట్టు పేర్కొన్నారు. సీజన్స్ హాస్పిటల్స్ వద్ద రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిందనీ, గీతా కాన్వెంట్ స్కూల్ దగ్గర రూ. 14 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేసినట్టు తెలిపారు. గాయత్రి టవర్ దగ్గర రోడ్డు నిర్మాణం పూర్తయితే కొన్నేండ్లుగా ఉన్న వరద నీరు నిలిచే సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని వెల్లడించారు. వైభవ్ నగర్‌లో ఎప్పటికీ ఏర్పడే వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కాలనీవాసులు ఒక ఆలోచనకు వస్తే ఆ సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. కాలనీని సమగ్రంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, ఉద్యానవనశాఖ అధికారి హుస్సేన్, కాలనీ ప్రతినిధులు డాక్టర్ చారి, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, సిద్ధార్థ, వేణుగోపాల్ అగర్వాల్, డాక్టర్ హరిచరణ్, కె.వి నారాయణ, డాక్టర్ భగవాన్ రెడ్డి, సురేష్, శ్యాంసుందర్ రెడ్డి, రామ్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అనాథలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది అనాథల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర అనాథల హక్కుల సంస్థ అధ్యక్షులు బొక్క వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో అనాథల కోసం ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ గురుకులాల ప్రారంభం, రిజర్వేషన్లు రాష్ట్ర ఉన్నత అధికారుల సమక్షంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనాథల సంక్షేమంపై నియమించబడ్డ మంత్రివర్గ ఉప సంఘం జనవరి 8, 2022న చేసిన సిఫారసులో ఏ ఒక్క హామీ అమలులోకి రాలేదన్నారు. తెలంగాణలోని అనాథలందరినీ చట్టపరంగా ప్రభుత్వ బిడ్డలుగా గుర్తించడం, కేజీ టూ పీజీ వరకు అనాథల ఉన్నత చదువుకు ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడం, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతోపాటు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం లేని విధంగా అనాథ పిల్లలకు స్మార్ట్ కార్డులు ఇవ్వడం, అనాథలకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించడం, అనాథ పిల్లల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై అలాగే అనాథలచే బిక్షాటన చేయించే వారిపై పీడీ యాక్ట్ కేసులు పెట్టడంతో పాటు అనాథలను అవమానించే వారిపై కఠినమైన చర్యలు తీసుకునేలా అనాథల అవమాన నిరోధక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అనాథ పిల్లల శరణాలయలను ప్రభుత్వ పరిధిలోకి తీసుకొచ్చి వసతులను కల్పించాలనీ, అనాథల సంక్షేమం కోసం ప్రతి ఏడాదీ ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వారికి కోసం ఖర్చు చేసే నిధులను గ్రీన్ ఛానల్‌లో పెట్టి మిగిలిపోయిన వాటిని మరుసటి ఏడాదికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక బాధ్యతగా అనాథలను ఆదుకోవడానికి ముందుకొచ్చి సేవ చేస్తున్న వ్యక్తులను గుర్తించి, మానవతామూర్తి మదర్ థెరిస్సా జన్మదినం రోజున ప్రతి ఏడాదీ వారిని గౌరవిస్తూ సామాజిక సేవా పురస్కారాలు అందించాలన్నారు. రాష్ట్రంలో 2015 నాటికి ఆరు లక్షల మంది అనాథలు ఉన్నారనీ, ప్రభుత్వం వద్ద సమాచారం కూడా ఉందనీ, ఈ 8 ఏండ్ల కాలంలో రెండు విడతలుగా వచ్చిన కరోనా వల్ల తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన మరెంతో మంది పెరిగారని గుర్తు చేశారు. ప్రస్తుతం అనాథలైన పిల్లలు తెలంగాణలో 10 లక్షల మంది వరకు ఉంటారని ఒక అంచనా ఉందనీ, వారందరినీ ప్రభుత్వ బిడ్డలుగా పరిగణలోకి తీసుకుని వారికి అన్ని విధాలుగా చేయూతను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

నిమ్స్ హాస్పిటల్‌లో వరల్డ్ క్యాన్సర్ డే వేడుకలు



వతెలంగాణ-బంజారాహిల్స్

ప్రపంచ మానవాళిని వేధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ప్రధానమైనది క్యాన్సర్ అనీ, ఇది శరీరంలోని ఓ అవయవానికి, కణజాలంలో మొదలయ్యే వ్యాధి అని నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ భీరప్ప అన్నారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచడం, నివారణ, సరైన సమయంలో గుర్తించడం, చికిత్స విధానాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాదీ ఫిబ్రవరి 4వ తేదీన నిమ్స్ హాస్పిటల్‌లో క్యాన్సర్ డేను జరుపుకుంటామని తెలిపారు. క్యాన్సర్ నియంత్రణకు ప్రపంచవ్యాప్తంగా చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. క్యాన్సర్‌ను పారదోలేందుకు అన్ని విభాగాలు ఏకం కావల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది "క్లోజ్ ది కేర్ గ్యాప్" పేరిట వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు క్యాన్సర్ నియంత్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచిత వైద్య సదుపాయాలు అందిస్తున్నట్టు తెలిపారు. మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ గుండేటి సదాశివుడు మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీ సాయంతో క్యాన్సర్‌ని మొదటి దశలో గుర్తించవచ్చు అన్నారు. ఈ వ్యాధిని జయించాలంటే కావల్సింది మెరుగైన వైద్యమే కాక మనోధైర్యం అత్యంత ముఖ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, డాక్టర్ కృష్ణారెడ్డి, ,సర్జికల్ అంకాజీ విభాగాధిపతి డాక్టర్ రాజ శేఖర్, రేడియేషన్ అంకాజీ విభాగాధిపతి డాక్టర్ మోనికా, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతవీర్, డాక్టర్ చెన్నమనేని రచన, మార్తా రమేష్, శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్, నిమ్స్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామ్రేడ్ మగ్దూం స్ఫూర్తిని కొనసాగిద్దాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి. నరసింహ

నవతెలంగాణ-అడిక్‌మెట్



తెలంగాణ సాయుధ పోరాటయోధులు కామ్రేడ్ మగ్దూం స్ఫూర్తిని కొనసాగిద్దాం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కామ్రేడ్ మగ్దూం జయంతి సందర్భంగా టాంక్ బండ్ పై ఉన్న కామ్రేడ్ మగ్దూం విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ కవి, రచయిత, కార్మిక ఉద్యమ నాయకుడు, పీడిత ప్రజల విముక్తి కోసం రాజీలేని పోరాటం చేసిన గొప్ప నాయకుడు కామ్రేడ్ మగ్దూం అని కొనియాడారు. ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ వీఎస్ బోస్ మాట్లాడుతూ కామ్రేడ్ మగ్దూం పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. ఆయన పోరాటాన్ని త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదానికి, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే అసలైన నివాళి అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్ గౌడ్, నెర్ల కంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, కిషన్, యువజన నాయకులు ధర్మేంద్ర, ఉమరాన్, లతీఫ్, సుమంత్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత విద్యలో నిరుపేద విద్యార్థులకు తలెత్తుతున్న సమస్యలపై, వాటి పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మారపు శ్రీకాంత్, తాల్లపల్లి సాయి ఓంకార్, సుధాకర్ పాల్గొన్నారు. నవతెలంగాణ-ఓయూ

ఆంజనేయస్వామి ఆలయ నూతన రథానికి ఎమ్మెల్యే విరాళం

నవతెలంగాణ-అడిక్‌మెట్



ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని ఆంజనేయస్వామి ఆలయంలో నూతన రథాన్ని తయారు చేయడానికి తయారీదారి దశరథచారికి మొదటి విడత రూ.4 లక్షల చెక్కును ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహ, ఈవో దేవనాదం, ఆలయ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ వల్లాల శ్యామ్ యాదవ్, కార్యదర్శి సాయి కృష్ణ, నాయకులు రామచందర్ పాల్గొన్నారు.

ఓయూ పీహెచ్డీ ప్రవేశ పరీక్షలో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-ఓయూ

ఓయూ పీహెచ్డీ ప్రవేశ పరీక్ష 2022లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ విభాగాల వారీగా ఆయా సీట్లను ఆయా కేటగిరి విద్యార్థులకు కేటాయించాలనీ, ఓసీలకు 25శాతం, బీసీలకు 20 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఎలాంటి కనీస అర్హత మార్కులు లేకుండా ఇంటర్వ్యూకు పిలవాలనీ, ప్రవేశ పరీక్షలో ర్యాంకింగ్ విధానాన్ని తీసివేయాలనీ, తర్వాతనే పీహెచ్డీ అడ్మిషన్‌కు సెలెక్ట్ అయిన అభ్యర్థుల జాబితాను ప్రకటించాలనీ, విభాగాల లో ఖాళీల సంఖ్య పెంచాలనీ, ప్రవేశ పరీక్ష కేవలం అర్హత పరీక్ష గానే గుర్తించి ర్యాంకుల విదానాన్ని రద్దు చేయాలని ఓయూ ఎస్సీ, ఎస్టీ ప్రొఫెసర్స్ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ.మంగు నాయక్, ఓయూ యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, బీసీ సెల్ డైరెక్టర్ ప్రొ. వెంకటేశ్వర్లు, లా కళాశాల డీన్ ప్రొ.గాలి వినోద్ కుమార్, తెలుగుశాఖ విభాగాధిపతి ప్రొ.కాసిం, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రొ.చంద్రు నాయక్, ప్రొ.కొండా నాగేశ్వర్ పాల్గొన్నారు.

ఓసీ పేదల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



గత ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చినట్టుగా రెడ్డి, వైశ్య కులాల్లోని పేదల సంక్షేమం కోసం, ఓసీలోని ఇతర వర్గాల పేదల అభ్యున్నతికి సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్ లో ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్‌లోని సమాఖ్య కార్యాలయంలో ఓసీ సంఘాల జేఏసీ ప్రతినిధుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రూ.5 వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్, వెయ్యి కోట్లతో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఇతర ఓసీ సామాజిక వర్గాల పేదల సంక్షేమానికి మరో వెయ్యి కోట్లను బడ్జెట్‌లో కేటాయించి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చా లని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఓసీ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. గత హుజురాబాద్ ఉప ఎన్నికల సమయంలో మంత్రి హరీష్ రావు ఓసీ పేదల సంక్షేమానికి ప్రత్యేక నిధులతో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీల ను నేటికీ నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ బడ్జెట్‌లోనైనా మంత్రి హరీష్‌రావు మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపు జయపాల్ రెడ్డి, రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అప్పమ్మగారి రాంరెడ్డి, ఆర్యవైశ్య ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బుస్సా శ్రీనివాస్, వెలమ సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నమనేని పురుషోత్తమ రావు, కమ్మ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగవ రపు రామకృష్ణ ప్రసాద్, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు తాడిశెట్టి పశుపతి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



నవతెలంగాణ-బేగంపేట్

గంజాయి మత్తుపదార్ధాలను జనరల్ స్టోర్‌లో, టీ స్టాల్‌లో విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఇద్దరు వ్యక్తులను సికింద్రాబాద్ ఎక్సైజ్ సిబ్బంది శనివారం అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ నవనీత తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లా పూర్‌కు చెందిన ఇద్దరు సోదరులు ఆలీ, బషీర్ మహమ్మద్‌లు పారడైజ్ చౌరస్తాలో హెూండా యాక్టివా మీద వచ్చి గంజాయి మత్తు పదార్ధాలను అమ్ముతున్నారన్న సమాచారంతో అధికారులు అక్కడకు చేరుకుని వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఒక కిలో ఒక గ్రాము గంజాయి రెండు గ్రాముల పాపోస్ట్రీ, రెండు సెల్ ఫోన్‌లు, ఒక యాక్టివ్ హెూం డా సాధీనం చేసుకున్నారు. ఎస్సైలు ప్రేమ్ కుమార్ రెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రసాద్, మధులతలను సీఐ అభినందించారు.

క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ర్యాలీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఆంగ్ర పీఠాధిపతి పూల ఆంథోని సూచనల మేరకు హైదరాబాద్ ఆర్చ్ దయానిస్ సోషల్ సర్వీస్ సొసైటి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ ఆంటోని పర్యవేక్షణలో "స్నేహ హస్తం" వారి ఆధ్వర్యంలో సెంట్ మేరీ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సెంట్ మేరీ పాఠశాల నుంచి సంగీత సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో విద్యార్థులు ప్ల కార్డులను చేతబట్టుకుని నినాదాలు చేశారు. క్యాన్సర్ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెబుతూ ర్యాలీని కొనసాగించారు. మెడను అంథోనీ తదితరులు ప్రతినిధులు పాల్గొన్నారు

సంక్షేమ బోర్డు ఏర్పాటుపై అసెంబ్లీలో ప్రకటన చేయాలి

- ఎంవీ యాక్ట్-2019ను సవరించాలి
- కేరళ సవారి యాప్ తరహా యాప్‌ను తేవాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్
- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తూ వెంటనే అసెంబ్లీలో ప్రకటన చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏఐఆంటీడబ్ల్యూఎఫ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మందికిపైగా రవాణా కార్మికులు పనిచేస్తుండగా, ప్రధానంగా ఆటో ,టాక్సీ ,క్యాబ్, గూడ్స్ రవాణ, స్కూల్, ప్రయివేటు బస్సులు వంటి వాటిలో డ్రైవర్స్, క్లీనర్లు, మెకానిక్ తదితర కార్మికులుగా ఉన్నారన్నారు. వీరికి ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా.. చలాన్లు, పెనాల్టీలు, ఫీజులు పెంచుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా కార్మికుల పరిస్థితుల్లో మార్పుల కోసం ఈ అసెంబ్లీ సమావేశాల్లో సంక్షేమ బోర్డు ఏర్పాటును ప్రకటించాలన్నారు. ఎంవీ యాక్ట్- 2019ను సవరించడంతో పాటు కేరళ సవారి యాప్ తరహా యాప్‌ని రాష్ట్రంలో ప్రభుత్వమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 7వ తేదీన చలో ఇందిరాపార్కు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, డ్రైవర్ సోదరులు వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వెంకటేష్ కోరారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు ఎదైనా ప్రమాదం జరిగి గాయపడి అంగవైకల్యలమైన, అనారోగ్యం పాలైన ఎటువంటి సహాయం ఉండదని, ఆ సమయంలో పని, ఆదాయం ఉండకపోగా.. ఖర్చులు అధికంగా ఉంటాయన్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తుందని, అప్పులు తీర్చలేక జీవితకాలమంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం అక్కడి రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి పాటుపడుతుందని గుర్తుచేశారు. తెలంగాణలోనూ సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ఈ అసెంబ్లీ సమావేశాలలో ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి కె.అజయ్ బాబు మాట్లాడుతూ ప్రయివేట్ అగ్రిగేటర్స్ సంస్థల దోపిడీ నుంచి కేరళ ప్రజలను కాపాడటం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం సవారి అనే యాప్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తుందని, అదే తరహాలో మనరాష్ట్రంలోనూ ప్రభుత్వమే ఒక యాప్‌ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏఐఆర్‌టీడబ్లూఎఫ్ సౌత్ కమిటీ కార్యదర్శి ఎల్.కోటయ్య మాట్లాడుతూ కార్మికులందరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ పది లక్షల రూపాయలు ఇవ్వాలని, అర్హులైన వారికి డబుల్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల జీవో 25ను వెంటనే గెజిట్‌గా మార్చి అమలు చేయాలన్నారు. అంతకు ముందు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు ప్రతినిధుల బృందం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నగర అధ్యక్షుడు ఎండీ ఆసీఫ్, ఉపాధ్యక్షులు ఎండీ అలీ, లక్ష్మణ్, సౌత్ అధ్యక్షుడు బాబా, బాబర్ ఖాన్, సిటీ నాయకులు అబ్దుల్ నబి, మోయిన్, అల్లాబకాశ్, వాహీద్, హరిచారి, కె.సతీష్, హైదర్, లింగనాయక్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలు చేపట్టబోం



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలు తాము ఎప్పుడు చేపట్టబోమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం ఆయన సనత్ నగర్ డివిజన్‌లోని జెక్ కాలనీలో చేపట్టిన ఆర్బి నిర్మాణ పనులను పరిశీలించేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కొందరు ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టవద్దని మంత్రిని కోరారు. దాంతో స్పందించిన మంత్రి తమకు అలాంటి ఆలోచన లేదని, రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఉన్న ఫుట్ పాత్‌ను మాత్రమే తొలగించి నూతనంగా నిర్మిస్తున్న ఆర్బి నుంచి హనుమాన్ దేవాలయం వరకు నూతన వీడీసీసీ రోడ్డును నిర్మించడం జరుగుతుందని వివరించారు. తాను సనత్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాతనే ఈ ప్రాంతం ఎవరూ ఊహించని విధంగా ఎంతో అభివద్ధి చెందిందని, అనేక పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించినట్టు వివరించారు. జెక్ కాలనీ వాసులకు తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తున్నానని చెప్పారు. సబ్ స్టేషన్ వద్ద రోడ్డు విస్తరణ, స్ట్రీట్ నెంబర్ 1లో రోడ్డు నిర్మాణం, పార్క్ అభివద్ధి వంటి పలు పనులు పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంకా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. మంత్రి వెంట కార్పొరేటర్ కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, జోనల్ కమిషనర్ రవి కిరణ్, జెక్ కాలనీ అధ్యక్షులు సూర్య శంకర్ రెడ్డి, రాఘవయ్య, సురేష్ గౌడ్, డీసీ మోహన్ రెడ్డి, ఈఈ ఇందిర, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాటలు వేయాలని ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి సూచించారు. కుషాయిగూడ చక్రిపురం కాలనీలోని శ్రీ చక్రి విద్యా నికేతన్ 34వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యత పెంచుకోవాలన్నారు. విద్యార్థులు పెడమార్గాలు పట్టకుండా వారి తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. 34 ఏండ్లుగా విద్యా ప్రమాణాలు పాటిస్తూ వేల మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన శ్రీ చక్రి విద్యానికేతన్ యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అతిథిగా విచ్చేసిన స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా పట్టుదలతో చదివితే ఎంచుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చు అన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు, ఈ విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ చక్రి విద్యానికేతన్ ఫౌండర్ చైర్మెన్ మొలుగు ప్రతాపరెడ్డి, కరస్పాండెంట్ స్వర్ణలత, ప్రముఖ వైద్యులు డాక్టర్ మొలుగు చక్రధర్ రెడ్డి, డాక్టర్ రష్మీ, పాఠశాల ప్రిన్సిపాల్ లీలా భ్రమరా, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

- మాదాపూర్ డీసీపీ శిల్ప వల్లి
- ఏఓఐ ఆధ్వర్యంలో 4కే వాక్



నవతెలంగాణ-సిటీబ్యూరో



క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి ముంద స్తుగా గుర్తించి వైద్యం అందిస్తే రోగం నయమ వుతుందని మాదాపూర్ డీసీపీ శిల్ప వల్లి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా నల్లగండ్లలో గల అమె రికన్ అంకాలజీ ఇన్స్టిట్యూట్ ఆస్పత్రి, సీటీజెన్ ఆస్పత్రి ఆధ్వ ర్యంలో నిర్వహించిన 4కే వాక్‌ను డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ క్యాన్సర్‌తో బాధప డుతున్న వారికి మనోధైర్యాన్ని అందించాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగంలో దేశం ఎంతో అభివద్ధి చెందిందని, వైద్య విధానంలో గణనీయమైన అభివద్ధి సాధించిందని, ఎటువంటి రోగాలనైనా పసిగట్టు గల సాంకేతికత అందు బాటులోకి వచ్చిందన్నారు. క్యాన్సర్ వ్యాధిపై వివిధ మాధ్య మాల ద్వారా జరుగుతున్న ప్రచారాలను అర్థం చేసు కొని ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్పొరేట్ ఆస్పత్రులపై ఉందన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగిన నాడే రోగాన్ని నయం చేయగలమని సూచించారు. అనంతరం ఆస్పత్రి ఆర్‌సీఓఓ డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలను అందించేం దుకు ఆస్పత్రి నిరంతరం అధిక ప్రాధాన్యత ఇస్తుంద న్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమా లను నిర్వహించేందుకు అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ ఎల్లప్పుడూ ముందుం టుందని తెలిపారు. ఈ సందర్భంగా నల్లగండ్ల నుండి బీహెచ్‌ఈ ఎల్ చెక్ పోస్ట్ వరకు వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, ప్రజలతో కలిసి ప్ల కార్డులను చేతబట్టి క్యాన్సర్‌పై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిటి జెన్ ఆస్పత్రి ఫెసిలిటీ డైరెక్టలు ప్రవీణ్ కుమార్, అంకిత తోపాటు పలు విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



రూ. 4.79కోట్లతో ప్రధాన రహదారి పనులు

- మేయర్ మేకల కావ్య

నవతెలంగాణ-జవహర్ నగర్

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రధాన రహదారి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, ప్రజల కష్టాలు తీరుతాయని మేయర్ మేకల కావ్య అన్నారు. శనివారం జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని ప్రధాన రహదారి పనులను హెచ్‌ఐఆర్‌డీసీఎల్ అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రధాన రహదారి పనులతో కార్పొరేషన్ దశదిశమారుతుందని, శరవేగంగా పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్‌ను కలిసిన అసోసియేషన్ సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

వి.యస్ రెడ్డి నగర్ కాలనీ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్‌లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు శనివారం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ రావును, కార్పొరేటర్ బొంతు శ్రీదేవిను కలిసి వారి కాలనీ సమస్యల గురించి విన్నవించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు రామ్ రెడ్డి, ఉపాధ్య క్షుడు వాసుదేవరెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బుచ్చిరెడ్డి బాల్‌రెడ్డి, లక్ష్మణ్ సింగ్, రామచంద్రారెడ్డి, అడ్వైజర్ లక్ష్మారెడ్డి, జాయింట్ సెక్రటరీ సూర్య భగవాన్ తదిత రులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ నిర్మాణ పనులు మొదలు పెట్టాలి

నవతెలంగాణ- నేరేడ్‌మెట్



నేరేడ్‌మెట్ వాజ్‌పేయ్ నగర్‌లో ఆర్‌యూబీ నిర్మాణ పనులు త్వరగా మొదలు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. శనివారం మల్కాజిగిరి బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ కమిటీ, యూత్ కాంగ్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఆర్‌యూబీ నిర్మాణ పనుల విష యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని మండి పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇక్కడ ఆర్‌యూబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగినా నేటికీ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో వీసమెత్తు పని జరగలేదని ఆరోపించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. సికింద్రాబాద్ మెట్టుగూడ వెళ్లేందుకు ఇది ప్రధాన దారి అని, ఒక్కసారి రైలు గేటు పడిందంటే కనీసం 30 నిమిషాల వరకు ట్రాఫిక్ జామ్ అవుతుందని తెలిపారు. ఎంఎంటీఎస్ పూర్తయితే 10 నిమిషాలకు ఒకసారి గేటు పడే అవకాశం ఉంటుందని, కావున ఆర్‌యూబీ తొందరగా పూర్తి చేయాలని కోరారు. రూ 23 కోట్ల బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం, 50 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వంతో ఈ పనిని పూర్తి చేయాల్సి ఉండగా స్థానిక ఎంపీ రేవంత్ రెడ్డి చొరవతో కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు అమలు చేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మిగతా 50 శాతం నిధులు కేటాయించకపోవడం వల్లనే ఈ పని జరగడం లేదని విమర్శించారు. మల్కాజిగిరి బి బ్లాక్ ప్రెసిడెంట్ జీడి శ్రీనివాస్ గౌడ్, మీడియా కన్వీనర్ గుత్తి రామచందర్, వి. శ్రీనివాస్ గౌడ్, యువత అధ్యక్షులు రెబ్బ వాసు, ఉపాధ్యక్షులు జే కే. సాయి ప్రసాద్, కే.రాము లు, ఎమ్మార్ శ్రీనివాస్, సానాది శంకర్, బుచ్చిబాబు, వేణు, నరసింహ గౌడ్, హనుమంత్, రవి ,సాయి, ఫరీద్, ప్రవీణ్, అవినాష్, సురేష్ యాదవ్, రుక్మత్, రజనీకాంత్, చరణ్ , ప్రమోద్ యాదవ్, బ్రహ్మ, జయ రాములు, వినో ద్ గౌడ్, బాలు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెస్లీ డిగ్రీ కళాశాలలో ఘనంగా వెస్కాన్ ఫెస్ట్

నవతెలంగాణ-బేగంపేట్



నాణ్యమైన విద్యను అందించడంలో 38 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సికింద్రాబాద్‌లోని వెస్లీ డిగ్రీ కళాశాలలో వెస్కాన్ ఫెస్ట్ రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్ ఆర్ జయకుమార్ హాజరయ్యారు. అనంతరం నేటి సమాజంలో జరుగుతున్న అవినీతిని అరికట్టడంలో యువత బాధ్యత గురించి ప్రసంగించారు. ఫెస్ట్‌లో జంటనగరాలలోని వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక, సైన్స్, ఆర్ట్ అండ్ కామర్స్, కమ్యూనికేషన్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విభాగాలలో వివిధ పోటీలు నిర్వహించగా విజేతలకు వెస్లీ కళాశాల డెరెక్టర్, డా.బి. విమల్, ప్రిన్సిపాల్ సుకుమార్ బహుమతులు అందజేశారు. డా రెగోని, శ్రవీన్ కృపాకర్ , జి జె జయరాజ్, సిబ్బంది, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



అంత్యక్రియలకు మున్సిపల్ చైర్మెన్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

నాగారం మున్సిపాల్టీ, రాంపల్లి గ్రామంలోని మీసాల నవీన్ (మున్సిపల్ సిబ్బంది) తండ్రి మీసాల భిక్షపతి శనివారం అనారోగ్యంతో మతి చెందడంతో వారి కుటుంబాన్ని మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పరామర్శించారు. అలాగే అంత్యక్రియల నిమిత్తం రూ. 10,000 నగదును అందజేశారు. పేద ప్రజలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు

కాలనీలో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలో స్వామి వివేకానంద నగర్ కాలనీలో నెలకొన్న భూగర్భ డ్రయినేజీ సమస్య రోడ్లు తదితర సమస్యలపై కాలనీ వాసుల కోరిక మేరకు జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో, కాలనీ వాసులతో కలిసి స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి శనివారం పర్యటించారు. భూగర్భ డ్రయినేజీ పైపు లైను పరిమాణం పెంచి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ రూపా, ఏఈ శ్రవంతి, స్థానికులు నెమలి రవి, ఫైళ్ల ప్రవీణ్, సనాల రవి, శ్యామసుందర్ రెడ్డి, బుచ్చమ్మ, రఘు, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు



క్యాన్సర్‌ను జయించిన వారికి రెనోవ సౌమ్య ఆస్పత్రి సన్మానం



నవతెలంగాణ-కంటోన్మెంట్

వివిధ రకములైన క్యాన్సర్ బారిన పడి కార్ఖానా రెనోవా సౌమ్య క్యాన్సర్ హాస్పిటల్‌లో వ్యాధిని జయించిన విజేతలను ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెనోవా సౌమ్య క్యాన్సర్ హాస్పిటల్‌లో శనివారం ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ముందుగా క్యాన్సర్‌ను జయించిన ఆర్ మల్లిక (రొమ్ము క్యాన్సర్), చిన్న మల్లయ్య (బ్లడ్ క్యాన్సర్), అక్కిశెట్టి (ప్రొస్టేట్ క్యాన్సర్), ఎ గిరిజ (రొమ్ము క్యాన్సర్), సంధ్య గోస్వామి (హెడ్ అండ్ నెక్), హిమబిందు (బోన్ క్యాన్సర్) లకు హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది ప్రత్యేకంగా సన్మానించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ అండ్ చీఫ్ ఆఫ్ మెడికల్ ఆంకాలజీ సర్వీసెస్ డా. పాలంకి సత్య దత్తాత్రేయ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధికి నేడు పలు ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శస్త్ర చికిత్సతో పాటూ మందులను వినియోగించి అందించే కీమో థెరపీ చికిత్సలతో క్యాన్సర్‌ను నయం చేయవచ్చని తెలిపారు. దీంతో పాటూ అవసరమైన వారికి రేడియేషన్ థెరపీ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. క్యాన్సర్ వ్యాధిపై పోరాటమనేది కేవలం రోగి లేదా వైద్యుడు కలసి చేసేది కాదని అందుకు కుటుంబ సభ్యులు, ఇతర వైద్య, నర్సింగ్ సిబ్బంది సహకారం ఎంతో ముఖ్యమని అన్నారు. అనంతరం హెచ్‌ఓడీ డా. యుగందర్ శర్మ, సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ వారు మాట్లాడుతూ రేడియేషన్ థెరపీ పై ఎన్నో అపోహలు ఉన్నాయన్నారు. క్యాన్సర్ వస్తే బతకరనే భావన ఉందని కానీ అది తప్పన్నారు. వ్యాధి గుర్తించిన వెంటనే మంచి వైద్యుని సంప్రదించి మంచి చికిత్స తీసుకొంటే తప్పక వ్యాధిని జయించవచ్చని తెలిపారు. అనంతరం క్యాన్సర్ విజేత ఏ గిరిజ మాట్లాడుతూ వ్యాధి వచ్చిన తర్వాత మనకు ఏర్పడిన అనుభవాలను ఇతరులతో పంచుకొని తద్వారా వారికి ధైర్యం చెప్పడమనేది ఎంతో ముఖ్యమన్నారు. క్యాన్సర్ వచ్చిన తర్వాత రోగికి తనపై తనకు నమ్మకం ఉంచుకోవాలని వైద్యుని సూచనలు తప్పక పాటించాలని సూచించారు. తర్వాత రొమ్ము క్యాన్సర్ ను జయించిన ఆర్ మల్లిక మాట్లాడుతూ వ్యాధి వచ్చిన వెంటనే కంగిపోకుండా సరైన చికిత్స తీసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు అలాగే పలువురు విజేతలు క్యాన్సర్ వ్యాధి గురించి చికిత్స గురించి మాట్లాడారు కార్యక్రమంలో రెనోవా సౌమ్య క్యాన్సర్ హాస్పిటల్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్టు డా. లలితా రెడ్డి, సెంటర్ హెడ్, చీఫ్ ఆఫ్ టెక్నాలజీ జనార్ధన్ నందిగాం, ఇతర వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా దేశగోని శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-బోడుప్పల్

బోయినపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పీర్జాదీగూడ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన దేశ గౌని శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటు చేసిన పాలక వర్గంలో ఈ విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అనేక ఎండ్ల నుంచి బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం పని చేసినందుకు గాను తనకు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పదవీ రావడానికి సహకరించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రి రాజశేఖర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దర్గా దయాకర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



నవతెలంగాణ -ఎల్బీనగర్

న్యూ దిల్ సుఖ్ నగర్ కాలనీలో ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం స్థానిక కార్పొరేటర్ రంగ నరసింహ గుప్తా అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో మంచి నీటి సమస్యను అడిగి తెలుసు కున్నారు. విధి లైట్‌లు రాత్రి వేళ ఎలా వెలుగుతున్నాయా అని స్థానికులను అడిగారు. కాలనీలో దోమలు నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారి డీఈ నీలిమ, ఇంజనీరింగ్ డీఈ నవీన్, ఎలక్ట్రిసిటీ ఏ ఈ రోహిత్ రెడ్డి, వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, జీహెచ్ఎంసీ స్ట్రీట్ లైట్స్ జితేందర్, ఎంటమాలజీ అధికారి రుక్కయ్యలు కాలనీ వాసులతో కలసి పర్యటించి స్థానిక సమస్యల కోసం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

అవగాహన ద్వారా క్యాన్సర్‌ను జయించండి

- హైదరాబాద్ చీఫ్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుకయారా పిలుపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్యాన్సర్‌పై సరైన అవగాహన కలిగి ఉండటం ద్వారా తగు జాగ్రత్తలు తీసుకుంటూ సకాలంలో క్యాన్సర్‌ను గుర్తించి, క్యాన్సర్‌ను జయించవచ్చని సిటీ సివిల్ కోర్ట్ చీఫ్ జడ్జి, హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుకయారా అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పురాణ హవేలీలోని సిటీ సివిల్ కోర్టులో క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జడ్జి రేణుకయారా మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో ఎలాంటి సమస్యనైనా పరిష్కరించవచ్చని, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులను సైతం గుండె ధైర్యంతో ఎదుర్కోవాలని అన్నారు. తొలుత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ క్యాన్సర్ బాధితుల కోసం, ఎంఎస్‌జే క్యాన్సర్ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ కోసం రక్తదాన శిబిరాన్ని న్యాయమూర్తి రేణుకయారా ప్రారంభించారు. రక్తదాన శిబిరం అనంతరం న్యాయమూర్తులకు, న్యాయశాఖ సిబ్బంది, మహిళలకు ఏర్పాటుచేసిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో అపోలో వైద్యశాల సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ అజేష్ రాజ్ సక్సేన, డాక్టర్ మాధురి, ఎంఎస్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ లక్ష్మి తదితరులు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ద్వారా వైద్యులు, క్యాన్సర్ రావడానికి గల కారణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించే విధానాలు వివరించారు. పొగాకు ఉత్పత్తులకు ఫాస్ట్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలని, తాజా కూరగాయలను తీసుకుంటూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యకరమైన జీవన విధానాలను అవలంబించాలని సూచించారు. 21 సంవత్సరాలు దాటిన మహిళలు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవడం తొలిదశలో క్యాన్సర్‌ను గుర్తించడానికి ఉపయోగపడుతుందని, తద్వారా సకాలంలో తగిన చికిత్స పొంది క్యాన్సర్ నుండి విముక్తి పొంద గలరని అన్నారు. మద్యం, పొగాకు వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చని, ఒకవేళ క్యాన్సర్ బారినపడ్డా తగు చికిత్సతో ధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని డాక్టర్ అజయ్ సక్సేన వివరించారు. మహిళలు రొమ్ము క్యాన్సర్ స్వీయ పరీక్ష ద్వారా పరిశీలించుకునే విధానాలను డాక్టర్ మాధురి వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే.మురళీమోహన్ మాట్లాడుతూ ప్రతీ పౌరుడికి ఆరోగ్యంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించిందని, ఆ హక్కు సక్రమంగా వినియోగించుకునేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ క్యాన్సర్ అవగాహన సదస్సులు, ఎంఎస్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ప్రజలకు పేదలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుందని వివరించారు. కార్యక్రమంలో క్యాన్సర్ రోగులకు సేవలు అందిస్తున్న వైద్యులను చీఫ్ జడ్జ్ రేణుక సన్మానించారు. రక్తదాన శిబిరంలో ఏఐపీఐఎఫ్ సంస్థ సభ్యులు నూరుద్దీన్, సిటీ సివిల్ కోర్టు న్యాయశాఖ సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ సిబ్బంది , పారా లీగల్ వాలంటీర్లు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి
- భూ పోరాట ప్రాంతం సందర్శన



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

ఎన్నికలో ఇచ్చిన హామీలల్లో భాగంగా 125 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, అందుకు పక్కా ఇంటి నిర్మాణం కోసం ఈ బడ్జెట్ సమావేశంలో ఐదు లక్షల రూపాయలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద అంబర్ పేట మున్సిపల్, కుంట్లూరులోని పాపయ్య గూడ లోని భూ పోరాటం ప్రాంతాన్ని శనివారం ఆయన సందర్శించారు.ఈ. సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బతుకు దెరువు వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన పేదలకు నివాసం లేక ఇంటి అద్దెలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హైదరాబాద్ నగరం చుట్టూ ప్రభుత్వ భూములు బడా బాబులు ఆక్రమించుకొని అమ్ముకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అదే పేదవాడు తలదాచుకుందామని గూడు ఏర్పాటు చేస్తే అధికారులు దాడులు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ లో భూపోరాటాల ద్వారా అనేక ప్రాంతాల్లో పేదల నివాస స్థలాలని ఇప్పించిన ఘనత సీపీఐకి దక్కిందన్నారు.పెద్ద అంబర్ పేట మున్సిపల్, కుంట్లూర్ సర్వేనెం. 215 నుంచి 224 లో భూదాన భూమిలో పేదలు గుడిసెలు వేసుకొని 14 రోజులు అయిందని, ఇక్కడి ప్రజలకు సరియగు మౌలిక వసతులు లేక చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, స్థానిక ఎమ్మెల్యే , స్థానిక ప్రజాప్రతిధులు ప్రత్యేక చొరవ తీసుకొని వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భూదానోద్యమ నాయకులు వినోబా స్ఫూర్తితో కుంట్లూర్‌లో సీపీఐ భూ పోరాటం నిర్వహిస్తుందన్నారు. నిజమైన పేదలు ఈ పోరాటంలో భాగం పంచుకోవాలన్నారు. తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి ఈ భూమి తనదేనంటూ ప్రగల్భాలు పలికే వ్యక్తులు వెనక్కి వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. నిజాలను/ వాస్తవాలను గుర్తించి అందుకు సంబంధించిన భూ డాక్యుమెంట్లను పరిశీలించి పేదలకు ఇండ్ల స్థలాలకై భూమిని పంచడానికి రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. బహిరంగ సభకు వచ్చిన వేలాది ప్రజలను చూసి వారికి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ దిశానిర్దేశిని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న భూ పోరాట తీరుతెన్నులు, ప్రజల అవస్థలు వాస్తవాలని సీఎం కేసీఆర్ దృష్టికి సీపీఐ బృందం తీసుకెళ్తుందన్నారు.ఈ ప్రజా ఉద్యమ పోరాటం విజయవంతం కావాలని ,ప్రజలు మరింత సంఘటితంగా ఉద్యమించాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా , జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు చందు నాయక్, జిల్లా సమితి సభ్యులు మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్ నాయక్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేణుగోపాల్‌చారి మండలం నాయకులు : ఏషాల నరసింహ పొన్నాల యాదగిరి, కేతరాజు నరసింహ, నారాయణ, నారాయణరెడ్డి, నవనీత అరుణ దేవమ్మ సుజాత సక్రూ నాయక్, శ్రీదేవి, లక్ష్మి సుభద్ర, వెంకటేష్ మహేందర్ పాల్గొన్నారు.

పిల్లలు బాల్యం నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

- సినీ హీరో కార్తికేయ, నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ గుమ్మడికొండ విఠల్ రెడ్డి
- నాగార్జున మౌంటెస్సోరి ఐఐటి స్కూల్ వార్షికోత్సవం



నవతెలంగాణ-మీర్‌పేట్

పిల్లలు బాల్యం నుంచే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ గుమ్మడికొండ విఠల్ రెడ్డి, సినీ హీరో కార్తికేయ అన్నారు. శనివారం మీర్‌పేట్ నాగార్జున మౌంటెస్సోరి ఐఐటి స్కూల్ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ హీరో కార్తికేయ, నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ గుమ్మడికొండ విఠల్ రెడ్డిలు మాట్లాడుతూ నేడు అన్ని రంగాల్లో పోటీతత్వం పెరిగిందని దాంట్లో నెగ్గాలంటే చిన్ననాటి నుంచి పోటీతత్వం అలవర్చుకోవాలని అన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వెలికితీసి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు మార్కులు సాధించడానికి జవాబులను బట్టీ పట్టించకుండా పరిజ్ఞానాన్ని పెంపొందించే పద్ధతిలో తమ పాఠశాలలో బోధన చేస్తున్నట్లు తెలిపారు. అందుకే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద ఉత్తీర్ణత సాధిస్తున్నామని పేర్కొన్నారు. విద్యతోపాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, భావవ్యక్తీకరణలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల పట్ల శ్రద్ధ వహించాలని, మొబైల్ ఫోన్ లకు దూరంగా ఉంచాలని సూచించారు. గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులకు ఐదు వేల రూపాయల చొప్పున ప్రోత్సాహకం అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్మెన్ రజని విఠల్ రెడ్డి, డైరెక్టర్ లోహిత కార్తికేయ రెడ్డి, సీఏఓ శేషారావు, అకాడమిక్ డీన్ రాజశేఖర్, ప్రిన్సిపల్ మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ-హయత్ నగర్

ఈ నెల 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షి దారులు సద్వినియోగం చేసుకుని వారి సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చు అని 24వ జూనియర్ సివిల్ హయత్ నగర్ జడ్జి చందన, 7వ స్పెషల్ హయత్ నగర్ జడ్జి సుజాత అన్నారు. శనివారం హయత్ నగర్‌లో ఏర్పాటు చేసిన ప్రీ లోక్ అదాలత్ కార్యక్రమం సందర్భంగా అక్కడికి విచ్చేసిన వారు కక్షి దారులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షణికావేశానికి లోనై గొడవలు పడి పదే పదే స్టేషన్ మెట్లు ఎక్కడం వలన విలువైన డబ్బు, సమయం వథా అవుతుందే తప్పా అంతకు మించి ఎం సాధించరని పేర్కొన్నారు. పలు కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారి కోసం 11న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సైతం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ అరుణోదయ కుమార్, నూతన్, హయత్ నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటేశ్వర్ రెడ్డి, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి, హయత్ వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌లు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, స్వామి, బెంచ్ మెంబర్లు రామ్ మోహన్, సురేందర్ రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదు

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

క్యాన్సర్ వ్యాధి నేటి సమాజంలో ప్రాణాంతకమైన వ్యాధి కాదని రోగులు ధైర్యంతో ఉంటే జయించవచ్చునని బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలో ఉన్న 18వ డివిజన్ లోని సాయినగర్ లో చవాన్ ఆస్పత్రి సహకారంతో ఆస్పత్రి ఆవరణలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి స్థానిక కార్పొరేటర్ మనోహర్‌తో కలిసి పాల్గొని క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. మేయర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, వ్యాధి లక్షణాలు తెలుసుకొని ముందు జాగ్రత్త చర్యగా డాక్టర్ ను సంప్రదించి వారి సలహాలను సూచనలను పాటించాలని సూచించారు. మద్యపానం, దూమపానం, టొబాకో వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు.వ ఖుందు జాగ్రత్త చర్యగా డాక్టర్ సలహా మేరకు ప్రతి రోజు పండ్లు తినటం,బాగా మంచినీటిని తాగటం, వ్యాయామం చేయడం వల్ల క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చునని తెలిపారు.అనంతరం క్యాన్సర్ బాధితులను సన్మానించారు. శ్లోకా స్కూల్ విద్యార్థులు క్యాన్సర్ నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. టీకేఆర్ కళాశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఉదయ్ చవాన్, వినయ్ చవాన్, భాగ్యలక్ష్మి చవాన్,గాయిత్రి చవాన్,త్రివిక్రమ్, అజీమ్, నాయకులు, మహిళలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిజాత నర్సింహారెడ్డికి మేయర్ పదవి మంత్రి భిక్ష

- రూ.472 కోట్ల ప్రత్యేక నిధులతో మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి
- బీఆర్ఎస్ బడంగ్‌పేట్ మున్సిపల్ అధ్యక్షులు రాంరెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి చిగురింత పారిజాత నర్సింహారెడ్డికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి బిక్షని, గడిచిన మూడు సంవత్సరాల కాలంలో మంత్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ అభివద్ధి పనుల కోసం రూ.472కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అభివద్ధికి చేయించారని బీఆర్ఎస్ కార్పొరేటర్ల త్యాగంతోనే మీరు మేయర్ గా కొనసాగుతున్నారని బీఆర్ఎస్ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్లు అన్నారు. శనివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పెద్దబావి మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ల అభివద్ధి, సంక్షేమం కోసం ఎంతో కషి చేస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో కార్పొరేటర్‌గా గెలిచిన మీకు(పారిజాత నర్సింహారెడ్డి) మంత్రి సబితా ఇంద్రారెడ్డి మేయర్ పదవి ఇవ్వటం జరిగిందన్నారు. గత మూడు సంవత్సరాల కాలంలో ఇంటి ట్యాక్సీలు అధికంగా ఉన్నాయనే విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు.ఏనాడు కౌన్సిల్ సమావేశంలో ఇంటి ట్యాక్సీలు అధికంగా ఉంటాయనే విషయం తమతో చర్చించలేదని తెలిపారు. మంత్రిని ఏక వచనంతో సంబోధించడం మీ విజ్ఞతకు వదలి వేస్తున్నామన్నారు. అధికార పార్టీలో మంత్రి గౌరవం ఇవ్వలేదని పార్టీ మారినట్టు చెప్పటం హాస్యాస్పదంగా ఉందని, ఎమ్మెల్యే పదవి కాంక్షతోనే పార్టీ మారినట్లు విమర్శించారు. మంత్రి అభివద్ధిని అడ్డుకున్నారని చెప్పటం దురదష్టకరమన్నారు. మంత్రి కేటీఆర్ బడంగ్ పేట్ కు వచ్చిన సమయంలో అభివృద్ధి నిధుల కోసం కలవకుండా మంత్రి అడ్డుకున్నారని చెప్పటం ఏమిటని ప్రశ్నించారు.కాల్వల నిర్మాణం కోసం మంత్రి ఎస్ఎన్‌డీపీ నిధులు మంజూరు చేయించారని,ఆ విషయం వక్రీకరించి మున్సిపల్ నిధులతోనే అభివద్ధి పనులు చేశామనిజజ మంత్రి ప్రత్యేక నిధులు మంజూరు చేయించలేదని అంటున్నారన్నారు. మీరు చేసే వ్యవహారం మొత్తం తల్లి పాలు తాగి రొమ్ము పై కొట్టినట్టుగా ఉందన్నారు. అభివద్ధి పనుల కోసం ఏర్పాటు చేసిన శిలా ఫలకాలపై మొత్తం మున్సిపల్ సాదారణ నిధులే ఉంటాయని చెప్పటం ఏమిటని ఆ నిధులతో మంత్రికి సంబంధం లేదా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంత్రి అహర్నిశలు కషి చేస్తున్నారని తెలిపారు. స్థాయిని మించి మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు స్వప్న జంగారెడ్డి,మమత కష్ణారెడ్డి, స్వప్న వెంకట్ రెడ్డి,దీపిక శేఖర్ రెడ్డి,లలిత కష్ణ,భారతమ్మ, అర్జున్,వై. రాంరెడ్డి, శివకుమార్, కో ఆప్షన్ సభ్యులు సమైక్య జ్యోతి అశోక్, రఘునందనా చారి, జగన్ మోహన్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వధువులకు మంగళసూత్రాలు, మెట్టెలు అందజేత

నవతెలంగాణ-నాగోల్

ఎల్బీనగర్ నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్‌కు చెందిన వధువు లహరితో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామానికి చెందిన సుజాతల వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్తా మంగళ సూత్రం, మెట్టెలు, చీరలు, గాజులను అందజేశారు. శనివారం వధువుల బంధువులు శ్రీనివాస్ గుప్తాను కలిశారు. వెంటనే ఆయన సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, మహబూబ్, రాజమౌళి, వధువుల తల్లిదండ్రులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేయాలని అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ అనితా రెడ్డి హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం వారు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం గౌరెల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెం. 206లో గ్రామానికి చెందిన దాసు గారి శ్రీనివాస్, దాసుగారి శోభ దాసుగారి ప్రసాద్, పోచగొని వరలక్ష్మి పోచగోని గణేష్, పోచగోని కిట్టులు గ్రామ కంఠం డాక్యుమెంట్లు చూపిస్తూ ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్టు సర్పంచ్ తుడుము మల్లేష్ గత నెల 18న ఇచ్చిన ఫిర్యాదు మేరకు గౌరెల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెం. 206లోని భూమిని స్థానిక వీఆర్ఏల సమక్షంలో గిర్దావరి/ రెవెన్యూ ఇన్స్పెక్టర్,మండల సర్వేయర్ నేతత్వంలో గత 30న సర్వే చేసి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని గుర్తించి, హద్దురాళ్లని తొలగించి బౌండరి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు.

అంచనాల్లో ఘనం - ఆచరణలో శూన్యం

- బోడుప్పల్ కార్పొరేషన్ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేత కొత్త కిషోర్ గౌడ్
- మూడేండ్ల అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్



నవతెలంగాణ-బోడుప్పల్

పైన పటారంలోన లోటారం తీరుగా బోడుప్పల్ మున్సి పల్ కార్పొరేషన్ బడ్జెట్ ఉందని మేడ్చల్ అసెంబ్లీ నియోజ కవర్గం కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ అన్నారు శనివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని క్రాంతి కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మూడేండ్లలో మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. అభివృద్ధి ఎక్కడ జరిగిందో మేయర్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్పొరేషన్ పరిధిలోని చాలా డివిజనల్లో ప్రజలకు కనీస సదుపాయాలు లేక నానా ఇబ్బందులు పడుతు న్నారన్నారు. కార్పొరేషన్ బడ్జెట్‌ను అతిగా చూపించి ఎంతో అభివద్ధి చేశామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మూడుసంవత్సరాల అభివద్ధి నివేదికలో బడ్జెట్ వివరాలు అంకెల గారడిగా ఉందని, అందులో ఏమాత్రం వాస్తవాలు లేవన్నారు. గతంలో కార్పొరేషన్ శానిటేషన్ నిర్వహణలో పలుమార్లు అవార్డులు పొందిందని, అయితే ప్రస్తుతం శానిటేషన్ నిర్వహణ పూర్తిగా అధ్వాన్నంగా ఉందన్నారు. బాధ్యతగల పౌరుడిగా మేయర్ ఏనాడు కార్పొరేటర్లతో కలసి కనీసం పదిహేను నిమిషాల పాటు కాలనీలలో పర్యటించిన దాఖలాలు లేవన్నారు. మేయర్ అవగాహన రాహిత్యం వల్ల కార్పొరేషన్‌లో పరిపాలన పూర్తిగా స్తంభించిపోయిందని, చాలా కాలనీలలో డ్రయినేజీ వ్యవస్థ దారుణంగా ఉందన్నారు. బోడుప్పల్ అంబేద్కర్ చౌరస్తా నుంచి మల్లాపురం, బొల్లిగూడెం, చిలుకానగర్, చెంగిచర్ల ప్రధాన రహదారుల పరిస్థితి కూడా అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం మేయర్ స్థానిక మంత్రికి ఏనాడైనా నిధుల మంజూరుకు ప్రయత్నం చేసిన సందర్భం లేదని పేర్కొన్నారు. ప్రజలు ఏ సమస్యను పరిష్కరించుకోవాలన్నా ఇన్వార్డులోనే వినతి పత్రాలు ఇవ్వాల్సి వస్తోందని, అధికా రులను కలుసుకునే అవకాశమే లేదన్నారు. ఇప్పటివరకు ముగ్గురు కమీషనర్లు మారడం వల్ల బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి పూర్తిగా కుంట పడుతోం దన్నారు. ప్రజా సమస్యలపై తమ పార్టీ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు, వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. దాదాపు అన్ని డివిజన్లలో పలు అభివద్ధిపనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికైనా పాలకపక్షం కార్పొరేషన్లో ప్రజల సమస్యలపై స్పందించి అభివద్ధిపై దృష్టి సారించాలని కొత్త కిశోర్ గౌడ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

అంతర్గత మురుగుకాలువ నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-తుర్కయాంజల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ 18వ వార్డు తొర్రూరులోని రాజీవ్ గహ కల్పలో 34వ 35వ బ్లాక్ నుంచి అవుట్లెట్ వరకు అంతర్గత మురుగు కాలువ నిర్మాణ పనులకు స్థానిక కౌన్సిలర్, తెలంగాణ పీసీసి సభ్యులు కాకుమాను సునీల్ శంకుస్థాపన చేశారు. వార్డు అభివద్ధి కి తన శాయశక్తుల కషి చేస్తానని హామీ ఇచ్చారు. కిషన్, డీనా రావు, భాస్కర్, నరసింహ, మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



13న జాతీయ రహదారి దిగ్బంధనం

నవతెలంగాణ -ఎల్బీనగర్

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా చేస్తున్న విజయవాడ జాతీయ రహదారిని దిగ్బంధనం కార్యక్రమం విజయవంతం చేయడం కోసం హైదరాబాద్, ఎల్బీనగర్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం కొత్తపేట బాబు జగ్జీవన్ భవన్ లో ఎంఆర్ ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి బత్తిని సుధాకర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ రాగటి సత్యం మాదిగ పాల్గొని మాట్లాడారు. వంద రోజుల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతామని చెప్పిన బీజేపీ న్యాయం చేయకుండా మోసం చేస్తూ వస్తున్నదని మండిపడ్డారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 13న ప్రధాని మోడీ రాకను నిరసిస్తూ విజయవాడ జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని పేర్కొన్నారు.అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పల పల్లి సోమశేఖర్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వీఎస్ రాజు మాదిగ, ఎం ఎస్ ఎఫ్ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ, ఎంఎస్ఎఫ్ కార్యదర్శి చెడిపల్లి రఘు మాదిగ, సీనియర్ నాయకులు ఏర్పుల విష్ణు, ఉప్పలయ్య, నరేందర్, శామ్యూల్, దర్శనం, పవన్ మాదిగ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం

- స్వల్ప ఆస్తి నష్టం



నవతెలంగాణ-ఉప్పల్

హైదరాబాద్‌లో మరో అగ్ని ప్రమాద ఘటన వెలుగుచూసింది. ఉప్పల్ పారిశ్రామిక వాడలో ప్లై వుడ్ గోదాంలో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంటలు ఎగిసిపడడంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మద్యాహ్నం 12 గంటల వరకు మూడు అగ్నిమాపక యంత్రాల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. జిల్లా అగ్నిమాపక అధికారి దగ్గర ఉండి పర్యవేక్షణ చేశారు. ప్రమాదానికి కారణాలు అగ్నిమాపక సిబ్బంది కానీ పరిశ్రమలో పనిచేసే కార్మికులు కానీ గోప్యంగా ఉంచారు. ఈ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగితే ఉండాల్సిన సంబంధిత పరికరాలు ఎలాంటివి లేవుని, ఈ పరిశ్రమకి అగ్నిమాపక అనుమతులు కూడా లేవని పరిశ్రమలోకి అడుగుపెట్టగానే అర్థం అవుతుంది. ఎలాంటి అగ్నిమాపక అనుమతులు లేకుండా ఒక ప్లైవుడ్ పరిశ్రమ నడపడం ఎలా సాధ్యం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అందులోను చెక్కకు సంబంధించిన పరిశ్రమ కాబట్టి ముందస్తుగా అగ్నిమాపక పరికరాలు ఉండాలి కానీ ఎలాంటి పరికరాలు లేవు. ఉప్పల్ పారిశ్రామిక వాడలో చాలా సంవత్సరాల నుంచి ఉన్నది కానీ అగ్నిమాపక అనుమతులు లేకపోవడం గమనార్హం. జిల్లా అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఈ పరిశ్రమకు అగ్నిమాపక అనుమతులు లేవని స్పష్టం అవుతోంది. స్వల్పంగా ఆస్తి నష్టం సంభవించిందని సమాచారం.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



నవతెలంగాణ-తుర్కయాంజల్

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని డీసీసీబీ వైస్ చైర్మెన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం తుర్కయాంజల్ 2వ ప్రీమియర్ లీగ్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తితో మెలగాలని, టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ స్కూల్ అధినేత పురుషోత్తం రెడ్డి,టోర్నమెంట్ ఆర్గనైజర్ గౌని ప్రశాంత్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోహన్ నగర్‌లో స్వచ్ఛ ఎల్‌బీ నగర్



నవతెలంగాణ -ఎల్బీనగర్

కొత్తపేట డివిజన్, మోహన్ నగర్‌లోని జన ప్రియ అపార్ట్మెంట్స్ వద్ద బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఎల్.బి నగర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ పవన్ కుమార్‌తో కలిసి అపార్ట్మెంట్ చుట్టూ పక్కల గడ్డి, చెత్తను శుభ్రం చేశారు. అనంతరం సామ రంగా రెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసీలో కమీషన్‌ల కోసం రాంకీ సంస్థకు పారిశుధ్య పనులు అప్పగించారని ఆరోపించారు. దాంతో కాలనీలలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీకి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. పారిశుధ్య కార్మికుల పై పెత్తనం చేలాయిస్తున్న రాంకి సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీలో చెత్త పెరుకపోతుంటే పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచడం లేదన్నారు. కార్మికుల సమస్యను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, కాలనీ వాసులు అశ్విన్ సింగ్, నాయకులు జంగా రెడ్డి, గీతా రెడ్డి, సుందర్ నారాయణ, మంచి రాజేష్, రమేష్ చారి, ఉపేందర్ సింగ్, శ్రీనివాస్ రెడ్డి, యాా రామకృష్ణ, కొత్త తిరుమల్, మోతీలాల్ నాయక్, గట్టు మహేష్, వెంకట్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బాలానగర్



తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన చేపట్టనున్న హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నా శివారెడ్డి కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించేందుకు ప్రతి కార్యకర్త ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాలు మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించేందుకు "చేయి చేయి కలుపుదాం కాంగ్రెస్ పార్టీని బలపరుద్దాం" అనే నినాదంతో ప్రజల ముందుకు వస్తున్నట్టు తెలిపారు.

ఏసీపీ సామాల వెంకట్ రెడ్డికి బీఆర్ఎస్ నాయకుల శుభాకాంక్షలు

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ డివిజన్ ఏసీపీగా నియామకమైన సామాల వెంకట్ రెడ్డిని మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం పట్టణ మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజశేకర్ రెడ్డి, కౌన్సిలర్లు తుడుం గణేశ్, బత్తుల శివ కుమార్ యాదవ్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, నాయకులు శ్రవణ్ కుమార్, నాగరాజు, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వడంలో సర్కార్ ఆలస్యం

నవతెలంగాణ-దుండిగల్



డబుల్ ఇండ్ల నిర్మాణాలు పూర్తయి ఏండ్లు గడుస్తున్నా ప్రభుత్వం అర్హులరు అందించడంలో ఆలస్యం చేస్తుందని సీఐటీయూ బాచుపల్లి ఏరియా నాయకులు ఎం.చంద్రశేఖర్ తెలిపారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక పిలుపు లో భాగంగా బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్, ఇందిరానగర్ బస్తీల్లో సర్వే చేసి లబ్దిదారులతో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం బాచుపల్లి మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండల అధికారి మంజులకి వినతి పత్రంతో పాటు లబ్దిదారుల దరఖాస్తులు అందజేసి సామాజిక సర్వే నిర్వహించి ఇండ్లు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రజానీకం బతుకుతెరువు కోసం ఏండ్లుగా హైదరాబాద్ నగరంలో అనేక బస్తీల్లో జీవిస్తున్నారాన్నారు. ధరల పెరుగుదల బడుగు జీవుల మీద శరాఘాతంగా మారి బతకలేని పరిస్థితుల్లో ఉండటానికి చారెడు జాగా లేక ఇల్లు లేక సంపాదిస్తున్న అతి తక్కువ జీతాల్లో అధిక భాగం కిరాయిలకు చెల్లించాల్సి వస్తుందన్నారు. జీవో 58, 59 ప్రకారం ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి ఉచితంగా పట్టాలు, రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించినట్టు తెలిపారు. అనేకమంది పేదలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ పట్టాలు పూర్తిగా అందరికీ ఇవ్వలేదన్నారు. 120 గజాల పైనున్న స్థలంలో నివసిస్తున్న వారికి అతి తక్కువ ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేస్తామనీ, భూముల ధరలు అధికం కావడంతో ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.లక్షలు, 15 లక్షల రుసుములు చెల్లించాలని చెప్పటం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పేదలను మభ్య పెట్టే మాటలు కట్టి పెట్టి అర్హులైన అందరికీ ఇండ్లు ఇండ్ల పట్టాలు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర వ్యాప్తంగా భూ పోరాటాలను ఉధృతం చేసి ప్రభుత్వం మెడలు వంచి పేదవాడి నివాస భూమి, ఇండ్లు సాధిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు ఎస్.ఎల్లమ్మ, స్థానిక నాయకులు నీరుడు యాదయ్య, బి.ప్రవీణ్, మాణిక్యం, బస్తీల నుంచి నీలమ్మ, కరుణ, సునీత, శ్రీకాంత్, ఉపేందర్, బి.రాజు, శ్రీను, శివ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను, బాలాజీనగర్ ఎంబజీ పార్కులో జరుగుతున్న పనులను ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్‌తో కార్పొరేటర్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సకాలంలో నిధులు మంజూరు చేస్తూ డివిజన్ అభివృధి కోసం దోహదపడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సీహెచ్ ప్రభాకర్ గౌడ్, ప్రగతి నగర్ బీఆర్ఎస్ కాలనీ ప్రెసిడెంట్ భూమండ్ల అశోక్, వినోద్ కుమార్, సుభాష్ గౌడ్, భాస్కర్ రావు, సుశీల్, శ్రీశైలం, శారద తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



సుభాష్‌నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం రాజీవ్ గృహకల్పలో సుమారు రూ.38 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో పూర్తి చేసుకున్న సీసీ రోడ్డును శనివారం కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తనను గెలిపించిన తర్వాత సుమారు రూ.125 కోట్లతో అభివృద్ధి పనులను చేసుకున్నమన్నారు. మిగిలిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజ పనులకు అధికారులతో ఎస్టిమేషన్ చేయించినట్టు తెలిపారు. ఈ ఎస్టిమేషన్‌లను, మునిసిపల్ అధికారులకు, వాటర్ వర్క్స్ ఎండీకి ఇచ్చి వీలైనంత త్వరలో మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. త్వరలోనే మిగిలిన పనులను కూడా పూర్తి చేస్తానని కార్పొరేటర్ హామీనిచ్చారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించడానికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప వాసులు, వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ పనులను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-దుండిగల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తుందనీ, మార్కెట్ పనులను వేగవంతం చేయాలని మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. కుతుబుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట్ లో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ జరుగుచున్న ఏర్పాట్లను శనివారం దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం దుండిగల్ తండా వద్ద గల రామ్‌కి (వేస్ట్ ప్రోసెసింగ్ యూనిట్) సందర్శించినారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.సత్యనారాయణ రావు, రెవెన్యూ ఆఫీసర్ బి.శ్రీహరి రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ జి.చంద్రయ్య, గార్గ్, కార్యదర్శి గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను రాజభవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషన్‌లో వారి పదవీ కాలానికి సంబంధించిన వార్షిక నివేదికను (2019-20 నుంచి 2020-21, 2021-22) అందజేశారు. **నవతెలంగాణ-సిటీబ్యూరో**

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు : ఎమ్మెల్యే కేపీ

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని బలపరుస్తూ శనివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అసెంబ్లీలో ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం ప్రారంభిస్తూ చెప్పిన కాళోజి మాటలు "పుట్టుక నీది " " చావు నీది " "బ్రతుకంతా దేశానిది". అనే మాటలకు నిలువెత్తు నిదర్శనం సీఎం కేసీఆర్ అన్నారు. చావు నోట్లో తలపెట్టి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ సాధించి, బంగారు తెలంగాణ దిశగా అభివృద్ధి చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లో (దేశ రాజధాని ఢిల్లీ) కరెంటు కోతలు ఉంటే తెలంగాణలో శాశ్వతంగా అధిగమించామని తెలిపారు. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కృషితో ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. తద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ప్రతి ప్రాంతంలో మెరుగైన మౌలిక వసతులు కల్పించామన్నారు.

ఎన్నికలకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకోవాలి




- శిక్షణ ముగింపు కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ డీఎస్.లోకేష్‌కుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

అసెంబ్లీ, పార్లమెంటరీ, స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ డీఎస్.లోకేష్‌కుమార్ సూచించారు. రాష్ట్ర స్థాయి ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారులకు (డిప్యూటీ తహశీల్దార్లకు) రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో శనివారం కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు అవసరమైన ముందస్తు పనులను గుర్తించి, వేగవంతంగా చర్యలు తీసుకునేందుకు రెండు రోజులపాటు ప్రత్యేకంగా ఎన్నికలపై శిక్షణ, పరీక్షలను నిర్వహించి వారికి అవగాహన కల్పించామని తెలిపారు. ఏఈఆర్‌ఓలు ఎప్పటికప్పుడు బీఎల్‌ఓ వద్ద ఉన్న ఎలక్ట్రోరోల్స్ చెకింగ్, ఓటరు ఐడీకి ఆధార్ అనుసంధానం, ఎన్నికలకు కావాల్సిన మెటీరియల్ మేనేజ్మెంట్, సిబ్బంది, టీమ్స్ ఏర్పాటు, ఈవీఎంల పనితీరు, ర్యాండమైజేషన్, వీవీప్యాట్‌లు వంటి పలు అంశాలపై డెంప్ (డిస్ట్రిక్ట్ ఎలక్షన్ మేనేజ్మెంట్ ప్లాన్)ను కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్ నుంచి పూర్తయ్యే వరకు చేపట్టాల్సిన పనులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ), స్ట్రాంగ్ రూమ్స్, విజిలెన్స్ టీమ్స్, స్వీప్ పనులు, కంట్రోల్ రూమ్ వంటి పలు అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికలకు సంబంధించి పీపుల్స్ రిప్రజెంటేటూవ్ యాక్ట్ 1951ను అనుసరించి ఎన్నికల రూల్స్ అయిన 49ఎంఏ, ఫారం -17బి, 17సిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన అన్ని మిషనరీలపై ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి అంశంపై సమగ్ర సమాచారం కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ఐదు టీమ్‌లు ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఎఫ్ఎస్‌టీ, ఏఎస్‌ట, అకౌంటింగ్ టీమ్స్‌ల ఏర్పాటులో క్రియాశీలకమైన వ్యక్తులను ఎంపిక చేయాలన్నారు. ఏఈఆర్‌ఓలు పోలింగ్ సిబ్బంది, నోడల్ అధికారులు, క్షేత్ర స్థాయి అధికారుల వెంట ప్రత్యేకంగా తమ సిబ్బందిని కేటాయించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. ఎన్నికలలో వచ్చే సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా కేవలం గోడల క్లీనింగ్, విగ్రహాలను కప్పి ఉంచడం వంటి పనులే కాకుండా కోడ్ ఉల్లంఘించిన ప్రతి కార్యక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీసీలో భాగంగా రాజకీయ నాయకులు వారు చేపట్టబోయే సమావేశాలు, ర్యాలీలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి, పరిమితికి లోబడి ఎన్నికల ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎంసీసీ ద్వారా ప్రజలకు ప్రజాస్వామ్యంపై నమ్మకం కలిగించేలా పారదర్శకంగా పని చేయాలన్నారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల పెట్టే ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కోడ్ ఉల్లంఘనలో ఒకరినొకరు దూషించుకోవడం, ఓటర్స్‌ను ప్రభావితం చేయడం, ఎన్నికల్లో పాల్గొనే నాయకుల వాగ్దానాలకు ఫండ్స్ ఏ విధంగా ఖర్చు పెట్టనున్నారో వంటి పలు అంశాలపై భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకోనున్నారు. ఎన్నికల్లో పోస్టల్ ఓటింగ్, సర్వీస్ ఓటర్లపై ప్రత్యేక చర్యలు తీసుకోలన్నారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన పూర్తిస్థాయి రోడ్ మ్యాప్‌ను రూపొందించుకోవాలని సూచించారు. సీఈఓ కార్యాలయం ఐటీ సెక్షన్ ప్రాజెక్ట్ మేనేజర్ డి.చిరంజీవులు మాట్లాడుతూ ఎన్నికల్లో టెక్నాలజి పరంగా ఈఎన్‌సీఓఆర్ఇ, సి-విజిల్, ఎన్‌జీఎస్, వెబ్ కాస్టింగ్ వంటి ఆన్‌లైన్ సేవలను ఏర్పాటు చేసేందుకు ఏఈఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈఓ సత్యావతి, ఏఎస్‌ఓ పాండు రంగారెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ సయ్యద్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ చెక్ పవర్ శ్రీశైలం యాదవ్‌కు ఇవ్వాలని తీర్మానం

నవతెలంగాణ-శామీర్‌పేట



మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఇన్‌చార్జి ఎంపీడీఓ రవి ఆధ్వర్యంలో సర్పంచ్ ఉడుతల జ్యోతి బలరాం గౌడ్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఉపసర్పంచ్ ప్రదీప్ చెక్ పవర్ కోల్పోవడంతో 7వ వార్డు సభ్యుడు శ్రీశైలం యాదవ్‌కు చెక్ పవర్ ఇవ్వాలని 4వ వార్డు సభ్యుడు సాయి కుమార్ ప్రతిపాదించగా 3వ వార్డు సభ్యులు వినోద్ కుమార్ బలపరచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీడీఓ రవి తీర్మానించారు. ఈ కార్యక్రమానికి వార్డు సభ్యులు వెంకటేష్, సుశీల, బాలమని హాజరవ్వగా నవనీత గైర్హాజరయ్యారు.

అర్హులకు డబుల్ బెడ్ రూం ఇండ్లివ్వాలి

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని ఎర్రం ప్రవీణ్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలో అనేకమంది పేదవాళ్లు ఇండ్లు లేక అద్దె ఇండ్లు, రేకుల షెడ్లలో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వర్షాకాలం వచ్చిందంటే వీరి బతుకులు దుర్భారంగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా మేడ్చల్ పట్టణంలోని నాలుగో వార్డులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇప్పటివరకు పంపిణీ చేయకపోవడం విడ్డూరమన్నారు. స్థలం ఉండి ఇంటిని నిర్మించుకోవడానికి రూ.3 లక్షల రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయం చేయకుండా నేరుగా నిజమైన లబ్దిదారులకే పంపిణీ చేయాలని కోరారు.

సందడి షురూ

● నేడు ఈవీ బైక్ ర్యాలీ

ఈ రేసు ముంగిట వరుస ఈవెంట్లు



నవతెలంగాణ-హైదరాబాద్ : ప్రతిష్టాత్మక హైదరాబాద్ గ్రాండ్ ప్రీకి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరి 11న హుస్సేన్‌సాగర్ తీరంలో 2.835 కిలోమీటర్ల స్ట్రీట్‌సర్క్యూట్‌పై ఫార్ములా ఈ రేసుకు రంగం సిద్ధమవుతుండగా.. మరోవైపు ఈ రేసు ముంగిట హైదరాబాద్ వరుసగా ఈవెంట్లు ప్రణాళిక చేశారు. ప్రపంచ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) ఏబీబీ ఫార్ములా-ఈ రేసులో పోటీపడేవి అన్నీ ఎలక్ట్రిక్ రేసింగ్ కార్లే. హైదరాబాద్ గ్రాండ్ ప్రీ రేసులో గంటకు 322 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే థర్డ్ జనరేషన్ రేసు కార్లు దానంక్వపోనున్నాయి. ఫార్ములా-ఈ ఈవెంట్ రేసింగ్ ప్రియులతో ఎలక్ట్రిక్ వాహనాల రంగానికి సైతం ఉత్సాహం తీసుకొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం సస్టెయినబుల్ ఈ ఫ్యూచర్‌లో భాగంగా హైదరాబాద్ ఈ మొబిలిటీ వీక్‌ను నిర్వహిస్తుంది. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు వరుస కార్యక్రమాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో భారీ స్థాయిలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా, నేడు ఎలక్ట్రిక్ వెహికిల్స్ ర్యాలీ నిర్వహించనున్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా 300 మంది స్త్రీ, పురుష రైడర్లు ద్విచక్ర, త్రిచక్ర ఎలక్ట్రిక్ వెహికిల్స్‌తో ర్యాలీ చేయనున్నారు. ఎలక్ట్రిక్ వెహికిల్స్‌పై అవగాహన కలిగించేందుకు ఈ ర్యాలీ చేపట్టనున్నారు. ఇక 6న, మొబిలిటీ నెక్ట్స్ గ్లోబల్ సస్టెయినబుల్ సదస్సు ఉండనుంది. పర్యావరణవేత్తలు, వాహన రంగ నిపుణులు ఈ సదస్సులో ప్రసంగించనున్నారు. 7న, సీఏఎస్ఈ మొబిలిటీ ది గ్రాండ్ స్టార్టప్ చాలెంజ్‌లో భాగంగా టీ హబ్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ రంగంలో ఆవిష్కరణలపై చర్చించనున్నారు. చివరగా 8, 9న హైదరాబాద్ ఈ మోటార్ ఎక్స్‌పో ఉండనుంది. దేశంలో తొలిసారి ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఎక్స్‌పోకు హైదరాబాద్‌కు వేదిక కానుంది. ఈ ఎక్స్‌పోలో ద్వి చక్ర వాహనాల నుంచి ఎస్‌యూ వెహికల్స్ వరకూ అన్నింటికి ప్రదర్శించనున్నారు. ఎక్స్‌పో అనంతరం ఫిబ్రవరి 10, 11న హైదరాబాద్ గ్రాండ్ ప్రీ జరుగనుంది.

రివర్స్ స్వింగ్

స్పిన్ పిచ్‌లపై సరికొత్త ఆయుధం

ఇరు జట్లకూ సవాల్

భారత్, ఆస్ట్రేలియా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సమరానికి కౌంట్‌డౌన్ మొదలైంది. టీమ్ ఇండియా నాగ్‌పూర్‌లో సాధన చేస్తుండగా, కంగారూలు బెంగళూర్‌లో కసరత్తు చేస్తున్నారు. అగ్ర జట్లు పోటీపడుతున్న నాలుగు టెస్టుల సిరీస్‌లో ఇప్పుడు చర్చంతా 'స్పిన్‌'పైనే. అయితే, స్పిన్ పిచ్‌లపై ఇప్పుడు రివర్స్ స్వింగ్ సైతం బౌలర్లకు సరికొత్త ఆయుధంగా మారింది.

నవతెలంగాణ క్రీడావిభాగం



సరికొత్త ఆయుధం

బోర్డర్-గవాస్కర్ టెస్టు సిరీస్ యాషెస్‌ను తలపిస్తోంది. ఇటు భారత్, అటు ఆస్ట్రేలియా ఆధిపత్యం కోసం అన్ని అస్త్రాలు ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నాయి. స్వదేశంలో వరుస సిరీస్‌లు కోల్పోయిన ఆస్ట్రేలియా.. ఇప్పుడు భారత్‌పై భారత్‌లో విజయం సాధించే కాంక్షతో కనిపిస్తోంది. 2016-17 పర్యటనలో ఆస్ట్రేలియాకు ఆరంభంలో ఆధిక్యం లభించినా.. ఆ తర్వాత భారత స్పిన్ దాడికి నిలబడలేకపోయింది. దీంతో ఈ ఏడాది భారత్‌లో స్పిన్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు సిడ్నీలో ప్రత్యేకంగా తయారు చేసిన స్పిన్ ట్రాక్‌పై వారం రోజులు సాధన చేసింది. బెంగళూర్‌లో సైతం స్పిన్ పిచ్‌లపై మ్యాచ్ పరిస్థితులు సృష్టించుకుని సాధన చేస్తుంది. భారత్‌లో స్పిన్ ప్రభావం సహజంగానే ఉంటుంది. కానీ స్పిన్ తరహాలో పేసర్లు సైతం విజృంభించే అవకాశం ఉంది. అదే, రివర్స్ స్వింగ్. బంతిపై మెరుపు చెదిరిపోగానే కెప్టెన్లు పేసర్ల వైపు చూస్తున్నారు. కొందరు పేసర్లు కొత్త బంతితో సైతం రివర్స్ స్వింగ్ రాబట్టే నైపుణ్యం సాధించారు. భారత్-ఏ, ఆస్ట్రేలియా-ఏ బెంగళూర్ (2018) అనధికార టెస్టులో రివర్స్ స్వింగ్‌తో మహ్మద్ సిరాజ్ ఏకంగా 8 వికెట్లు పడగొట్టాడు. శ్రీలంక, పాకిస్థాన్ పర్యటనల్లో సైతం ఆస్ట్రేలియాకు రివర్స్ స్వింగ్ దెబ్బ తెలిసొచ్చింది.

'పాకిస్థాన్, శ్రీలంక పర్యటనలకు వెళ్లినప్పుడూ, అందరూ స్పిన్ గురించి చర్చించారు. కానీ నేను రివర్స్ స్వింగ్ ఎదుర్కొనేందుకు ఎక్కువగా ఇబ్బంది పడ్డాను. 2018లో బెంగళూర్‌లో నాలుగు రోజుల మ్యాచ్ ఆడాను. బంతి రివర్స్ స్వింగ్‌కు అనుకూలిస్తే ఇరు జట్ల పేసర్లు ఎంత ప్రభావం చూపించగలరో అప్పుడే తొలిసారి తెలిసింది' అని ఆస్ట్రేలియా ఆటగాడు అలెక్స్ కేరీ పేర్కొన్నాడు.

బజ్‌బాల్ ఏం లేదు!

టెస్టు క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తున్న పేరు బజ్‌బాల్. ఇంగ్లాండ్ టెస్టు జట్టు చీఫ్ కోచ్‌గా బ్రెండన్ మెక్‌కలమ్ బాధ్యతలు అందుకోగా.. ఇంగ్లీష్ జట్టు ఆటతీరు మారిపోయింది. ఐదు రోజుల ఆటలోనూ ఇంగ్లాండ్ ధనాధన్ జోరు చూపిస్తుంది. అదే ప్రణాళికలతో ఇటీవల పాకిస్థాన్‌పై టెస్టు సిరీస్‌ను స్వీప్ చేసింది. భారత్‌పై ఆస్ట్రేలియా దూకుడు ప్రణాళికలతో రాలేదని అలెక్స్ అన్నాడు. 'నేను ఎక్కువగా స్వీప్ షాట్లు ఆడతాను. గాలెలో రెండు టెస్టులు ఆడాను, అక్కడ రెండు రకాల పిచ్‌లు ఎదురయ్యాయి. స్పిన్, పేస్, స్వింగ్.. ఎలా విధమైన పిచ్ ఎదురవుతుందనే ఆలోచన లేకుండా ఓపెన్ మైండ్‌తో సిరీస్‌కు వచ్చాం. టెస్టు సవాల్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఇంగ్లాండ్ తరహాలో ఎదురుదాడి ప్రణాళికలు మాకు లేవు. ఆస్ట్రేలియా శిబిరంలో ఓ ఆటగాడికి అనువైన శైలిలో అతడు ఆడేందుకు స్వేచ్ఛ ఉంది. అందరూ వ్యక్తిగత శైలి ప్రకారమే ఆడతారు' అని అలెక్స్ తెలిపాడు.

పిచ్‌లపై ఆసక్తి

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఎదురయ్యే పిచ్‌లపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది. స్పిన్ స్వర్గధామ పిచ్‌లతో ఆస్ట్రేలియాను చిత్తు చేసే యోచన భారత్‌కు ఉన్నప్పటికీ.. పూర్తిగా ర్యాంక్ టర్నర్‌లను తయారు చేసే అవకాశం లేదు. ఇటీవల బంగ్లాదేశ్‌తో టెస్టుల్లో నాణ్యమైన స్పిన్ ఎదుర్కొనేందుకు భారత బ్యాటర్లు సైతం ఇక్కట్లు పడ్డారు. షకిబ్ అల్ హసన్, మెహది హసన్ మిరాజ్‌లు భారత బ్యాటర్లను వణికించారు. విరాట్ కోహ్లి, చతేశ్వర్ పుజారా స్పిన్‌పై సరిగా ఆడటం లేదు. దీంతో స్పిన్‌కు కాస్త మొగ్గు ఉండే పిచ్‌లను తయారు చేయటంపై దృష్టి నిలిపినట్టు తెలుస్తుంది. జీవం లేని పిచ్‌లపై సైతం ప్రభావం వికెట్లు పడగొట్టే ప్రత్యేక ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ సొంతం. ప్రత్యర్థి శిబిరం బలాలు, బలహీనతలను సైతం పరిగణనలోకి తీసుకుని టెస్టు మ్యాచ్‌లకు పిచ్‌లను సిద్ధం చేయనున్నారు. భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టు ఫిబ్రవరి 9న నాగ్‌పూర్‌లో ఆరంభం కానుంది.

మీ విజయం యువతకు

స్ఫూర్తిదాయకం

● త్రిష, యశశ్రీలతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



త్రిష, యశశ్రీ, శాలినీలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన శాట్స్ ఛైర్మెన్ ఆంజనేయ గౌడ్

నవతెలంగాణ, హైదరాబాద్

'మీ విజయం (త్రిష, యశశ్రీ) రాష్ట్ర యువతకు స్ఫూర్తిదాయకం. భారత జట్టు విజయంలో త్రిష వెన్నెముకలా నిలిచింది. తెలంగాణ బిడ్డలు దేశం గర్వపడే ప్రదర్శన చేశారు' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు.ఐసీసీ అండర్-19 టీ20 ప్రపంచకప్ విజేతలుగా నిలిచిన భారత జట్టులో సభ్యులైన తెలంగాణ క్రికెటర్లు గొంగడి త్రిష, యశశ్రీ సహా జట్టు ఫిట్‌నెస్ ట్రైనర్ శాలినీలను ఎమ్మెల్సీ కవిత శుక్రవారం తన నివాసంలో అభినందించారు. త్రిష, యశశ్రీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం లభిస్తుందని, హెచ్‌సీఏ అధికారులు సైతం యువ క్రీడాకారిణీలకు అవసరైన సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అభినందన కార్యక్రమంలో శాట్స్ ఛైర్మెన్ ఆంజనేయ గౌడ్, హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్. విజయానంద్ సహా త్రిష, యశశ్రీ కుటుంబ సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

సెమీస్‌లో సౌరాష్ట్ర

పంజాబ్‌పై ఘన విజయం



రాజ్‌కోట్ : సౌరాష్ట్ర రంజీ ట్రోఫీ సెమీఫైనల్‌కు చేరుకుంది. ఉత్కంఠగా సాగిన పంజాబ్‌తో క్వార్టర్‌ఫైనల్లో సౌరాష్ట్ర 71 పరుగుల తేడాతో గెలుపొందింది. 252 పరుగుల ఊరించే ఛేదనలో పంజాబ్ చతికిల పడింది. సౌరాష్ట్ర లెఫ్టార్మ్ స్పిన్నర్ పార్థ్ భట్ (5/89) ఐదు వికెట్లతో మాయజాలం ప్రదర్శించాడు. 89.1 ఓవర్లలో 180 పరుగులకే పంజాబ్ కుప్పకూలింది. మన్‌దీప్ సింగ్ (45), మాన్ (42), మినహా మరో బ్యాటర్ ఛేదనలో రాణించలేదు.

సౌరాష్ట్ర వరుసగా 303, 379 పరుగులు చేయగా.. పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగులు చేసింది. బ్యాట్‌తో 111, 51 ఇన్నింగ్స్‌లు బాదిన పార్థ్.. బంతితో 8 వికెట్లు పడగొట్టి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో మధ్యప్రదేశ్‌తో బెంగాల్.. కర్నాటకతో సౌరాష్ట్ర తలపడనున్నాయి.

దీపపై 21 నెలల నిషేధం

● నిషేధిత ఉత్ప్రేరకంపై వాడా చర్య



న్యూఢిల్లీ : భారత స్టార్ జిమ్నాస్ట్ దీప కర్మాకర్ 21 నెలల నిషేధం ఎదుర్కొంటుంది. వాడా నిషేధిత జాబితాలోని ఉత్ప్రేరకం దీప కర్మాకర్ శాంపిల్‌లో కనిపించింది. అవగాహన లోపం, తెలియకుండానే ఔషధం రూపంలో నిషేధిత ఉత్ప్రేరకం తీసుకున్నట్టు దీప కర్మాకర్ అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ సమాఖ్యతో తెలిపింది. దీప కర్మాకర్ వాంగూల్మం అనంతరం మూడు నెలల నిషేధం కుదించిన వాడా.. రెండున్నర నెలల ముందు నుంచే నిషేధం అమలు చేసింది. అక్టోబర్ 2021 నుంచి నిషేధం అమల్లో ఉండగా..ఈ ఏడాది జులైలో ముగియనుంది. 2017లో ఏసీఎల్ గాయంతో జిమ్నాస్టిక్స్‌కు దూరమైన దీప కర్మాకర్.. 2016 రియో ఒలింపిక్స్‌లో తృటిలో పతకం చేజార్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జులైలో పునరాగమనం కోసం సిద్ధమవుతున్నట్టు దీప కర్మాకర్ వెల్లడించింది.

సెమీస్‌లో నంద్యాల జోడీ

హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ



నవతెలంగాణ-హైదరాబాద్: 12వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మాదాపూర్ డిసిపి, హెచ్‌ఓటీఏ అధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి జోరు కొనసాగుతోంది. పురుషుల 50 ప్లస్ విభాగంలో నంద్యాల నర్సింహారెడ్డి జోడీ వరుసగా రెండో సీజన్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచుల్లో నంద్యాల నర్సింహారెడ్డి, నీల్‌కాంత్ జోడీ సాధికారిక విజయం నమోదు చేసింది. సంజయ్, సురేశ్ జోడీపై 8-1తో గెలుపొంది క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న నంద్యాల జోడీ.. క్వార్టర్స్‌లో మరింత దూకుడు ప్రదర్శించింది. అమిత్, శ్రీనివాస్ రెడ్డి జోడీపై 8-0తో విజయం సాధించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల 50 ప్లస్ సింగిల్స్ విభాగంలో నార్త్‌జోన్ ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి సైతం సెమీస్‌లో అడుగుపెట్టారు. క్వార్టర్‌ఫైనల్లో చంద్రశేఖర్‌పై 8-3తో విజయం సాధించి సెమీస్‌కు చేరుకున్నాడు. ఈ విభాగంలో నీల్‌కాంత్, మూర్తి కూడా సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. మెన్స్ 40 ప్లస్ విభాగంలో సంజయ్, బోస్.. మెన్స్ 30 ప్లస్ విభాగంలో విజయ్ ఆనంద్, రాజాలు సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇక మహిళల ఓపెన్ విభాగం విజేతగా సౌమ్య నాయుడు నిలిచింది. టైటిల్ పోరులో నీలం అగర్వాల్‌పై 9-3తో సౌమ్య నాయుడు అలవోక విజయం నమోదు చేసింది.

మూగబోయిన సుమధురవాణి



వాణీజయరాం

పాటలోని భావం ఏదైనా సరే ఆమె గొంతులోనుంచి జాలువారితే చాలు.. ఎంతో శ్రావ్యంగా ఉంటుంది. ఎన్నో ఆణిముత్యాల్లాంటి పాటలతో సంగీత ప్రియులను అలరించిన అగ్ర గాయనిమణి వాణీజయరాం. అసలు సినిమాల్లో పాడాతానా లేదా అనే మీమాంసలో ఉన్న ఆమె ఏకంగా 19 భాషల్లో 20 వేలకు పైగా పాటలు పాడటం విశేషం. ఎందుకంటే వారి ఇంట్లో శాస్త్రీయ సంగీతం తప్ప మరొకటి వినిపించడానికి వీల్లేదు. కనీసం లలిత గీతాలు కూడా పాడనిచ్చేవారు కాదు. ఇక సినిమాలన్నా, సినిమా పాటలన్నా సంపూర్ణ నిషేధం. సినీ గీతాలు విన్నా, పాడినా శాస్త్రీయ సంగీతానికి అవమానం జరిగినట్టు భావించేవారు. ఇలాంటి పరిస్థితుల్లో సినీ గీతాలపై ఆసక్తి పెంచుకున్న వాణీజయరాం ఐదు దశాబ్దాలుగా సినీ సంగీత ప్రపంచంలో అగ్రగాయనిగా రాణించటం మామూలు విషయం కాదు. రాబోయే తరాల మదిలోనూ తన సుమధుర గానామృతంతో సజీవంగా నిలిచి ఉండే వాణీజయరాం సినీ గీత ప్రస్థానంలోని కొన్ని విశేషాలు..

సంగీత నేపథ్య కుటుంబం

వాణీజయరాం (అసలు పేరు కలైవాణి). తమిళనాడులోని వేలూరులో 1945 నవంబర్ 30న పుట్టారు. అమ్మ పద్మావతి. నాన్న దొరైస్వామి. అమ్మ పద్మావతి చక్కగా పాడటమే కాకుండా వీణ కూడా వాయించేవారు. పదకొండు మంది పిల్లల్లో వాణిజయరాం ఎనిమిదో సంతానం. సంగీత నేపథ్యం ఉన్న కుటుంబం. కడలూరు శ్రీనివాస అయ్యంగార్ అనే విద్వాంసుని దగ్గర సంగీతం నేర్చుకున్నారు. తర్వాత టి.ఆర్.బాలసుబ్రమణియన్, త్రివేంద్రం ఆర్.ఎస్.మణి వంటి సంగీతజ్ఞుల దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు.

ఆల్ ఇండియా రేడియోలో తొలిపాట

పదేళ్ళ వయసులో స్కూల్ తరఫున ఆల్ ఇండియా రేడియోలో పాటలు పాడే అవకాశం వచ్చింది. అలా తొలిసారి ఆమె గొంతు బాహ్య ప్రపంచానికి వినిపించింది. అక్కడ్నుంచి తరచూ వివిధ రేడియో కార్యక్రమాల్లో పాటలు పాడారు. ఇంట్లో శాస్త్రీయ సంగీతం తప్ప మరొకటి వినిపించడానికి వీల్లేదు. ఇక సినిమాలన్నా సినిమా పాటలన్నా సంపూర్ణ నిషేధం. ఇలాంటి పరిస్థితుల్లో ఆమెకు సినీ గీతాలపై ఆసక్తి పెరిగింది. ఇంట్లో ఉన్న రేడియోలో వివిధ భారతి ప్రోగ్రామ్‌లో వచ్చే సినిమా పాటలను దొంగచాటుగా వినేవారు. విన్న పాటల్ని నేపథ్య సంగీతంతో సహా కంఠతా పెట్టేవారు. అంతేకాదు ఎప్పటికైనా సినిమాల్లో పాడాలి అనే ధృఢ నిర్ణయానికి వచ్చారు. స్కూల్ అయ్యాక చెన్నైలోని క్వీన్స్‌మేరీ కాలేజీలో జాయిన్ అయ్యారు. ఎకనామిక్స్‌లో డిగ్రీ చేశారు. తర్వాత స్టేట్ బ్యాంక్ ఇండియాలో ఉద్యోగం రావడంతో హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యారు. ముంబాయి ఇండో బెల్జియం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా పని చేస్తున్న జయరాంతో వివాహం జరిగింది. దీంతో భర్తతో పాటు ముంబాయికి వచ్చారు. ముంబాయికి రావడమే ఆమె జీవితంలో ఊహించని మలుపు అయ్యింది.

భర్త ప్రోత్సాహంతో

భర్తకి కూడా సంగీతం అంటే అభిమానం. పండిట్ రవిశంకర్ దగ్గర ఆరేళ్లపాటు ఆయన సితార్ నేర్చుకున్నారు. కర్నాటిక్, శాస్త్రీయం నేర్చుకున్న వాణిని హిందుస్థానీ కూడా నేర్చుకో అని ప్రోత్సహించారు. దీంతో ఉస్తాద్ అబ్దుల్ రహమాన్ సాబ్ దగ్గర సంగీత పాఠాలు నేర్చుకున్నారు. దాదాపు ఆరు నెలల కఠిన శిక్షణ తరువాత గురువు ఉస్తాద్ అబ్దుల్ ఇచ్చిన సలహా మేరకు ఉద్యోగం మానేసి పూర్తి సమయాన్ని సంగీతానికి కేటాయించారు. 1969లో ముంబాయిలో తొలి కచేరి ఇచ్చారు. ఈ కచేరీలో మంచి పేరు రావడంతో వరుస కచేరీలకు ఆఫర్లు వచ్చాయి. అలా ఓ కచేరీకి ప్రముఖ బాలీవుడ్ సంగీత దర్శకుడు వసంత్‌దేశాయ్ వచ్చారు. ఆయనకు వాణి గొంతు బాగా నచ్చటంతో గుల్జార్‌కి సిఫారసు చేశారు. అప్పుడు ఆమెతో గుల్జార్ 'మీరాభజన్స్' పాడించారు. ఇది ఆమె తొలి రికార్డింగ్.

తొలిపాటకే ఐదు అవార్డులు..

1970లో హృశికేష్ ముఖర్జీ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'గుడ్డీ' చిత్రంలో పాటలు పాడే అవకాశం వచ్చింది. వసంత్ దేశాయ్ సంగీత ఆధ్వర్యంలో వాణీ మూడు పాటలు పాడారు. వీటిల్లో ధరేంద్ర, జయబాధురీ జంటపై చిత్రీకరించిన 'బోలే రే పపి..' పాట అప్పట్లో సూపర్‌హిట్ అయింది. దానికి తాన్‌సేన్ అవార్డుతోపాటు మరో నాలుగు అవార్డులు వచ్చాయి. మొదటి పాటకే వాణీ మంచి గాయనిగా గుర్తింపు పొందారు. అంతేకాదు సినిమాల్లో పాడాలనే కల కూడా నేరవేరింది. 1972లో మరో ప్రముఖ సంగీత దర్శకుడు నౌషద్ నేతృత్వంలో 'పాకీజా' సినిమాలో పాడిన పాటలన్ని హిట్ కావడంతో సినిమా అవకాశాలు ఓ వెల్లువలా వచ్చాయి. దీంతో ఆర్.డి.బర్మన్, నౌషద్, మదన్‌మోహన్, ఓపీ నయ్యర్, లక్ష్మీకాంత్ ప్యారేలాల్, పండిట్ రవిశంకర్ వంటి తదితర హేమాహేమీ సంగీత దర్శకులతో పని చేసే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. అలాగే మహ్మద్ రఫీ, కిషోర్‌కుమార్ వంటి అగ్ర నేపథ్య గాయకులతోనూ కలిసి పాడే అవకాశాన్ని దక్కించుకున్నారు. గాయనిగా బాలీవుడ్‌లో ఓ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకున్నారు.

తెలుగులోనూ ప్రత్యేకతను చాటుకున్నారు

అగ్ర సంగీత దర్శకుడు ఎస్.పి.కోదండపాణి కోరిక మేరకు 'అభిమానవంతుడు' చిత్రంలో 'ఎప్పటివలె కాదురా స్వామి' అనే పాటను పాడారు. ఇదే వాణీకి తెలుగులో తొలి చిత్రం. తెలుగులో దిగ్గజ సంగీత దర్శకులు పెండ్యాల నాగేశ్వరరావు, కె.చక్రవర్తి, ఎస్.రాజేశ్వరరావు, రాజన్ -నాగేంద్ర, విజయభాస్కర్, ఎం.ఎస్.విశ్వనాథన్, కె.వి.మహదేవన్, మాస్టర్ వేణు, జె.వి.రాఘవులు, ఇళయరాజా, సుసర్ల దక్షిణామూర్తి, కె.భాగ్యరాజా, ఏ.ఆర్.రెహ్మాన్ తదితరులు సంగీత నేతృత్వం వహించిన దీక్ష, పూజ, మరో చరిత్ర, గుప్పెడు మనసు, సర్కస్ రాముడు, మా ఇంటి దేవత, శంకరాభరణం, శివమెత్తిన సత్యం, సీతాకోక చిలుక, మంగమ్మగారి మనవుడు, సంకీర్తన, శృతిలయలు, నేనూ మీవాడినే, స్వర్ణకమలం, ఘర్షణ, స్వాతికిరణం, ప్రేమాలయం వంటి తదితర ఎన్నో తెలుగు సినిమాల్లో వేల పాటలు పాడి అలరించారు.

సూపర్‌హిట్ తెలుగు సాంగ్స్


'ఎన్నెన్నో జన్మల బంధం నీది నాది', 'పూజ చేయ..', 'విధి చేయు వింతలన్ని..', 'కన్నె వలపు.. కన్నె పిలుపు..', 'బ్రోచేవారెవరురా..', 'దొరకునా ఇటు వంటి సేవా..', 'మానస సంచారే..', 'పలుకే బంగారమాయెనే', 'ఏ తీరుగా నిను..', 'మిన్నేటి సూర్యుడు వచ్చాడమ్మా..', 'సాగర సంగమమే..', 'అలలు..కలలు..', 'ఇన్ని రాశుల యునికి..', 'అందెల రవళి..', 'ఒక బృందావనం..సోయగం..', 'తెలిమంచు కురిసింది..', 'ప్రణతి..ప్రణతి..', 'శృతి నీవు. వంటి ఎన్నో తెలుగు పాటలు సంగీత ప్రియుల మనసుల్ని దోచాయి.

19 భాషల్లో 20 వేలకు పైగా పాటలు

తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, మలయాళం, మరాఠి, గుజరాతీ, అస్సామీ, తులు, బెంగాలీ, భోజ్‌పురి, ఇలా దాదాపు 19 దేశీయ భాషల్లో 1000కి పైగా చిత్రాల్లో 10 వేలకి పైగా భిన్న పాటలు పాడారు. అలాగే 10వేలకు పైగా ప్రైవేట్ ఆల్బమ్స్ కోసం భక్తి పాటలు, ఇతర పాటలను ఆలపించారు. కె.బాలచందర్ 'అపూర్వ రాగంళ్' (1975), కె.విశ్వనాథ్, 'శంకరాభరణం' (1980)లోని 'మానస సంచారే..' పాటకు, కె.విశ్వనాథ్ 'స్వాతికిరణం' (1991) చిత్రంలోని 'ఆనతి నియ్యరా హరా..'పాటకు జాతీయ ఉత్తమగాయనిగా పురస్కారాలను దక్కించుకున్నారు. 'శంకరాభరణం' చిత్రానికి ఉత్తమ గాయనిగా నంది అవార్డు పొందారు. అలాగే తమిళం, గుజరాత్, ఒడిస్సా రాష్ట్ర అవార్డులను సైతం ఉత్తమగాయనిగా సొంతం చేసుకున్నారు. వీటితోపాటు ఎన్నో ఫిల్మ్ ఫేర్ పురస్కారాలనూ దక్కించుకున్నారు. ఐదు దశాబ్దాలుగా సంగీత రంగంలో ఆమె చేసిన సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. వేల పాటలతో ఆబాలగోపాలాన్ని అలరించిన వాణీజయరాం మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

నవచిత్రం

అమిగోస్.. మిమ్మల్ని నిరుత్సాహపరచదు



కళ్యాణ్‌రామ్

కళ్యాణ్ రామ్ త్రిపాత్రాభినయంలో నటించిన తాజా చిత్రం 'అమిగోస్'. రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 10న గ్రాండ్ లెవల్లో సినిమా రిలీజ్ కానుంది. శుక్రవారం ఈ చిత్ర ట్రైలర్‌ను కర్నూలులో చిత్ర యూనిట్ విడుదల చేసింది.

ఈ కార్యక్రమంలో యలమంచిలి రవి శంకర్ మాట్లాడుతూ, 'సినిమా మేం చూశాం. ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. రాజేందర్ రెడ్డి తొలి సినిమానే అయినప్పటికీ అత్యద్భుతంగా తెరకెక్కించాడు. సౌందర్ రాజన్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. కళ్యాణ్ రామ్ పెర్ఫామెన్స్ నెక్ట్స్ లెవల్‌లో ఉంటుంది. హీరోయిన్ ఆషికా రంగనాథ్ చక్కగా నటించింది. ఫస్టాఫ్ చాలా బావుంది. సెకండాఫ్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది. సినిమాను ఆసాంతం ఆస్వాదిస్తారు' అని తెలిపారు. '2022లో బింబిసార సినిమాతో మీ ముందుకు వచ్చాను. కొత్త సినిమాలను చేసిన ప్రతీసారి ప్రేక్షకులు ఆదరిస్తూనే వచ్చారు. ముగ్గురు మధ్య జరిగే కథ ఇది. థియేటర్‌లో మీరు డిసప్పాయింట్ కారు. మీరు మాపై చూపించే అభిమానానికి ఇంకో సూపర్ హిట్ సినిమా రాబోతుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు తమ్ముడు తారక్ గెస్ట్‌గా వస్తున్నాడు' అని కళ్యాణ్ రామ్ చెప్పారు.

ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్



విజయానందంలో 'బుట్టబొమ్మ' చిత్ర బృందం

సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన ఆసక్తికరమైన చిత్రం 'బుట్ట బొమ్మ'. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ భాగస్వామ్యంతో రూపొందిన ఈ చిత్రానికి సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మాతలు.

అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ రొమాంటిక్ థ్రిల్లర్‌తో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. శనివారం థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శౌరి చంద్రశేఖర్ రమేష్ మాట్లాడుతూ, 'సినిమా బాగుందని యూఎస్ నుంచి కూడా కాల్స్ వస్తున్నాయి. ఇక్కడ కూడా మార్నింగ్ షో నుంచే పాజిటివ్ టాక్ వస్తోంది. ఇది లవ్ స్టోరీ నుంచి థ్రిల్లర్ గామారే కథ అయినప్పటికీ.. ఇది కుటుంబమంతా కలిసి చూడదగ్గ సినిమా' అని తెలిపారు. 'ప్రేక్షకుల నుంచి, మీడియా నుంచి వస్తున్న స్పందన పట్ల చాలా సంతోషంగా ఉన్నాం' అని నటుడు అర్జున్ దాస్ అన్నారు. మరో నటుడు సూర్య వశిష్ఠ మాట్లాడుతూ, 'మేము ప్రేక్షకులతో కలిసి సినిమా చూశాం. ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వచ్చింది. సినిమా మీద మేం పెట్టుకున్న నమ్మకం నిజమైనందుకు చాలా సంతోషంగా ఉంది' అని చెప్పారు. 'మేం ఎంతో ఇష్టపడి చేసిన మా సినిమాకు ఇంతమంచి స్పందన రావడం చాలా సంతోషంగా ఉంది. మమ్మల్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని నటి అనిఖా సురేంద్రన్ తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.